




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 28, సంచిక: 342 | శనివారం | 06-06-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


### నేడు సిజెపి నిరసన ప్రదర్శన

ఆన్‌లైన్‌లో వేగంగా ఆదరణ పొందిన యువత నేతృత్వంలోని సోషల్ మీడియా ఉద్యమం 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సిజెపి), కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ శనివారం న్యూఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపట్టడానికి సన్నద్ధమవుతోంది. ఈ నిరసన కార్యక్రమానికి సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే పిలుపునిచ్చారు. తాను భారత్‌కు తిరిగి వచ్చి, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన ప్రదర్శనకు నాయకత్వం వహిస్తానని ఆయన ప్రకటించారు.

## త్వరలో కొత్త రాజకీయ పార్టీ

తమిళనాడులో వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తా : అన్నామలై

బిజెపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా

## రెబల్స్‌ను బుజ్జగిస్తున్న మమత

## మణిపూర్‌లో దుండగులు దాడి

07

# పాలమూరులో బిఆర్ఎస్ జెండా ఎగరనివ్వం

పొరుగు రాష్ట్రంతో చర్చలు జరిపి డిసెంబర్‌లోగా పాలమూరు జలాలపై అనుమతులు సాధిస్తాం. ఎపిపై ఒత్తిడి తెచ్చి లేదా కొట్లాడి ఎన్‌ఒసి తీసుకొస్తాం. పాలమూరు–రంగారెడ్డికి 90 టిఎంసిలు, డిండి ప్రాజెక్టుకు 20 టిఎంసిల నీళ్లకు అనుమతులు సాధిస్తాం. ఉద్దండాపూర్ వరకు ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేస్తాం. రెండున్నరేళ్లలో జూరాల వద్ద కొత్త రిజర్వాయర్‌ను నిర్మిస్తాం. కర్ణాటక, మక్తల్ సరిహద్దుల్లో బ్రిడ్జి కమ్ బ్యారేజ్‌ను కడుతాం.

– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





- భవిష్యత్తులో ఒక్కరిని కూడా గెలవనివ్వం
- కెసిఆర్ పదేళ్ల పాలన, మా ముప్పై నెలల పాలనపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలి
- పాలనపై చర్చలో ఓడితే క్షమాపణ చెబుతా
- రైతుల కష్టాలు తీర్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తాం
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల కట్టి తీరుతాం
- గోదావరి జలాలపై మహారాష్ట్ర దాగుడుమూతలాడుతోంది
- కృష్ణా జలాల వివాదం 60 ఏళ్లుగా రావణకాష్టంలా రగులుతోంది
- పొరుగు రాష్ట్రంతో చర్చలు జరిపి డిసెంబర్‌లోగా పాలమూరు జలాలపై అనుమతులు సాధిస్తాం
- ఉద్దండాపూర్ వరకు ప్రాజెక్టును ఏడాదిలోపు పూర్తిచేస్తాం
- బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్/జడ్చర్ల

పాలమూరు జిల్లాలో బిఆర్ఎస్ జెండా ఎగురనివ్వమని, గద్దెలు దిగాలి, దిమ్మెలు కూలాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు గడ్డపై భవిష్యత్‌లో ఒక్కరిని కూడా గెలవనివ్వమని చెప్పారు. 30 నెలల కాంగ్రెస్ పాలన చెబితే రామాయణం, రాస్తే భారతం అవుతందన్నారు. కెసిఆర్ పదేళ్లపాలన, తన 30 నెలల పాలనపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. పాలనపై చర్చలో తాను ఓడితే క్షమామణ చెబుతానని రేవంత్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ వద్ద బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. గోదావరి జలాల్లో జరిగిన అన్యాయంపై మహారాష్ట్ర సిఎంను అడుగుతామని, అవసరమైతే కడుగుతామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎలాగైనా తుమ్మడిహట్టి వద్ద గోదావరిపై ప్రాణహిత చేవెళ్ల కడతామన్నారు. గోదావరి జలాలపై మహారాష్ట్ర సిఎం దాగుడుమూతలు ఆడుతున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. చర్చలకు రమ్మంటే కూడా రాకుండా పారిపోతున్నారని ఆక్షేపించారు. రైతుల కష్టాలు తీర్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామని, కృష్ణా జలాల వివాదం 60 ఏళ్లుగా తరువాయి 8లో





## నేడు సిట్ ముందుకు ఎంపి చామల

ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట శనివారం హాజరుకానున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన ఫోన్ ట్యాప్ అయినట్లు దర్యాప్తులో గుర్తించిన నేపథ్యంలో, సిట్ అధికారులు ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించిన చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికల్లో తరువాయి 12లో



## మంటల్లో బతుకులు

షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ సిలెండర్ పేలి ముగ్గురు సజీవ దహనం

నిద్రలోనే బూడిదైన అమ్మమ్మ, మనవడు, మనవరాలు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో దుర్ఘటన

ప్రజాపక్షం/ మిర్యాలగూడ

కుటుంబ పెద్ద చనిపోయి నెల గడవక ముందే ఆ పేద కుటుంబంలో గ్యాస్ సిలెండర్ రూపంలో తీరని విషాదం నింపింది. కొన్నాళ్ళ క్రితం అల్లుడు మృతి చెందడంతో తన బిడ్డతో పాటు ఇద్దరి పిల్లల బాధ్యతను తరువాయి 8లో



## జలసమాధి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నీటమునిగి ఆరుగురు మృతి

బాన్సువాడ, భీమ్‌గల్ మండలాల్లో ఘటనలు

ప్రజాపక్షం/భీమ్‌గల్ /బాన్సువాడ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటమునిగి ఆరుగురు జలసమాధి అయ్యారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొంత మంది బాన్సువాడ మండలం బుడిమి శివారు మంజీరానది వద్ద ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. వీరిలో భానుప్రసాద్, అనిత (40), పావని (14), శివాని (13) నదిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో నదిలో నలుగురు గల్లంతయ్యారు. స్థానికులు తరువాయి 8లో

# అధికారం లేకున్నా పేదల పక్షమే

- ప్రపంచంలో కార్మికులందరికీ ఎర్ర జెండానే అండ
- దేశంలో ఉన్న పార్టీలన్నీ దేశానికే పరిమితం
- కమ్యూనిస్టు పార్టీ మాత్రమే ప్రపంచవ్యాప్తం
- ఉపన్యాసాలకే పరిమితం కాకుండా బ్రిటీష్‌కు వ్యతిరేకంగా వెనుకబడిన వర్గాలను ఏకం చేసింది ఎర్రజెండా
- వరంగల్ జిల్లా రాజకీయ శిక్షణ శిబిరంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటన




ప్రజాపక్షం/నల్లబెల్లి

అధికారం ఉన్న లేకున్న పేదల ప్రజల పక్షాణ పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని ,పోరాటాలు చేస్తు చనిపోయిన వారందరో ఎర్ర జెండా పార్టీలో ఉన్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు . వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న సిపిఐ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ముఖ్య అతిథిగా సాంబశివ రావు హాజరై మాట్లాడారు. ప్రపంచంలో పేద ప్రజలకు, కార్మికులకు అండగా ఉండేది ఎర్ర జెండా పార్టీలేనని గుర్తు చేశారు. భారత దేశంలో ఉన్న పార్టీలు కేవలం దేశం వరకే ఉంటాయిని, కమ్యూనిస్తు పార్టీ మాత్రం ప్రపంచ వ్యాప్తంగా ఉంటుందని చెప్పారు . పుడితే కమ్యూనిస్టుగా పుట్టాలని, ధనవంతుల తరువాయి 12లో



## ఒక వ్యాపారి కోసం కోటిన్నర చెట్లు నరుకుతారా?

- గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్ రక్షణకు సంబంధించినది కాదు
- అద్భుతమైన ప్రకృతి సౌందర్యం ధ్వంసం కావడం కలచివేస్తోంది
- అండమాన్ నికోబార్ పర్యటన వీడియోను విడుదల చేసిన రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రాజెక్ట్ రక్షణ, ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్‌కు సంబంధించినదని మోదీ ప్రభుత్వం చెబుతోందని, అయితే అది అబద్ధం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఒక వ్యాపారవేత్త లాభం కోసం 1.5 కోట్లకు పైగా చెట్లు, పురాతన పగడపు దిబ్బలు, అమూల్యమైన వర్షారణ్యాలు నాశనం చేయబడుతున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. భారతదేశంలోని అత్యంత అమూల్యమైన పర్యావరణ భూమిపై ఒక వ్యాపారవేత్త హోటళ్లు, క్యాసినోలు నిర్మించుకునేందుకు వీలుగా, వాస్తవానికి ఈ ప్రాజెక్ట్ అతనికే ప్రయోజనం చేకూర్చడానికి ఉద్దేశించినదని ఆయన ఆరోపించారు. ఏప్రిల్ చివరిలో తాను అండమాన్ నికోబార్ దీవులలో చేసిన పర్యటన ఆధారంగా రాహుల్‌గాంధీ 16 నిమిషాలకు పైగా నిడివి ఉన్న ఒక వీడియోను విడుదల చేశారు. తాము దురాశ కన్నా పచ్చదనానికే ప్రాధాన్యత ఇస్తామని మోదీ ప్రభుత్వానికి తెలియజేయడానికి ఒక వినతిపత్రంపై సంతకాలు చేయాలని ఆయన ప్రజలను కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాను ప్రతీ యువ భారతీయుడినీ ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నానన్నారు. 'మీరు ఎలాంటి భారతదేశాన్ని వారసత్వంగా పొందాలనుకుంటున్నారు? క్యాసినోల కోసం వర్షారణ్యాలను బుల్డోజర్లతో కూల్చివేసి, తరువాయి 8లో

## ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- దుక్కులు సిద్ధం చేసిన మెట్ట రైతులు
- కల్లాల్లోనే ఇంకా యాసంగి పంటలు
- పంటల బీమా పథకం అమలు చేయాలని రైతుల డిమాండ్

ప్రజాపక్షం/ ఖమ్మం



ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధమయ్యారు. మృగశిర కార్తె సమీపిస్తుండటం, గత రెండు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో అక్కడక్కడ జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. గత 10 రోజులుగా చినుకు కోసం ఎదురు చూసిన రైతులు చెదురు మదురు వానలు పడుతుండడంతో దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తుండగా వాటిని రైతులు తమ చేలల్లో చల్లుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడతాయని వాతావరణ శాఖ, ఇతర సంస్థలు తెలుపుతున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. తక్కువ సమయంలో చేతికి వచ్చే పంటలను సాగు చేయాలని కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పరిస్థితి ఇలా ఉంటే ఇంకా కల్లాల్లోనే మొక్కజొన్న, ధాన్యం రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కాంటాలు కాక, ఎగుమతులు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరల వ్యవసాయ సీజన్ ప్రారంభ సమయం ఆసన్నమైన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు జరగకపోవడం, కొనుగోళ్లు జరిగిన చోట పూర్తి స్థాయిలో ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో రైతులు ఆర్థిక తరువాయి 8లో



## వారం రోజులు వర్షాలు

- తేలికపాటి నుంచి మోస్తరు వానలు
- రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గుముఖం : వాతావరణ శాఖ వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాబోయే వారం రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అనేక ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే రాబోయే నాలుగు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల తరువాయి 12లో

## అందరి దృష్టి ఇండియా కూటమి వైపే

### 8న కూటమి పార్టీలు భేటీ




**న్యూఢిల్లీ:** చాలా కాలం తరువాత జూన్ 8న న్యూఢిల్లీలోని కాన్స్‌టిట్యూషన్ క్లబ్‌లో జరగనున్న ఇండియా కూటమి సమావేశం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. లోక్‌సభ సాధారణ ఎన్నికలకు ముందు 2023 డిసెంబర్‌లో ఇండియా కూటమి సమావేశం తరువాత ముఖ్యనేతలు భేటీ కానుండడం ఇదే మొదటిసారి. లోక్‌సభ ఎన్నికల తరువాత కూటమి అనేక మార్లు సమావేశమైనప్పటికీ, దానికి అన్ని పార్టీల ముఖ్యనేతలు హాజరుకాలేదు. తాజా సమావేశానికి ఇండియా కూటమిలోని 35 భాగస్వామ్య పక్షాలకు చెందిన 17 ప్రధాన నాయకులు హాజరయ్యేందుకు సమ్మతం తెలిపారు.వారిలో టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ, జెఎంఎం అధినేత హేమంత్ సోరెన్, జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్, శివసేన (యుబిటి) అధ్యక్షుడు ఉద్దవ్ థాక్రే ఉన్నారు. ఈ సమావేశానికి తాము హాజరుకావడం లేదని డిఎంకె ఇప్పటికే తెలియజేసింది. తమిళనాడు ఎన్నికల తరువాత తమకు ద్రోహం చేసి కాంగ్రెస్ పార్టీ అధికార టివికెతో కలవడంపై ఆగ్రహంతో ఉన్న డిఎంకె ఇప్పటికే ఇండియా కూటమి నుంచి వైదొలిగినట్లు ప్రకటించింది. అలాగే లోక్‌సభలో సైతం ఇండియా కూటమితో కాకుండా విడిగా స్థానాలను కేటాయించాలని కోరుతూ లేఖ రాసింది. అదే సమయంలో వైరి కూటమిలో చేరనున్నట్లు ప్రకటించలేదు. ఈ సమావేశానికి హాజరుకానప్పటికీ, సమావేశంలో పాల్గొనే తరువాయి 8లో

# నీటి పారుదల ప్రాజెక్టులపై జగడం

కృష్ణా నది జలాల పంపిణీ జగడం నది పరీవాహక ప్రాంతాల మధ్య, ముఖ్యంగా 12 ఏళ్ల క్రితం ఏర్పడిన తెలంగాణ – పరిశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కొనసాగుతూనే ఉంది. కృష్ణా జలాల ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు, కేంద్రప్రభుత్వం మధ్య సమస్య నానుతూనే ఉంది. అంత ర్రాష్ట్ర నదీ జలాల సమస్యలను సంబంధిత రాష్ట్రాలు చర్చలద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల హితోపదేశం చేశారు. కాని దశాబ్దాల తరబడి వివాదం పరిష్కారం కానప్పుడు, ట్రిబ్యునల్ దశాబ్దాలు గడిచినా నివేదిక ఇవ్వలేనప్పుడు పెద్ద మనిషిగా కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకోవటం అత్యంతావశ్యకం. కాని నదుల అనుసంధానం అంటూ అడపాదడపా మాట్లాడటం తప్ప ఆ కార్యసాధనకు రాష్ట్రాలతో సంప్రదింపులవంటి సీరియస్ ప్రయత్నాలు కనిపించవు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకున్న భయాలను నివృత్తి చేస్తూ ఈ ప్రాజెక్టును ఆచరణ సాధ్యం చేయాలి. ఎందుకంటే, దేశంలో నీటిఎద్దడి, కరవు సమస్యల పరిష్కారానికి జీవనదులను సంధానించటం ద్వారా మిగులు జలాలను తరుగు రాష్ట్రాలకు తరలించటానికి ఉద్దేశించిన గంగ–కావేరి అనుసంధాన ప్రాజెక్టు చేబట్టటంపై శ్రద్ధ పెట్టాలి.

రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ జగడాలు సర్వసాధారణమైతే, నవ తెలంగాణ రాష్ట్రంలో గత టిఆర్ఎస్/బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మధ్య ఇరిగేషన్ రంగంలో కృషిపై పరస్పర నిందారోపణలు నిత్యకృత్యంగా ఉన్నాయి. గత కెసిఆర్ దాదాపు దశాబ్దకాల పరిపాలన అంతకుపూర్వపు కాంగ్రెస్ ప్రభుత్వాలు పనులు మొదలు పెట్టిన ప్రాజెక్టులను అసంపూర్తిగా పక్కనపడేసిన మాట వాస్తవం. ఆయన కలల ప్రాజెక్టు కాళేశ్వరంపైనే సమయం, శ్రమ, ధనం వెచ్చించి ఒక అద్భుతాన్ని ఆవిష్కరించినట్లు ప్రచారం చేసుకున్నారు. మూడు బ్యారేజీలు, అనేక లిఫ్టులు, రిజర్వాయర్లతో కూడిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలో కొన్ని పిల్లర్లు కృంగి బీటలిచ్చి మొత్తం ప్రాజెక్టును ప్రమాదంలో పడేశాయి. ఇది గత ఎన్నికలకు ముందు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగానే జరిగింది. దీన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజకీయంగా వాడుకుంటూ, లక్షకోట్లు వెచ్చించిన కాళేశ్వరం – కూలేశ్వరం అంటూ అపహాస్యం చేస్తూ వచ్చింది. నాలుగు బస్తాల సిమెంటుతో అయిపోయే మరమ్మతుచేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తోందని బిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అయితే కేంద్ర జలసంఘం అధ్యయనం, సిఫారసుల ప్రకారం ప్రభుత్వం ఆలస్యంగానైనా మరమ్మతులు చేబట్టి – మూడు బ్యారేజీ పునాదులను పటిష్టం చేయతలపెట్టింది.

ఇదిలావుండగా, బిఆర్ఎస్–కాంగ్రెస్ మధ్య ప్రధాన వివాదం పాలమూరు–రంగారెడ్డి పథకం విషయంలో జరుగుతూంది. చిత్రమేమంటే ఉమ్మడి రాష్ట్రంలోనే నికరజలాల కేటాయింపు పొంది, దాదాపు పూర్తి అయిన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పనులను కెసిఆర్ ప్రభుత్వం పక్కనపడేయటం. పైగా మహబూబ్‌నగర్ జిల్లాకు ఎంతో మేలు చేశామని చెప్పుకోవటం. ఆచరణలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పట్ల సవతితల్లి ప్రేమ చూపటం. ప్రధానంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగానికి ఎంతో మేలు చేసే ఈ ప్రాజెక్టును ఆఘమేఘాల మీద ఒక పంపుసెట్టు ప్రారంభించి 90శాతం పూర్తిచేసినట్లు అబద్ధాలు ప్రచారం చేయటం. దాదాపు 60 వేల కోట్లు వ్యయం అయ్యే ఈ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 27వేలు ఖర్చు చేసింది. అంటే 50శాతం లోపు. అంతకన్నా చిత్రమేమంటే ఈ ప్రాజెక్టు ప్రవాహ మార్గాలకు అవసరమైన నాలుగువేల ఎకరాల భూసేకరణను చేబట్టకపోవటం.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పర్యటించి వాస్తవ క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. భూసేకరణకు తక్షణ ప్రాధాన్యత ఇచ్చి స్థానిక ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిల సహకారంతో శీఘ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశం తదుపరి ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పనుల్లో ఎంతో పురోగతి ఉంది. నార్లాపూర్ రిజర్వాయర్ 100 శాతం పూర్తయింది. ఏదుల రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయినాయి. వట్టెం రిజర్వాయర్ కరకట్టల నిర్మాణం పూర్తయింది, కాంక్రీటు పనులు, కట్టల పటిష్టత పనులు జరుగుతున్నాయి. కరివెన రిజర్వాయర్ కరకట్ట పనులు దాదాపు పూర్తి అయినాయి. రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు ప్రయోజనం సిద్ధింప జేయాలన్న పట్టుదలతో ఉంది ప్రభుత్వం.

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించేందుకు అవసరమైన మహారాష్ట్ర భూమికోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావీస్‌కు లేఖ రాశారు. ఆయనతో సమావేశం ఏర్పాటు, కార్యసాఫల్యం కోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహాయం కోరారు. రాజకీయంగా వేరైనా రాష్ట్ర ప్రయోజనం కోసం కలిసి పని చేయటం అవసరం. ●



## మోదీ మంచి మిత్రుడు

ప్రధాని నరేంద్ర మోదీ నాకు మంచి మిత్రుడు. భారత్, అమెరికా త్వరలోనే వాణిజ్య ఒప్పందానికి చేరుకుంటాయన్న విశ్వాసం నాకుంది. భారత్‌తో మా సంబంధాలు బలంగా ఉన్నాయి. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఒప్పందం కుదురుతుంది. గతంలో భారత్ అమెరికా కంపెనీలపై భారీ స్థాయిలో సుంకాలు విధించింది. అమెరికా మాత్రం పెద్దగా సుంకాలు వసూలు చేయలేదు. భారత్ చాలా కాలం పాటు అమెరికా విధానాలను తమకు అనుకూలంగా ఉపయోగించుకుంది. అమెరికా కంపెనీలపై భారత్ భారీ టారిఫ్‌లు విధించింది. కానీ మేము వారి ఉత్పత్తులపై అలాంటి భారం వేయలేదు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ప్రస్తుతం భారత్‌తో వాణిజ్యం ద్వారా అమెరికా మంచి ఆదాయం పొందుతోంది.

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

## చిన్న పత్రికల గొంతు నులుముతున్న మోదీ ప్రభుత్వ పోస్టల్ ఛార్జీలు

మోదీ ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛను హరించే తన నిరంకుశ పంజాను దేశవ్యాప్తంగా ఉన్న చిన్న పత్రికలపై విసిరింది. ఈ చర్యలలో భాగంగానే 2023లో ముఖ్యంగా చిన్న పత్రికల హక్కులను కాపాడుతూ వచ్చిన ఆర్ఎన్ఐ ని రద్దుపరిచి ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ యాక్ట్ .. పి ఆర్ పి ఏ. ను కొత్తగా ఏర్పాటు చేసింది. ఈ సంవత్సరం జనవరి 1 నుంచి ఆర్ ఎన్ఐ లో రిజిస్టర్ అయిన పత్రికలన్నిటికీ దశాబ్దాలుగా ఉన్న పోస్టల్ రాయితీలను రద్దుచేసి వాటి మనుగడను దెబ్బతీసే చర్యలకు మోదీ ప్రభుత్వం పూనుకుంది. మారుతున్న కాలంలో వేగంగా వ్యాపారం జరగాలన్న ఉద్దేశ్యంతో ప్రధానంగా ఈ మార్పులు చేపట్టినట్లు మోదీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మార్పుల తీవ్రత నేడు ఏ స్థాయికి చేరిందంటే వ్యాపార రంగంలో ఉన్న పత్రికలను పక్కన పెడితే రాజకీయ ఆర్థిక సామాజిక సాహిత్య సాంస్కృతిక విద్యార్థి యువజన మహిళ, హక్కులు తదితర రంగాలలో కొన్ని దశాబ్దాలుగా ప్రచురింపబడుతున్న వార పక్ష మాస పత్రికలపై పోస్టల్ శాఖ విధిస్తున్న వినూత్న ఆంక్షల ఫలితంగా ఆర్థిక భారాలు తట్టుకోలేక ఊపిరాడని దుస్థితిలోకి నెట్టబడ్డాయి.

ఈ పోస్టల్ భారాలు ఎంత తీవ్రంగా ఉన్నాయంటే.. ఉదాహరణకు రాజకీయ ఆర్థిక సామాజిక మాస పత్రిక 'వీక్షణం' బాధ్యులు ప్రకటించినట్లు పోస్టల్ చార్జీలు 8 రెట్లు పెరిగి ఒక్కో పత్రికకు 50 పైసలు బదులు నాలుగు రూపాయల స్టాంపు అంటించాల్సి వస్తుంది. అలానే విప్లవ కమ్యూనిస్టుల మాసపత్రిక 'జనశక్తి' కూడా నాలుగు రూపాయలు పోస్టల్ స్టాంప్ వేయాల్సి వస్తున్నది. మంగళగిరి నుంచి వచ్చే 'బుద్ధభూమి' పత్రిక నిర్వాహకుల ప్రకటన ప్రకారం పోస్టల్ రాయితీల కోసం మూడు సంవత్సరాలకు ఒక సారి పునరుద్ధరించుకోవాలని, కొత్త నిబంధనల ప్రకారం ఎక్కువ పోస్టేజీని భరించాల్సి వస్తుందని, గతంలో ఎన్నడూ లేనిది పుస్తకం బరువు రేటును బట్టి పోస్టల్ చార్జీలను నిర్ణయించే పరిస్థితిని ప్రవేశపెట్టారు. అంతకంటే ఘోరమైనది బయట వ్యాపార సంస్థల నుండి వసూలు చేసినట్లుగా జీఎస్టీ ని 18% చొప్పున, ఇది చాలదన్నట్లు యూజర్ చార్జీల పేరుతో 1000 కాపీలకు మొత్తం రూ 590 వసూలు చేస్తున్నారు. ఈ భారం చాలదన్నట్లు యూజర్ చార్జీలను మే నెల నుండి పత్రికకు 20 పైసలు చొప్పున పెంచేశారు. ఎక్కువ వ్యవధి ఉండే పత్రికలకు పోస్టల్ రాయితీలను క్రమంగా రద్దుచేసి నిబంధనల పేరుతో మరిన్ని భారాలు పెంచుతున్నారు. ఈ చర్యలన్నీ చిన్న పత్రికల గొంతులు నులిమే చర్యలుగా మారిపోతున్నాయి. ఎంతో కాలంగా పుస్తక ప్రియులకు ఉపయోగంగా ఉన్న బుక్ పోస్ట్ ని ఎత్తివేసి స్పీడ పోస్ట్ వైపు వెళ్లేలా చేస్తున్నారు. ప్రైవేటు రంగంలోని కొరియర్ వ్యవస్థ బలోపేతానికి ఈ చర్యలన్నీ అంతిమంగా ఉపయోగపడుతున్నాయి. అన్ని రంగాల ప్రైవేటీకరణతో పాటు చివరికి పోస్టల్ వ్యవస్థను కూడా బిఎస్ఎన్ఎల్ ను ఏ విధంగా బలహీన పరిచారో అదేవిధంగా పోస్టల్ వ్యవస్థను బలి పశువును చేస్తున్నారు. దీనిలో భాగంగానే బట్వాడా చేసే ఉద్యోగులను తగ్గించి వేసి ఉన్న ఉద్యోగులపై భారాలు వేయడం వలన ఉత్తరాలతో పాటు చిన్న పత్రికల బట్వాడా కూడా చాలా ఆలస్యంగా జరుగుతున్నది. ఇవన్నీ చిన్న పత్రికల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

చిన్న పత్రికల గొంతు నొక్కటం అంటే పోరాడి సాధించుకున్న భావ ప్రకటన స్వేచ్ఛకు ఉరి తాడు బిగించడమే అవుతుంది. అలానే ప్రజల భిన్నాభిప్రాయాలను ప్రజాస్వామిక వ్యవస్థలో గౌరవించటం కాక వేధింపులకు, చివరికి దాడులకు పాల్పడే పరిస్థితి వచ్చింది. దేశవ్యాపితంగా పాలకుల విధానాలపై చిన్న పత్రికల నుండి వస్తున్న భిన్నాభిప్రాయాలను అడ్డుకోవటానికి కొత్త మార్గంగా పోస్టల్ శాఖను ఒక ఆయుధంగా ఉపయోగించుకోవటానికి మోదీ ప్రభుత్వం పూనుకుంది. ఈ చర్యలన్నీ ఆచరణలో ప్రజల ప్రజాస్వామిక హక్కులను, భిన్నాభిప్రాయాలను వ్యక్తపరిచే స్వేచ్ఛను హరించడమే అవుతుంది. మోదీ ప్రభుత్వం చిన్న పత్రికలపై విధించిన ఆంక్షల్లో గతంలో కంటే దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్యమాలకు పెరుగుతున్న నైతిక సంఘీభావాన్ని దెబ్బతీసే కుట్ర కూడా ఇమిడి ఉంది. చిన్న పత్రికల మనుగడ సమస్య కేవలం ఆయా పత్రికల యాజమాన్యాల సమస్య కాదు. అది ఈ దేశ ప్రజాస్వామ్య ఆరోగ్యానికి సంబంధించిన ప్రశ్న. భిన్నాభిప్రాయాలను గౌరవించే సమాజం కోసం ప్రతి పౌరుడు ఈ నిరంకుశ పోస్టల్ ఆంక్షలకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన సమయం వచ్చింది. ఇలాంటి సమయంలో భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుకోవడానికి వివిధ రంగాలలో నడుస్తున్న చిన్న పత్రికల యాజమాన్యాలు ఒక త్రాటి మీదకు వచ్చి సంఘటితంగా నిలబడి హక్కుల కోసం కలబడటానికి సమాయత్తం కావాలి. ఇందుకు వామపక్ష శక్తులతో పాటు వివిధ ప్రజా సంఘాలు, పౌర ప్రజాస్వామ్య హక్కుల సంఘాలు అండగా నిలబడాలి.

**ముప్పాళ్ళ భార్గవ శ్రీ**
సిపిఐ(ఎంఎల్) నాయకులు

# బొద్దింక రాజకీయాలు – ప్రజాగ్రహానికి పరిమితులు

ప్రజాగ్రహం చిత్రమైన పద్ధతుల్లో ప్రతీకలను కనుగొంటుంది. అది కొన్నిసార్లు తెల్లటోపీ ధరించే ఉదాత్తమైన వ్యక్తి చుట్టూ చేరుతుంది. మరికొన్నిసార్లు ఊహించని రాజకీయ లేబుల్‌ను చేరుతుంది. ఒక తరం గూర్చి అది మాట్లాడటం హాస్యోక్తిగా ఉంటుంది. కాక్రోచ్ (బొద్దింక) పార్టీ పట్ల జన్ జడ్ అసాధారణ స్పందన అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఆందోళన సందర్భంలో వారి స్పందనను గుర్తుచేస్తోంది. ఈ రెండు కూడా అస్పష్టమైన, అహంకారపూరితమైన, నైతికంగా బలహీనపడిన వ్యవస్థకు వ్యతిరేకంగా అసంతృప్తిని వ్యక్తీకరించాయి. రెండూ సాంప్రదాయక రాజకీయాలు తమ మాట వినిపించుకోవటం లేదన్న ప్రజల మనోభావం నుంచి శక్తిని పొందాయి. రెండూ కూడా రాజకీయ ఆందోళనలుగా కాకుండా, ప్రారంభంలో అయత్నకృతంగానే బయలుదేరాయి.

ఆ పోలిక ముఖ్యం. బొద్దింక ప్రాజెక్టు అతివేగంగా విస్తరించటాన్ని అది వివరిస్తుంది. అది ఒక వ్యవస్థాపకుడు, ఒక నినాదం, ఒక సంస్థాగత ప్రయోగం కాదు. అదొక మనోభావం. అన్నా హజారే ఉద్యమంలోకి ఉరికిన పట్టణ మధ్యతరగతులు, రాజకీయంగా అసంతృప్తితో ఉన్న పౌరుల వలే జన్ జడ్ తరం సైతం తమ ఆగ్రహ వ్యక్తీకరణ ప్రజలకు చేరటానికి ఒక మార్గాన్ని ఎంచుకున్నారు. బొద్దింక అనే పదమే స్థిరపడిన రాజకీయ పార్టీలను పరిహసించేదిగా ఉన్నందున ఆ పేరే ఆకర్షించింది.

ఆర్థిక అస్థిరత, ఉద్యోగాలు లభించకపోవటంపై ఆందోళన, డిజిటల్ ఎక్స్‌పోజర్, సంస్థల పట్ల అపనమ్మిక మధ్య పెరిగిన తరానికి ఆ పేరే ధిక్కార సంకేతంగా అనిపించింది.

అన్నా హజారే ఆందోళన కూడా సాంప్రదాయక రాజకీయ ఆందోళనగా కాకుండా ఒక నైతిక తిరుగుబాటుగా మొదలైంది. విశృంఖలమైన అవినీతి ప్రజా జీవితాన్ని తొలిచివేస్తున్నదని ప్రజల్లో విస్తృతంగా ఏర్పడిన భావాన్ని అది వినియోగించుకుంది. రాజకీయ వ్యవస్థ దాన్ని ప్రక్షాళన చేయజాలదనే భావాన్ని మరింత గా వ్యాప్తిలో పెట్టారు. ఆ నైతిక స్పష్టత ఆందోళన వ్యాప్తికి సహాయపడింది. అయితే రానున్న చిక్కు ప్రశ్నలను అది దాచిపెట్టింది.

కాక్రోచ్ పార్టీ కూడా అదే ప్రమాదం ఎదుర్కొంటున్నది. నిరసన ఉద్యమాలు అసంతృప్తిని పంచుకుని పెరుగుతాయి. ఆగ్రహం ప్రజల్ని వీధుల్లోకి, ఒక ర్యాలీకి, డిజిటల్ వేదిక మీదకు తీసుకురావచ్చు. అయితే అది నాలుగు కాలాలు మనగలిగిన రాజకీయ సంస్థను నిర్మించలేదు.

ఉద్యమం తాను దేన్ని వ్యతిరేకిస్తున్నదో ఒక వాక్యంలో చెప్పవచ్చు. కాని ఒక రాజకీయ పార్టీ పన్నులు, ఉపాధి, పోలీసింగ్, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఫెడరల్ సంబంధాలు, సామాజిక ఘర్షణ, సంక్షేమం, పట్టణ మౌలిక వసతులు, విదేశాంగ విధానం గూర్చి తానేమి చేస్తుందో వివరించాలి. అది అభ్యర్థులను ఎంపిక చేయాలి, నిధులు సేకరించాలి, పొత్తులు కుదుర్చుకోవాలి. రాజకీయ ఆకాంక్షలను అదుపులో పెట్టాలి. అధికారం ఆకర్షణలను తట్టుకోవాలి.

తమ కాక్రోచ్ ఉద్యమాన్ని రాజకీయ పార్టీగా మార్చాలన్న అభిజిత్ దిప్కే ఆలోచన చాలా కష్టతరమైంది. పార్టీగా ఏర్పడినాక అదీ రాజకీయ వ్యవస్థలో భాగమవుతుంది. అంతకుముందు బయట నుంచి చేసిన విమర్శలతో సంపాదించుకున్న పేరు భారమవుతుంది. ప్రతి ఒక్క నైతిక ఉద్యమమూ తాను రాజకీయాల్లో చేరినాక స్వచ్ఛంగానే ఉంటానని అనుకుంటుంది. బహుకొద్ది మాత్రమే అలా ఉండగలుగుతాయి.




ఉద్యమాలు అప్పుడప్పుడు అకస్మాత్తుగా ఉద్భవిస్తుంటాయి. వ్యవస్థ విఫలమైందని పోరాటం చేసేటప్పుడు వివిధ సామాజిక విభాగాలు ఒక్కటవుతాయి. ఉద్యమం రాజకీయ పార్టీగా మారినాక అది కొన్ని వైరుధ్యాలను పరిష్కరించుకోవాలి. అది లెఫ్టా, రైటా? లేక ఏదీ కాదా? అది పెట్టుబడిదారీ విధానానికి అనుకూలమా, వ్యతిరేకమా? సంక్షేమం విస్తరించటమా లేక ద్రవ్య నియంత్రణా? వ్యవస్థాగత సంస్కరణలకు అనుకూలమా లేక పాత కుర్చీల్లో కొత్తవారిని కూర్చోబెట్టటమా? అది కోరుకునేది విప్లవమా, పునరుజ్జీవమా లేక కొత్తగా కనిపించటమా? ఈ ప్రశ్నలను ఎక్కువకాలం దాటవేయలేరు. జన్ జడ్‌లో కాక్రోచ్ జనతాపార్టీ ఆకర్షణ రెండువైపుల పదును గల కత్తిగా రుజువు కావచ్చు. యువ మద్దతుదారులు ఈ సోషల్ మీడియా కాలంలో అపహాస్యం, వ్యంగ్యం, ఆగ్రహ వ్యక్తీకరణలతో అతివేగంగా ప్రయాణించవచ్చు. వారు రాత్రికి రాత్రి ఉద్యమాన్ని అతిపెద్దదిగా చిత్రించవచ్చు. అయితే డిజిటల్ ఉత్సాహం ఎన్నికల యంత్రం లాంటిది కాదు.

నాయకత్వం సమస్య కూడా వస్తుంది. తమది నాయకుడు లేని ఉద్యమమని, ప్రజలే చోదక శక్తులని అయత్నకృత ఉద్యమాలవారు తరచూ చెబుతుంటారు. రాజకీయపార్టీలకు అలా కుదరదు – కేంద్రీకృత నాయకత్వం తప్పనిసరి. తిరుగుబాటుకు ప్రతీకగా ఉన్న వ్యవస్థాపన నాయకుడు ముందు కుర్చీలో కూర్చుంటాడు. స్థిరపడిన రాజకీయ పార్టీల అహంభావం నుంచి తప్పించుకోవటానికి ఇందులో చేరిన మద్దతుదారులకు తాము నిర్మించిన సంస్థలోపల అవే ధోరణులు కనిపిస్తాయి. ఈ విధంగా ఆదర్శవాదం నిరాశావాదంగా మారుతుంది.

అయితే కాక్రోచ్ వెల్లువను తాత్కాలిక లక్షణంగా త్రోసివేయటం పొరపాటు అవుతుంది. దాని ఎదుగుదల ప్రస్తుత రాజకీయ వాతావరణం గూర్చి ఏదో ముఖ్యమైనది చెబుతోంది. సాంప్రదాయేతర వేదిక సఫలం అయితే రాజకీయ వ్యవస్థలో శూన్యం ఉన్నట్లు సూచిస్తుంది.

ప్రధాన స్రవంతి రాజకీయ వ్యవస్థలు అసమ్మతిని ఇముడ్చుకోలేకపోతే అది తన సొంత వేదికను నిర్మించుకుంటుంది. కాక్రోచ్ ఉద్యమం అటువంటి వేదిక. నాటకీయంగా దాని ఎదుగుదల ప్రజల మౌనాన్ని ప్రజల ఆమోదంగా తప్పు గా అర్థంచేసుకునేవారిని బాధిస్తుంది.

ఈ సిజెపి ఉద్యమం తన ఆకర్షణను కోల్పోకుండా పరిపక్వత చెందుతుందా అనేది లోతైన ప్రశ్న. ఈ ఆన్‌లైన్ ఉద్యమ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తన చమత్కారం, వ్యంగ్యంతో ప్రజలను ఉద్యుక్తులను చేయగలనని ఇప్పటికే నిరూపించుకున్నాడు. అతనొక సంస్థను, పార్టీని నిర్మించగలడా అన్నది ఇప్పుడు అసలు ప్రశ్న. దీప్కే ఢిల్లీ వస్తున్నాడు.

6వ తేదీ జంతర్‌మంతర్‌లో ప్రజా సమూహంతో నిరసన కార్యక్రమం చేబట్టేందుకు పోలీసుల అనుమతికై దరఖాస్తు చేశాడు. వెబ్‌సైట్ కాక్రోచ్ పార్టీ ఫాలోయర్ల సంఖ్యను చూచి దానిని మొగ్గలోనే తుంచివేసే ప్రయత్నంగా నరేంద్రమోదీ ప్రభుత్వం ఆ సైట్‌ను మనదేశంలో కనిపించకుండా ఉపసంహరింపజేసింది.

భావప్రకటన స్వేచ్ఛ ను అణచివేయటం మోదీ ప్రభుత్వం, బిజెపి భయానికి నిదర్శ నం. అటువంటి ప్రభుత్వం దీప్కే జంతర్‌మంతర్ ఆందోళనకు అనుమతి ఇస్తుందా? ఒకవేళ ఇచ్చినా ఢిల్లీ పోలీసులు హిందూత్వ శక్తుల ఏహ్యత నుంచి దానికి రక్షణ ఇవ్వగలుగుతారా? శాంతి భద్రతల సమస్యపేరుతో అనుమతి నిరాకరించినా ఆశ్చర్యంలేదు.

**– పరిశీలకుడు**

# పాటతో విప్లవం రగిలించిన కవి సుద్దాల



సుధాకర్.ఏ.వి
9000674747


కవిగా, కళాకారుడిగా, అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితమంతా కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం అంకితం చేసిన వ్యక్తి. తెలంగాణ జాతి యావత్తుని తన కవితలతో మేల్కొలిపిన మహా కవి సుద్దాల హనుమంతు. ఆయన కవితలో ఆవేశం ఉంటుంది. ఆ అర్థాల్లో ఆలోచన ఉంటుంది. ఆ భావాల్లో సామాజిక స్పృహ ఉంటుంది. సామాజిక స్పృహతో ఆవేశంగా అర్థవంతంగాచేసే ఆలోచనే సుద్దాల కవిత.

సుద్దాల హనుమంతు ఇంటి పేరు గుర్రం. అయితే 'సుద్దాల' గ్రామంలో స్థిరపడడం చేత ఆ ఊరిపేరే ఇంటి పేరుగా స్థిరపడి పోయింది. సుద్దాల హనుమంతు నేటి యాదాద్రి భువనగిరి జిల్లా పాలడుగు గ్రామంలో 1910, జూన్ 6న పుట్టాడు. తండ్రి బుచ్చిరాములు. తల్లి లక్ష్మీ నరసమ్మ. బుచ్చిరాములు ఆయుర్వేద వైద్యుడు, గొప్ప కళాకారుడు. ఆయన అన్నదమ్ములు కూడా కళాకారులే. వారందరూ సుదీర్ఘకాలం పాటు వీధినాటకాలు ప్రదర్శించారు. హనుమంతు తాతగారు కూడా కళాకారుడే. ఆయన హరికథలు చెప్పేవాడు. బహుశ ఆ సాంస్కృతిక కళాప్రదర్శన వారసత్వంగా హనుమంతుకు జన్మతః లభించినట్లుంది. సాయుధ పోరాటకాలంలో బుర్రకథ, గొల్లసుద్దులు, పిట్టలదొర, యక్షగానం వంటి జానపద కళారూపాల ప్రదర్శన ద్వారా ప్రజలను చైతన్య పరచి పోరాటానికి సిద్ధపరచేవాడు. సుద్దాల హనుమంతు బుర్రకథ చెబితే గడ్డిపోచ కూడా యుద్ధానికి సై అంటుందని జన ప్రచారంలో బలంగా వినిపించేది.

నిజాం ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే స్వభావం కలిగిన హనుమంతు 'ఆర్యసమాజం' పట్ల ఆకర్షితుడై వారి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. అది నచ్చని నాటి నిజాం సర్కారు ఆఫీసరు అతనిని మందలించాడు. ఆత్మాభిమానం గల హనుమంతు రోషంతో ప్రభుత్వ ఉద్యోగానికి (వ్యవసాయ శాఖలో గుమాస్తా) రాజీనామా చేశాడు. బతుకు దెరువుకోసం దర్జీ పనిని చేపట్టాడు.

రావి నారాయణరెడ్డి ప్రసంగం విని ఉత్తేజితుడైన హనుమంతు కమ్యూనిస్టుగా మారి జీవితాంతం కమ్యూనిస్టుగానే ఉండిపోయాడు. ప్రజాఉద్యమ నిర్మాణంలో భాగంగా సుద్దాల గ్రామం చేరాడు. సుద్దాల హనుమంతుగా స్థిరపడిపోయాడు. అక్కడే జానకమ్మ తో పెండ్లి జరిగింది. ఆమె కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు, హనుమంతుతో కలిసి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని ఎన్నో బాధలు అనుభవించింది. ఆమె ధీర హృదయ. అనుక్షణం లోలోన రగిలిపోతున్నా పైకి చిరునవ్వులు చిందించగల త్యాగమూర్తి. ఆమెలేకుంటే తాను లేనని, ఆమె ప్రేమ, ఓదార్పు, సేవ వల్లనే తాను జీవించ గలుగుతున్నానని హనుమంతు చెప్పిన మాటలే ఆమె ఔదార్యానికి నిదర్శనం.

కమ్యూనిస్టు పార్టీ సుద్దాలకు కళారంగ విభాగాన్ని అప్పగించింది. ఆ క్రమంలో హనుమంతు ఎన్నో చైతన్య గీతాలను రాసి వివిధ కళారూపాల ద్వారా వాటిని ప్రదర్శించి ప్రజలను పోరాటానికి సమాయత్త పరిచేవాడు. సాయుధ పోరాట కాలంలో దళ సభ్యులతో కలసి రాత్రింబవళ్ళు అడవుల్లో, గుట్టల్లో తిరుగుతూ రజాకార్లను, భూస్వామ్య పెత్తందారీ దొరల కిరాయి మూకలను ఎదుర్కొంటూ గెరిల్లా పోరాటం చేశాడు. ఎన్నోసార్లు వెంట్రుకవాసిలో చావును తప్పించుకున్నాడు. భూముల తాకట్టుకు సంబంధించిన దస్తావేజులను తగులబెట్టాడు. వాటి నుండి ప్రజలను విముక్తులను చేశాడు. భూస్వాముల భూములను స్వాధీన పరచుకొని పేదలకు పంచాడు. పేదల శ్రమను దోచుకొని ధాన్యపురాశులను



ప్రోగుచేసిన దొరల వద్ద ధాన్యాన్ని కొల్లగొట్టి పేదలకు పంచాడు. హనుమంతు రాసిన, పాడిన పాటలు ప్రజలపై ఎంతో ప్రభావం చూపాయి.

వెట్టి చాకిరీని నిరసిస్తూ, వెట్టి బాధను తెలుపుతూ అందరి హృదయాలను కదిలించే విధంగా 'వెట్టిచాకిరి విధానమో రైతన్న! ఎంత చెప్పిన తీరదో రైతన్న!' అంటూ రాసిన పాట వెట్టిపై తిరుగుబాటు బావుటా ఎగరేసేటట్లు చేసింది. పోరాట క్రమంలో గ్రామాలు తిరుగుతున్న హనుమంతుకు ఒకచోట ఒక చిన్న పిల్లవాడు బడికి దూరమై దొర దగ్గర వెట్టి చేస్తూ పశువులను కాస్తు కనిపించాడు. అటు పశువుల్ని అదిలించ లేక ఇటు కడుపునిండా తిండిలేక ఆకలితో అలమటిస్తూ, కాలికి ముండ్లు గుచ్చుకొని బాధతో రాతిగుండు మీద కూర్చొని వెక్కివెక్కి ఏడుస్తున్న ఆ పిల్లగాడిని చూసి నిలువునా కరిగిపోయి 'పల్లెటూరి పిల్లగాడా ! పసులు గాసే మొనగాడా' అనే పాట రాశాడు. అది ప్రజల నాలుకల మీద సజీవంగా నిలిచిపోయింది. దానిని 'మా భూమి' సినిమాలో టైటిల్ సాంగ్‌గా తీసుకున్నారు. సుద్దాల హనుమంతు అజ్ఞాతంలో ఉన్నా ఆయన పాటలు ప్రజల నోళ్ళల్లో నానుతూ పోరాట గీతాలైనాయి. ఆ గీతాల ప్రభావం అలాంటిది. అవి నాటికే కాదు నేటికి కూడా ప్రజలలో చైతన్యం కలిగించగల శక్తి స్వరూపాలు.

1947లో హనుమంతుకు తీవ్రమైన అనారోగ్యం కలిగింది. ఆ సమయంలోనే ఆయనపై 'కనిపిస్తే కాల్చివేసే వారెంట్' ఉన్నది. పార్టీ ఆదేశాల మేరకు మారు వేషాలతో భార్య జానకమ్మతో సహా ముంబయి చేరుకొని అజ్ఞాతవాసం చేశాడు. నిజాంపాలన అంతమై, తెలంగాణ విముక్తి పొందిన తరువాత తిరిగి సుద్దాలకు చేరుకున్నాడు. అప్పుడు వైద్యవృత్తిని ఎన్నుకొని పరీక్షలో ఉత్తీర్ణత పొంది వైద్యుడిగా జీవితాన్ని ప్రారంభించాడు. కమ్యూనిస్టు పార్టీ సుద్దాల గ్రామశాఖ కార్యదర్శిగా పనిచేశాడు.

సాయుధ పోరాటం ద్వారా వేలాది వీరులు తమ ప్రాణాలను ధారపోసి సాధించిన తెలంగాణ ఫలాలను మళ్ళీ దొరలు, పెత్తందారులు, భూస్వాములు, దోపిడీదారులు దండుకున్నారనేది సుద్దాల హనుమంతు భావన. తాను కోరుకున్న ప్రజారాజ్యం రాలేదని తలచేవాడు. ఆ క్రమంలోనే 'ఆహా మంటలు, మంటలు', 'ఇదే రామరాజ్యమా, ఇదే ప్రజాస్వామ్య' 'గాంధీతాతా, శాంతిదూతా' అంటూ సమాజంలోని దీనమైన జీవితాలను చూసి ద్రవించిపోయి ఎన్నో గేయాలు రాశాడు. అంతేగాక ఓట్ల కొరకై నోట్లు పంచి, వసుధ ప్రజలను మోసగించి, సీట్ల కొరకై సిగ్గు విడిచి, సిగలు సిగలే పట్టుకొనిరి అంటూ నేటి రాజకీయ అరాచకాన్ని 'చెందొర పెద్దొర' అనే గేయం ద్వారా ఎండగట్టాడు.

ఇంతటి ఆదర్శజీవి, ఆచరణశీలి, మానవతామూర్తి, తాడిత పీడిత శ్రామిక వర్గాల ఆశాజ్యోతి, నిస్వార్థజీవిని క్యాన్సరు వ్యాధి కబళించింది. ఆ బాధను మరణాంతం మౌనంగా భరించాడే తప్ప ఏనాడూ బహిరంగ పరచలేదు. చివరకు జీర్ణాశయ క్యాన్సరుతో 1982 అక్టోబరు 10న మరణించాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూపొందించిన తెలుగు పాఠ్యపుస్తకాలలో ఆరవ తరగతిలో ఆయన రచించిన పల్లెటూరి పిల్లగాడ పాటను చేర్చడం ఆయనకు దక్కిన గౌరవం.

ఆయన దేహానికి మరణం ఉందేమో కానీ ఆయన ఆశయాలకు, భావాలకు మరణం లేదు. ఉద్యమం ఉన్న చోటల్లా ఆయన చైతన్య కిరణమై వెలుగొందుతుంటాడు. స్ఫూర్తిని కలిగిస్తూనే ఉంటాడు. భావితరాన్ని 'జాగరతండోయ్ జాగరత' అని హెచ్చరిస్తూనే ఉంటాడు.

*(నేడు సుద్దాల హనుమంతు జయంతి సందర్భంగా)*

# హైటెక్స్‌లో ఘనంగా 'థ్రెడ్ పోచంపల్లి' ప్రారంభం

● తెలంగాణ ప్రసిద్ధ ఇకత్ వారసత్వానికి అద్భుత వేదిక




**ప్రజాపక్షం/రంగారెడ్డి :** తెలంగాణకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చిన పోచంపల్లి ఇకత్ కళా వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'థ్రెడ్ పోచంపల్లి' ప్రదర్శనను హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హాల్ 4లో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత అండ్ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, చేనేత కళాకారులు, పరిశ్రమ ప్రతినిధులు, చేనేత ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం తెలంగాణ జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమై సందర్శకులను ఆకట్టుకుంది. ప్రత్యేకంగా రూపొందించిన ప్రవేశ మండపంలో సంప్రదాయ మగ్గాల ప్రదర్శన, పద్మశ్రీ పురస్కార గ్రహీతల చేత రూపొందించిన అద్భుత హస్తకళాఖండాలు, సహజ రంగులు, వాటి తయారీకి ఉపయోగించే పదార్థాల ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆధునిక ఏఐ ఎక్స్‌పీరియన్స్ బూత్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సందర్శకులు వర్చువల్‌గా పోచంపల్లి ఇకత్ దుస్తులను ధరించి ఆ అనుభూతిని పొందే అవకాశం కల్పించారు. ఇకత్ తయారీ ప్రక్రియను దశలవారీగా వివరిస్తూ ప్రత్యేక విజువల్ గ్యాలరీని కూడా ఏర్పాటు చేశారు. 100కు పైగా స్టాళ్లలో సంప్రదాయ చీరలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, పురుషుల వస్త్రాలు, గృహ అలంకరణ ఉత్పత్తులు, జీవనశైలి ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. పోచంపల్లి నేయకళ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఎలా విస్తరిస్తోందో ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తోంది. తెలంగాణ టూరిజం శాఖ కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై, భూధాన్ పోచంపల్లి గ్రామ సందర్శనకు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను ప్రచారం చేస్తోంది. వీటి ద్వారా సందర్శకులు నేరుగా నేత కుటుంబాలను కలుసుకుని, సంప్రదాయ మగ్గాల పనితీరును వీక్షించే అవకాశం పొందనున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనను సందర్శించి, అసలైన చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వేలాది నేత కుటుంబాలకు మద్దతు అందించాలని కోరారు. పోచంపల్లి ప్రాంతీయ వంటకాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆహార స్టాళ్లు సందర్శకులకు సాంస్కృతిక అనుభూతిని కలిగిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన జూన్ 7, 2026 వరకు కొనసాగనుంది. తెలంగాణ చేనేత వైభవాన్ని తెలుసుకోవడానికి, అనుభవించడానికి, ప్రోత్సహించడానికి ఇది అరుదైన అవకాశంగా నిలవనుంది.

## అండమాన్- నికోబార్ దీవుల పరిరక్షణకు రాహుల్‌గాంధీ పిలుపునకు సంపూర్ణ మద్దతు

● టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అండమాన్‌నికోబార్ దీవుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రకృతి సంపదలను కాపాడుతూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలనేది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని, పర్యావరణాన్ని ధ్వంసం చేసే అభివృద్ధి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రాజకీయ అంశాలపై అధ్యయనం చేస్తూ, సుశిక్షితులైన కమ్యూనిస్టులుగా తయారుకావాలి

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/వేములవాడ టౌన్ :** రోజురోజుకు దేశంలో మారుతున్న సమకాలిన రాజకీయాల పై అధ్యయనం చేస్తూ, సుశిక్షితులైన కమ్యూనిస్టులుగా తయారు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు రాజకీయ శిక్షణా శిబిరాలు దోహద పడతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వేములవాడలోని మహందీశ్వర బాంకెట్ హాలులో మూడు రోజుల పాటు జరిగే కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సిపిఐ కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణా శిబిరం ప్రారంభమయ్యింది. ఈ శిక్షణా శిబిరాల ప్రారంభ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అధ్యక్షత వహించారు. శిక్షణా శిబిరం ప్రారంభ సూచికగా ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు ఎగురవేశారు. ప్రారంభానికి ముఖ్య అతిథులుగా హాజరైన చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో, దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను, మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలను అవగాహన చేసుకోవడానికి, రాజకీయ అవగాహన కల్పించుకోవడం కోసం, కార్యకర్తలను నాయకులుగా తీర్చి దిద్దడానికి రాజకీయ శిక్షణా శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ రాజకీయ శిక్షణ శిబిరాలు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహించాలని రాష్ట్ర పార్టీ నిర్ణయించిందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిపిఐ కౌన్సిల్ సభ్యులకు శిక్షణ శిబిరాలు వేములవాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడీ ప్రధానమంత్రిగా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో సామాజిక న్యాయం కొరబడిందని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కూడు, గుడ్డ, నీడ కూడా కల్పించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని, దేశ సంపదను అందరికీ అందించడం లేదని, పైపై మెరుగులతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కూలీల పొట్టలు కొట్టేందుకు గతంలో కేంద్రం తొంబై శాతం నిధులు ఇస్తూ రాష్ట్రాలు 10% భరించేవాన్ని కానీ ఇప్పుడు ఆ చట్టంలో మార్పు లు తీసుకురావడం మూలంగా కేంద్రం 60% రాష్ట్రాలు 40 శాతం భరించాలని కేంద్రం చెప్పడం చూస్తుంటే దేశంలోని రాష్ట్రాలపై భారం వేస్తూ తిరోగమన పాలన కొనసాగిస్తున్నదని వెంకటరెడ్డి అన్నారు. రెండు రాష్ట్రాలుగా విడిపోయినా ప్రజల మధ్య ఎలాంటి వైశాల్యాలు వైరుధ్యాలు లేవని పవన్‌కళ్యాణ్ లాంటి వారు రెండు రాష్ట్రాల మధ్య అగాధం సృష్టించడానికి పూనుకోవడం బాధాకరమని, రాష్ట్రాల విభజన సమయంలో పార్లమెంటు డోర్లు పెట్టి విభజన చేశారని మోడీ వ్యాఖ్యలను పవన్ కళ్యాణ్ కూడా అదే వ్యాఖ్యలు చేయడం, తెలంగాణ మీ జాగీరా అని వ్యాఖ్యానించడం తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని పవన్‌కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మొదటిరోజు జరిగిన ఈ శిక్షణ శిబిరాల్లో తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు, మధూకర్, బీఎస్ మోహన్ రెడ్డి క్లాస్ బోధించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సిపిఐ కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్, చెన్న విశ్వనాథం, సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు, సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జీ కడారి రాములు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్, కె.వి.అనసూయ తదితరులుపాల్గొన్నారు.

# ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా తుమ్మిడిహట్టిని నిర్మిస్తాం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తుమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో బిజెపి వైఖరి స్పష్టం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్ని విషయాలపై మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు తుమ్మిడిహట్టిపై ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎలాంటి రాజీ పడబోదని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా తుమ్మిడిహట్టి బ్యారేజీని నిర్మించి తీరుతుందని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 575 టిఎంసిల వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం న్యాయపోరాటం కొనసాగిస్తోందని, గతంలో రాష్ట్ర వాటాను 299 టిఎంసిలకు పరిమితం చేయడం వల్ల తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆది శ్రీనివాస్ విమర్శించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మిస్తే ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని ఆయన వివరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేసి, 71 కిలోమీటర్ల కాలువ పనులు పూర్తి చేశారని తెలిపారు. 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే 100 టిఎంసిల నీటిని వినియోగించుకోవచ్చని, గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీరు తరలించే అవకాశం ఉంటుందన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాసినా ఇప్పటివరకు స్పందన రాలేదని, ఈ విషయంలో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు, ఎంఎల్‌ఏలు చొరవ చూపడం లేదని విమర్శించారు. బండి సంజయ్ మహారాష్ట్ర సిఎం అపాయింట్‌మెంట్ ఇప్పిస్తామని చెప్పినా ఇప్పటివరకు చర్యలు కనిపించడంలేదన్నారు. ప్రాణహితపై తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లోనే ప్రకటించిందని, త్వరలో సిఎం రేవంత్ రెడ్డి కూడా ఆ ప్రాంతాన్ని సందర్శిస్తారని తెలిపారు. తెలంగాణలో బిజెపిని బతికించుకోవడం కోసం బిజెపి నేత రాంచందర్‌రావు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఆయన మాట్లాడుతున్న తీరు అయోమయంగా ఉందని, రానున్న రోజుల్లో ఆయనను 'అయోమయం రాంచందర్‌రావు'గా పిలవాల్సి వస్తోందని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

# 11న రాష్ట్రవ్యాప్తంగా 'నిరసన ధర్నా'




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని, అలాగే 11వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 'నిరసన ధర్నా' చేపట్టాలని ఎఐవైఎఫ్ పిలుపునిచ్చింది. 'రాష్ట్ర వ్యాప్త నిరసన ధర్నా' వాల్‌పోస్టర్‌ను ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర హైదరాబాద్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల్లో భారీ సంఖ్యలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. ఒక వైపు నిరుద్యోగుల వయోపరిమితి దాటిపోతూ ఉద్యోగ అవకాశాలు కోల్పోతుంటే, మరోవైపు ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టే చర్యగా వారు అభివర్ణించారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలోని అన్ని శాఖలలో మంజూరైన పోస్టులు, పని చేస్తున్న ఉద్యోగులు, ఖాళీల వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలన్నారు. ప్రభుత్వ విద్యారంగం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని, వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం, మౌలిక వసతుల కొరత, నిధుల లేమి కారణంగా ప్రభుత్వ విద్య బలహీనపడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన ధర్నాల ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రాలను సమర్పిస్తామని, అప్పటికీ సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్ పోరాటాలను ప్రకటిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, లింగం రవి, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, యుగంధర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ, మొగిలి లక్ష్మణ్, పి.శివకుమార్, ఎల్లంకి మహేష్, శేఖర్, రాజ్‌కుమార్, మహేష్, ఆంజనేయులు, నయీమ్, హేమంత్, వెంకటేష్, మధుకర్, భాను పాల్గొన్నారు.

# సింగరేణిలో రూ.1600కోట్ల భారీ కుంభకోణంపై విచారణ చేపట్టాలి

● బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి సంస్థలో జరిగిన రూ.1600 కోట్ల భారీ కుంభకోణంపైన వెంటనే విచారణ చేపట్టాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారిక వెబ్ సైట్ రికార్డుల్లో ఏడు గనుల వద్ద బొగ్గు స్టాక్ ఉన్నట్టు పొందుపర్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ బొగ్గు కనిపించకపోవడం, కుంభకోణం జరిగినట్టు స్పష్టం చేస్తోందన్నారు. ఈ బొగ్గుకు సంబంధించి 'కోల్ సెస్' ఇన్‌కమ్ ట్యాక్స్‌ను చెల్లించామని లెక్కలను చూపిస్తున్నారని, కానీ క్షేత్రస్థాయిలో బొగ్గు లేకపోవడం వెనక ఎవరి హస్తం ఉందో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డికి కెటిఆర్ శుక్రవారం లేఖ రాశారు. రూ.16 వందల కోట్ల సింగరేణి బొగ్గు కుంభకోణంపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రిలో 7,20,00 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం1లో ఆరు లక్షలు, రామగుండం2లో నాలుగు లక్షలు, భూపాలపల్లిలో 5 లక్షల 40 వేలు, ఇల్లందులో 3 లక్షల 50 వేలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులతో పాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలను చూపించారని, కానీ కోల్ స్టాక్ పాయింట్ల వద్ద ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద ఆధారమని కెటిఆర్ పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలోనే బొగ్గు గనులపై నిల్వలను తనిఖీ చేసే బొగ్గు గనుల శాఖ అధికారుల బృందాలు రాకపోవడం, చివరికి కాగ్ అధికారులు కూడా ఇప్పటి వరకు తనిఖీలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక అఖిలపక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థను కబళించేందుకు సిఎం రేవంత్ హయాంలో సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే నిబంధనను విధించి, వారు కోరుకున్న వారికి టెండర్లను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుల విషయంలో నిబంధనలకు పాతరేసి నేషనల్ ఆవరేజీని కూడా మించి అత్యధిక ధరలకు టెండర్లను కట్టబెట్టి అక్రమాలకు పాల్పడ్డారని, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి నేరుగా డిజిల్ కొనుగోలు చేసే విధానాన్ని అర్ధాంతరంగా రద్దుచేసి, అందులో కూడా దోపిడీకి తెరలేపారని కెటిఆర్ ఆరోపించారు.

# తెలంగాణ యువత భవిష్యత్తుకు మార్గదర్శి 'ఎటిసి'



● విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.2 వేల స్టైఫండ్

● మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువత భవిష్యత్తుకు మార్గదర్శి 'ఎటిసి'లు అని, ప్రపంచ ఉద్యోగ విపణిలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా తెలంగాణ యువతను సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటిఐ) అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఎటిసి) తీర్చిదిద్దిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కేంద్రాలు కేవలం శిక్షణా సంస్థలుగానే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ కెరీర్‌లకు ద్వారాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర అభ్యాసం ఎంతో అవసరమని చెప్పారు. మల్లేపల్లి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను శుక్రవారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ట్రైనర్లు ఎటిసిల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఆధునిక యంత్రాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టిటిఎల్) భాగస్వామ్యంతో ఎటిసిల ఏర్పాటుకు సుమారు రూ.4 వేల కోట్ల విలువైన అత్యాధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలు, శిక్షణా వనరులను సమకూర్చిందని తెలిపారు.

**ఎటిసి విద్యార్థులకు ప్రతినెల రూ.2 వేల స్టైఫండ్..**

ఎటిసిల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రతి నెల రూ.2 వేల స్టైఫండ్ కూడా అందజేస్తోందన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు అనుగుణంగా శిక్షణా సంస్థలను ఆధునీకరించడం ద్వారా భవిష్యత్ పరిశ్రమల అవసరాలను తీర్చగల అత్యున్నత నైపుణ్యాలున్న మానవ వనరులు సిద్ధమవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడమే కాకుండా రాష్ట్రాన్ని దేశంలోనే నైపుణ్యాభివృద్ధి రంగంలో అగ్రగామిగా నిలబెడుతుందని అన్నారు. నైపుణ్యవంతమైన మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఎటిసిలు కీలక పాత్ర పోషిస్తాయని, తెలంగాణను దేశంలో ప్రముఖ నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా నిలబెట్టడంలో ఇవి మైలురాయిగా మారతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లేపల్లి ఎటిసి ప్రాంగణంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శనతో పాటు సాంకేతిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు మంత్రితో తమ అనుభవాలను పంచుకున్నారు.

# జల హక్కులు కాపాడటంలో ప్రభుత్వం విఫలం

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర జల హక్కులను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని, కృష్ణా జలాలను ఎపి 74 శాతం వినియోగిస్తే, తెలంగాణ 25 శాతానికే పరిమితమైందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ తాత్కాలిక వాటా 34 శాతం, ఎపికి 66 శాతం ఉండగా, 2024–25 సంవత్సరంలో ఎపి 72.73 శాతం నీటిని వినియోగిస్తే, తెలంగాణ కేవలం 27.27 శాతమే వినియోగించిందని హరీశ్ రావు తెలిపారు. 2025–26లో ఎపి 74.90 శాతం, తెలంగాణ వినియోగం చారిత్రక కనిష్టమైన 25.10 శాతానికి పడిపోయిందన్నారు. ఎత్తిపోతల ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని, కాళేశ్వరం, దేవాదుల నిర్వహణకు తగిన నిధులను కేటాయించాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలతో సాగునీటి రంగానికి ముప్పుఅని, అందుకే 'రైతు డిస్కం' ప్రతిపాదనలను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం గాయత్రి పంపింగ్ స్టేషన్‌తో పాటు దేవాదుల తదితర ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో పంపులు, మోటార్లు దెబ్బతిన్నాయని, భారీ మోటార్లను పదే పదే ఆన్‌ఆఫ్ చేయడంతో పరికరాలు దెబ్బతింటాయని, తాము ముందే హెచ్చరించినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ ప్రధానంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే అందుబాటులో ఉంటుందని, తద్వారా ఎత్తిపోతల ప్రాజెక్టుల పంపింగ్ కార్యకలాపాలు పరిమిత సమయానికే కట్టుబడే ప్రమాదం ఉన్నదని వివరించారు. నీటి వినియోగం తగ్గితే ఆ ప్రభావం వ్యవసాయం, తాగునీరు, భూగర్భ జలాలు, చేపల పెంపకం, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, గ్రామీణ జీవనోపాధిపై పడుతుందని పేర్కొన్నారు.



# పర్యావరణ స్పృహతో పుడమిని రక్షిద్దాం

● పర్యావరణ దినోత్సవ సందర్భంగా సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్పృహతో భూమి తల్లి రక్షణకు పూనుకోవాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని పెంచుతూ పర్యావరణకు దోహదపడాలని సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలను నాటారు. సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించి సందేశం ఇస్తూ విధి నిర్వహణలోను, తన వ్యక్తిగత జీవితంలో కూడా ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్ఫూర్తిని పాటించాలని కోరారు. అందరూ పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, ఈడి (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్), మార్కెటింగ్ టి.శ్రీనివాస్ పాల్గొని మొక్కలను నాటారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో కూడా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించగా, పలుచోట్ల మొక్కలు నాటారు.


**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: గాజులరామారం సర్కిల్-57.**

NIT No & Date: 07/DB/EE/Gajularamaram Circle-57/CMC/2026-27

**పని పేరు:** లోగో మార్పు, 9 మీటర్ల ఎత్తు గల అష్టభుజి స్తంభాల సరఫరా (11 సంఖ్యలు), అలాగే LED సేకరణ మరియు AB కేబుల్ సేకరణ (మొత్తం 5 పనులు)., **అంచనా విలువ:** రూ.29.74 లక్షలు, **ప్రారంభ తేదీ & సమయం:** 06.06.2026 మ.3:00గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 15.06.2026 మ.3:00గం.ల వరకు, **టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం.** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 7893066262, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 9063836115. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, సిఎంసి.

DIPR R.O. No. : 3666-PP/CL/ADVT/2026-27, Date: 05-06-2026

**పురపాలక సంఘం, సిరిసిల్ల.**
**జిల్లా: రాజన్న సిరిసిల్ల**

Lr. No. E1/SRCL/Quotation Notice-03/2026-27, Date: 04-06-2026

పురపాలక సంఘం, సిరిసిల్ల - సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అవసరమగు మెషినరీ **విండ్రో టర్నర్** మరియు ఇతర పరికరాలు కొనుగోలు చేయుటకు గాను యూనిట్ రేటు మరియు కార్యాలయ నిర్వహణ కొరకు అవసరమగు అన్ని రకాల **స్టేషనరీ ఐటమ్స్** యొక్క రేట్ల కొరకు సంబంధిత సప్లయ్ దారులు లేదా ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లు కోరనైనది. కావున, సంబంధిత సప్లయ్ దారులు లేదా ఏజెన్సీలు తేది: 08-06-2026 రోజున సా.4.00 గంటల లోపు మీ యొక్క సీల్డ్ కొటేషన్లు ఇంజనీరింగ్ విభాగం, పురపాలక సంఘం, సిరిసిల్ల యందు సమర్పించగలరు. మరియు ఏదేని వివరాల కొరకు ఇంజనీరింగ్ విభాగం, పురపాలక సంఘం, సిరిసిల్ల యందు కార్యాలయ పని వేళలో సంప్రదించగలరు.

సం/- కమిషనర్
పురపాలక సంఘం, సిరిసిల్ల.

DIPR R.O. No. : 3628-PP/CL/ADVT/2026-27, Date: 05-06-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**


| NIT NO. | పని పేరు | కొటేషన్ల స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా & సెల్ నెం. |
|---|---|---|---|
| NIT No. 13/ EE/Cir-36/ KZ/GHMC/ 2026-27, తేది: 04.06. 2026 | పబ్లిక్ పార్క్ ఉపయోగం కోసం 'ఒక (1) సంఖ్యలో, కనీస డిజైన్‌తో కూడిన బహిరంగ పూల-నేపథ్య శిల్పాన్ని అందించడం, తయారు చేయడం, సరఫరా చేయడం, రవాణా చేయడం మరియు స్థాపించడం' కొరకు ధరల నిర్ధారణ కోసం సీల్డ్ కొటేషన్ల ఆహ్వానం. ఈ శిల్పం ఆధునిక, మతపరమైనదికాని, మరియు కనీస శైలిలో 8-12 అడుగుల ఎత్తులో రూపొందించబడాలి. దీనిని అధిక-నాణ్యత గల స్టెయిన్‌లెస్ స్టీల్ (గ్రేడ్ 304/316) లేదా ఆమోదించబడిన దానికి సమానమైన మెటీరియల్‌తో తయారు చేయాలి. ఇది బహిరంగ పర్యావరణ పరిస్థితులలో మన్నిక, తుప్పు నిరోధకత మరియు సుదీర్ఘ సేవా జీవితాన్ని నిర్ధారించాలి. ఇందులో నునుపైన వంపులు మరియు స్పష్టమైన గీతలతో సరళీకృత పూల అంశాలు ఉండాలి, మరియు ఇది మ్యాట్ / మిర్రర్ పాలిష్ ఆమోదించబడిన కలర్ కోటింగ్‌తో ఫినిషింగ్ చేయాలి. డిజైన్ ప్రకారం ఇది సంపూర్ణంగా ఉండాలి. | ప్రారంభ తేది: 05.06. 2026 ఉ.10:30 గం.ల నుండి / ఆఖరి తేది: 11.06. 2026 సా.4:30 గం.ల వరకు ముగుస్తుంది | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36, కె.జెడ్, జిహెచ్ ఎంసి, ఖైరతాబాద్. ఫోన్: 99899 30414 |
| మరిన్ని వివరాల కోసం, దయచేసి దిగువ సంతకం చేసిన వారి కార్యాలయాన్ని సంప్రదించండి లేదా @ https://ghmc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి. | | | |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36, (కెజెడ్) జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 3648-PP/CL/ADVT/2026-27, Date: 05-06-2026

# హైడ్రా భారీ ఆపరేషన్

* రూ.30వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి రక్షణ
* 250 కోట్ల సంవత్సరాల నాటి చారిత్రక రాతిగుట్టల పరిరక్షణ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా పుప్పాలగూడ ఖాజాగూడ సరిహద్దుల్లో భారీ రక్షణ చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండల పరిధిలోని సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణల నుంచి కాపాడింది. ఈ భూమి విలువ సుమారు రూ.30వేల కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో 250 కోట్ల సంవత్సరాల చరిత్ర కలిగిన రాతిగుట్టలు, పురాతన రాతి గుహలు, సహజసిద్ధ వృక్ష సంపద ఉన్నాయి. వీటి పరిరక్షణ కోసం దశాబ్దాలుగా 'సొసైటీ టు సేవ్ రాక్స్' పోరాటం చేస్తోంది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ జాప్యం జరగడంతో ఆక్రమణలకు అవకాశం ఏర్పడింది. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూములను గుర్తించారు. అనంతరం శుక్రవారం ఫెన్సింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్లు 452/1, 454/1లో మొత్తం 293.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఇందులో 263.05 ఎకరాలను గతంలో హెచ్ఎండిఏకు కేటాయించారు. గ్రామాల సరిహద్దు వివాదాల కారణంగా 63.05 ఎకరాలను ప్రైవేటు భూమిగా గుర్తించడంతో హెచ్ఎండిఏ పరిధిలో 200 ఎకరాలు మిగిలాయి. దేవాలయాలు, దర్గా కోసం కేటాయించిన భూములు మినహా మిగిలిన ప్రభుత్వ భూమికి హైడ్రా రక్షణ కల్పించింది. చారిత్రక రాతిగుట్టలు, ప్రకృతి సంపదను కాపాడిన హైడ్రా చర్యలను పర్యావరణ ప్రేమికులు, రాక్ సొసైటీ ప్రతినిధులు అభినందించారు. ఈ ప్రాంతానికి ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయితే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశముందన్నారు.

**అగ్నిప్రమాదాల నివారణకు హైడ్రా కార్యాచరణ**



నగరంలో తరచుగా జరుగుతున్న అగ్నిప్రమాదాల నివారణకు సమగ్ర విధివిధానాలు రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ తెలిపారు. అమీర్‌పేట లోని మైత్రేయివనం సమీప వెస్ట్ శ్రీనివాస్ నగర్‌లో గురువారం అగ్నిప్రమాదానికి గురైన షాపింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పాత విద్యుత్ వైరింగ్, సామర్థ్యానికి మించి విద్యుత్ వినియోగం కారణంగా షార్ట్‌షార్ట్యూట్‌లు ఏర్పడి అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అమీర్‌పేట్ ఘటనలో సమీపంలోని మెస్ చిమ్నీ నుంచి వచ్చిన నిప్పురవ్వల కారణమా, లేక షార్ట్‌ర్యూట్ కారణమా అన్న అంశంపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అగ్నిప్రమాదాల నివారణలో భాగంగా ఫైర్ ఎన్ఓసిల జారీ, క్రమం తప్పని తనిఖీలు, నిబంధనలు పాటించని వారిపై చర్యలు వంటి అంశాలపై ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. నగరంలోని అనేక భవనాలు, వాణిజ్య సముదాయాలకు ఫైర్ ఎన్ఓసిలు లేవని, వాటిని గుర్తించి చర్యలు చేపడతామని చెప్పారు.

## సమస్యలపై పర్యటించిన ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని 214, నాగులూ రు గ్రామాలలో సమస్యలపై మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ మల్లారెడ్డి దుండిగల్ సర్కిల్ అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి తో కలిసి పర్యటించారు. దుండిగల్ తండా 2 నుంచి గాగిలాపూర్ ఎందుకు తరలించారనీ, డ్రైనేజీ రోడ్లను, వీధి దీపాలు, పరిశీలించారు. డంపింగ్ యార్డ్, అదేవిధంగా రాంకీ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం దానివల్ల ప్రజలు జ్వరం దగ్గు బారిన పడుతున్నారనీ ఇండస్ట్రీ రాంకీ పొల్యూషన్ వల్ల ప్రజలు హాస్పిటల్ పాలు అవుతున్నారనీ ఇక్కడ మాకు ఒక బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని, అలాగే తండా ప్రజలు రేషన్ బియ్యం గురించి దాదాపు 5 కిలోమీటర్లు దుండిగల్ విలేజ్ కి పోయి తీసుకోవడం జరుగుతుందని, తండావాసులు ఆయనతో వాపోయారు. ఎంపీ సమస్యల న్నీ క్షుణ్ణంగా పరిశీలించి ఈ యొక్క సమస్యల పరిష్కారంతో వారం రోజుల్లో మరలా వస్తానని వాపోయారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.విగ్నేశ్వర్ చారీ, సెన్సార్ బోర్డు మెంబర్ డి.శ్యామ్ రావు, జిల్లా కిసాన్ మోర్చా గోనె మల్లారెడ్డి, సర్కిల్ ప్రధాన కార్యదర్శి తురాయి భాను గౌడ్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నా రు.

## ఎక్సైజ్ పోలీసుల దాడులు

### 9లీటర్ల సారా, 300లీటర్ల బెల్లం పానకం సీజ్

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు ఎక్సైజ్ సబ్‌డివిజన్ పరిధిలో ఎక్సై, జిల్లా టాస్క్ ఫోర్ పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా మద్య నిషేద అబ్కారి అధికారి విజయభాష్కర్, ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరిండెం ట్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణంలో డిటిఎఫ్ సిఐ శ్రీనివాస్ ఆద్వర్యాన ఎక్సైజ్ పోలీసుల దాడులు నిర్వహించారు. తాండూరు ఎక్సైజ్ పరిధిలో మూడు నాటు సారా కేసులు నమోదు చేసినట్లు ఎక్సై ఇంచార్జీ సిఐ రాణి వెల్లడించారు. తాండూరు మండల పరిది కొత్లాపూర్ తాండ, వాల్యానాయక్ తాండ, బాబునాయక్ తాండలకు చెందిన నాటు సారా తయారి దారులైన అమ్రీయా నాయక్, తులసి బాయి, రెడ్యానాయక్‌ల వద్ద 9లీటర్ల నాటుసారాను సీజ్ చేయడంతో పాటు 300లీటర్ల బెల్లపాకంను ద్వసం చేసినట్లు వివరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నాటు సారా తయారు చేసిన, విక్రహించడం, రవాణాణ చేసిన నేరమని అన్నారు. అక్రమ రవాణకు పాల్పడటం నేరమని హెచ్చరించారు. అరెస్టు చేసిన నిందుతులను బషిరాబాద్ తహాసిల్దార్ ముందు వారిని బైండవర్ చేసినట్లు వెల్లడించారు.

## కల్తీ,నాసిరకం ఆహార పదార్థాలు సీజ్

### యాజమాన్యానికి నోటీసులు జారీ చేసిన అధికారులు





**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో నాసిరకమైన ఆహార పదార్థాలు జోరుగా వడ్డిస్తున్నారు. హోటల్స్, రెస్టారెంట్‌లలో నిల్వ చేసిన ఆహా ర పదార్థాలను మరుసటి రోజు యధేచ్ఛగా వడ్డిస్తూ ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నా రు. తాండూరు పట్టణంలోని దుర్గాబార్ అండ్ రెస్టారెంట్ హోటల్‌పై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. హోటల్ నాసిరకం ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారన్న పుకార్లు సామాజిక మాధ్యమాలలో చెక్కర్లు కొట్టిన విష యం తెలిసిందే. ఇందుకు స్పందించిన తాండూరు మున్సిపల్ ఇంచార్జీ శానీటరి ఇన్‌స్పెక్టర్ రాములు సిబ్బందితో కలిసి గురువారం హోటల్‌లో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ దాడులలో నిర్వాహకు లు ఒక రోజు నిల్వ ఉన్నచికెన్‌తో పాటు ఇతర ఆహార పదార్థాలు నిల్వ చేసినట్లు గుర్తించారు. వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎప్పటికప్పుడు తని ఖీ చేయాల్సిన ఫుడ్ సేఫ్టీఅధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడం తో వారి ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. వారిచ్చే మాముళ్ళ మత్తులో జోరుగుతున్న అధికారులు హోటల్స్‌ను తనిఖి చేసిన పాపన పోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నా యి. ఎవ్వరైన వినియోగదారులు ఫిర్యాదు చేస్తేగాని మున్సిపల్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పదించడం లేదు. ప్రచార మాధ్యమాలలో చక్కర్లు కొట్టిన పుకార్లకు స్పందించిన తాండూరు మున్సిపల్ శాఖ శానీటరి ఇన్స్‌పెక్టర్‌లు రాములు, ఇతర సిబ్బందితో కలిసిన పట్టణంలోని దుర్గారెస్టారెంట్ హోటల్‌ను తనిఖీ చేశారు. తనిఖీలలో నాసిరకం ఆహార పదార్థాలను గుర్తించిన అధికారు లు నిర్వాహకులకు నోటీసులు సైతం జారి చేశా రు. ఇకపై ఇలాంటి ఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ దాడులలో ఇఇ ప్రవీణ్‌గౌడ్, జవాన్లు తదతర సిబ్బంది ఉన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి : మున్సిపల్ చైర్మన్ జాం రవి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా కృషి చేయాలని ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ జాం రవి, కమిషనర్ వెంకటగోపాల్‌లు మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని చెప్పారు.

మొక్కలు నాటడం వలన అనేక లాభాలు ఉన్నాయని పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పచ్చని చెట్లతో నిండిపోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, డిఇఇ స్ఫూర్తి, మేనెజర్ ఉష, ఆర్ఐలు రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, శానీటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, ఇంచార్జ్ టిపిఐ దేవేందర్‌రావు, మల్లిఖార్జున్, సుభాష్, స్థానిక నాయకులు వెంకటనర్సింహారెడ్డి, బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



## రేపటి శ్వాస..నేటి పచ్చదనం

### శ్మశానవాటికలో వనమహోత్సవం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఘట్‌కేసర్ సర్కిల్ ఆధ్వర్యంలో వనమహోత్సవం 2026–27 కార్యక్రమాన్ని పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ శ్మశానవాటికలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వాణి మొక్కలు నాటి పర్యావ రణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు.ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు చెట్ల పెంపకం అత్యవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఇఇ బి.చంద్రశేఖర్, యుబిడి బి.శ్రావణ్ కుమార్,అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొని పెద్ద ఎత్తు న మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సంకల్పించారు. ఒక్క మొక్క నాటండి భావితరాలకు పచ్చని ప్రపంచాన్ని అందించండి అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించింది.

## కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** భవిష్యత్తు తరాల కోసం మొక్కలను నాటాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ప్రకృతి స్ఫూర్తితో.. .వాతావరణం కోసం...మన భవిష్యత్తు కోసం కోర్టు ఆవరణలో 3కె వాక్ నిర్వహించారు. అనంతరం పలు రకాల మొక్కలను నాటారు. పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్‌లోని పలు కాలనీలు ఎన్నో సంవత్సరాలుగా స్టార్మ్ వాటర్ డ్రైన్ వర్షాకాలంలో కాలనీలో ముంపునకు గురవుతుండడంలో ఓపెన్ ఎయిర్ జైలు పర్యవేక్షణాధికారి భరత్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు అయ్యాయని పనులు త్వరితగతిన పూర్తి చేస్తే శాశ్వత పరిష్కా రం లభిస్తుందని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా డా.సత్యం శ్రీరంగం జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్, పిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెపిహెచ్‌బి టెంపుల్ బస్‌స్టాప్ వద్ద కెపిహెచ్‌బి కల్చరల్, వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ శంకర్ గౌడ్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణరాజ్‌పుత్ ఆధ్వర్యంలో శ్రావణి హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్త, శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్‌పర్సన్ శ్రీరంగం ఇందుమతి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యం శ్రీరంగం మరిన్ని విజయాలు సాధించి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కృష్ణరాజ్‌పుత్ ఆధ్వర్యంలో విజయదుర్గ సెంటర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మయ్య జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ శ్రీ హేమదుర్గా భవన్‌లో శుక్రవారం ఘనంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మ య్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ, టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, లక్ష్మ య్యను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భం గా బండి రమేష్, సాయిబాబా చౌదరి మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో సీనియన్ నాయకులకు సముచిత గౌరవం ఉంటుందని అన్నారు. పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు మంచి అవకాశాలు, పదవులు లభించేలా తాము కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ధర్మరావు, మస్తాన్ రెడ్డి, కనకయ్య, పిడికిటి గోపాల్ చౌదరి,నాగమణి, తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**ప్రజాపక్షం/శామీర్‌పేట్:** అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో లాల్ గడి మలక్ పేట్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవమును పురస్కరించుకొని మున్సిపల్ చైర్మన్ కంతం శిరీష కృష్ణా రెడ్డి మొక్కలను నాటి అలియాబాద్ మున్సిపాలిటీ ప్రజలకు పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు యొక్క ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలోలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు సరసం వనజ అశోక్ రెడ్డి, గూడె వెంకటేశ్ నాయకులు కోదూరి దినేష్, అధికారులు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్ ఎండి ఎజాస్



**ప్రజాపక్షం/పరిగి:** మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకిరించిన మున్సిపల్ కమిషన్ మల్లేశం ను శుక్రవారం 11వ వార్డు కౌన్సిలర్ ఎండి ఎజాస్ కలిసి ఘన స్వాగతం పలికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ అభివృద్ధి పనులు మరింత జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఈ హరికృష్ణ, అనిల్, సల్మాన్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



## రేపు ఎఎంసి ప్రధాన కార్యాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

### సిఎం రేవంత్‌రెడ్డి రాక కోసం ఏర్పాట్లు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో కేటాయించిన పదెకరాల స్థలంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 7న (ఆదివారం) భవన నిర్మాణ పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా శుక్రవారం ఏఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి జోనల్ కమిషనర్లు, కార్పొరేషన్‌కు చెందిన వివిధ విభాగ అధిపతులు, ట్రాఫిక్, శాంతి భద్రతల విభాగ పోలీసు, జలమండలి అధికారులతో కలిసి వేదిక స్థలాన్ని సందర్శించి ఏర్పాట్ల విషయమై సమీక్ష నిర్వహించారు. వేదిక నిర్మాణ పనులు, అతిథులు కూర్చొనే ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ఆహ్వానితులతో పాటు సభా ప్రాంగణానికి వచ్చే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించటంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్లు రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్, వికాస్ మహతి, పారిశుధ్య అదనపు కమిషనర్ రఘుప్రసాద్, పరిపాలన అదనపు కమిషనర్ వేణుగోపాల్, చీఫ్ ఇంజనీర్ అశోక్‌రెడ్డి, డైరెక్టర్ యుబిడి సురేష్ కుమార్, వెటర్నరీ డిప్యూటి డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సీనియర్ ఎంటరాలజిస్టు మాధవరెడ్డి తదితర అధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

### భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కావాలి:డిసిసి అధ్యక్షుడు

ఏఎంసి ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి ఉప్పల్ భగాయత్‌కు సిఎం శంకుస్థాపన చేసే కార్యక్రమానికి మేడ్చల్ జిల్లావ్యాప్తంగా భారీ సంఖ్యలో హాజరు కావాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ కోరారు. శుక్రవారం ఆయన సభాస్థలిని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్‌యాదవ్, రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, తెలంగాణా రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డిలతో కల్సి ఏర్పాట్లను పరిశీలించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్ల నుండి ప్రజలు హాజరయ్యేలా ఆయా ప్రాంత నాయకలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. జూన్ 7న సాయంత్రం 5.30గంటలకు సిఎం శంకుస్థానకు రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పావనీరెడ్డి, బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చేస్తా

### మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయటమే తన ప్రాధాన్యతగా ముందుకు వెళుతున్నానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాపురం డివిజన్ బృందావన్ కాలనీలో రూ.15.5 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజి నిర్మాణ పనులను ఆయన మాజీ కార్పొరేటర్ అనిల్ కిషోర్‌గౌడ్‌తో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాభివృద్ధి పనుల్లో ఎక్కడా ఎలాంటి రాజకీయ జోక్యం ఎంత మాత్రం ఉండదని, సంబంధిత అధికారులు, ప్రభుత్వంతో సమన్వయంతో ఫలితాలను రాబట్టుకోవటమే లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధిలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం వెంకటేష్, మేనేజర్ రమేష్, బిఆర్ఎస్ శ్రేణులు అనిల్ కిషోర్, కరుణాకర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం



**ప్రజాపక్షం/కుల్కచర్ల:** పరిగి నయోజకవర్గంలోని కుల్కచర్ల మండల పరిధిలోని పుట్టపాడు గ్రామంలో బేతి మొగలయ్య ఇంట్లో గురువారం చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంటిని పగులగొట్టి లాకర్‌లో ఉన్న 60వేల నగదు, 8తులాల వెండి గొలుసులు, 2వెండి ఉంగరాలు చోరి జరిగిందని కుమారుడు రాహుల్ ఫిర్యాదు చేశారు. చిన్ని కుమారుడు ఇంటికి రావడంతో చోరీ జరుగుతున్న విషయాన్ని గమనించాడని, చూసిన వెంటనే నిందితులు ఇద్దరు వ్యక్తులు హెచ్ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్ పై పరారయ్యారని తెలిపారు. గ్రామంలోని సిసి పూటేజ్‌లను పరిశీలించగా నిందితుల కదలికలు గుర్తించామనిని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగుతోందని ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపారు.

## సహజ వనరుల పరిరక్షణలో పాల్గొనండి

### ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పచ్చదనం పెంపొందిస్తూ సహజ వనరుల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పిలుపిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజా న్ అహ్మద్, జిల్లా అటవీ శాఖాధికారి వేణుమాధవరావు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, ఎన్‌జిఓ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటవీ సంరక్షణ, అటవీ అభివృద్ధి, వృక్షాపరణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ అంశా ల్లో కొనసాగుతున్న కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసారు. అభివృద్ధి చేసిన వివిధ అర్బన్ ఫారెస్టు పార్కుల విశేషాలు, నగర పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్ర, హరిత విహార వనాలను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణలో చురుకైన భాగస్వా మ్యం కనపరచిన ఎన్‌జిఓలు, స్వచ్ఛంధ కార్యకర్తలకు ఈ కార్యక్రమంలో ప్రశంసా పత్రాలను అందచేసారు. భావితరాలకు సహజ వనరులను పరిరక్షించాలంటే సమిష్టి కృషితో కూడిన ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరమన్నారు. పచ్చని పరిశుభ్రమైన వాతావరణ అనుకూల భవిష్యత్తు నిర్మాణంకోసం కదలిరావాలని కోరారు.

## దోసకాయల వెంకటేష్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/శామీర్ పేట్ :** మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయ ల వెంకటేష్ జన్మదిన వేడుకలు తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద శుక్రవారం ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు, అభిమానుల సమక్షంలో దోసకాయల వెంకటేష్ కేకు కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ కార్యకర్తలు, పలువురు నాయకులు సోషల్ మీడియా ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు పాఠశాలల్లో 50 శాతం రాయితీ

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలోని వివిధ ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు పూర్తి రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే జిల్లా శాఖ తరుపున చేసిన వినతికి స్పందించిన డిఇఒ 50 శాతం రాయితీ ఇవ్వాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రయివేటు పాఠశాలలో పిల్లల చదువులకు ఫీజులు భారంగా మారాయని జిల్లా కలెక్టర్ తో పాటు డిఇఒ దృష్టికి యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా నేతృత్వంలోని బృందం గురువారం తీసుకెళ్లటంతో ఈ మేరకు జిల్లా విద్యాధికారి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఉత్తర్వు కాపీలను డిఈఓ వెంకటేశ్వర్లు సలీమ్‌పాషాకు అందజేశారు. కార్యక్రమంలో మారాటీ రవి, జర్నలిస్ట్ నేతలు కరుణాకర్, భాస్కర్, భార్గవ్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

## డాన్స్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/యాచారం :** మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్‌కె డ్యాన్స్ స్టూడియో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మహబూబ్‌నగర్ శిల్పారామంలో తిరుపతి రాజు కోరియోగ్రాఫర్ సై డ్యాన్స్ స్టూడియో అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నాట్యకళా అవార్డ్స్ కాంపిటీషన్స్ నిర్వహించారు. తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని డ్యాన్స్ మాస్టర్ చిట్టి తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి మండలంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అఖిల, శ్రీనిధి, శేషిధర్ ,తమన్, శ్రావ్య, అక్షర, అవంతికా, ముస్కాన్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : విశాల



**ప్రజాపక్షం/కేశంపేట:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి బహిరంగ సభకు కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, వీరేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధ్యమని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి సాధించడం తోపాటు పెండింగ్ ప్రాజెక్టులకు కొత్త కళ వస్తుందని వివరించారు.

## అన్నిరంగాల్లో అభివృద్ధికి చర్యలు



**ప్రజాపక్షం/షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామ కంఠం భూమిని సర్వే చేసి మ్యాప్ ఇవ్వాలని తహసీల్దార్ అన్వర్‌కు సీతారాంపూర్ సర్పంచ్ పావని చెన్నయ్య వినతి పత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో కొందరూ గ్రామ కంఠం భూమిని అక్రమంగా కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయం తహసీల్దార్ అన్వర్ స్పందించి త్వరలోనే సర్వే చేసి గ్రామ కంఠం భూమి పూర్తి వివరాలు మ్యాప్‌ను గ్రామ పంచాయతీకి అందజేస్తామని తెలిపారు. గ్రామ పెద్దల సహాయ సహకారాలతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేస్తామని సర్పంచ్ పావని చెన్నయ్య పేర్కొన్నారు.

## సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు వద్దంటూ సిఎం సభకు..

ప్లకార్డులు పట్టుకొని జడ్చర్ల సభకు తరలిన గ్రామస్తులు




**ప్రజాపక్షం/కొత్తూరు:** సిద్దాపూర్ గ్రామం చెత్త డంపింగ్ యార్డుకు అడ్డా కాదని..పచ్చని పంటపొలాలకు కేంద్రమైన గ్రామమనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు కొత్తూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక జెఏసి అధ్యక్షుడు అంబటి ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం కొత్తూరు మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు, రైతులు స్వచ్ఛందంగా ప్లకార్డులు పట్టుకొని తరలివెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దాపూర్‌లో చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే పర్యావరణం పూర్తిగా దెబ్బతినే అస్కారం ఉంటుందని, సిద్దాపూర్‌తోపాటు అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అస్కారం ఉంటుందని వివరించారు. చెత్త డంపింగ్ యార్డు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, అందుకు సంబంధించిన నిరసన ప్లకార్డులో సభలో పట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు తెలిపారు. చెత్త డంపింగ్ యార్డు నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్వయంగా వినతిపత్రం అందజేసి గ్రామస్తుల అభ్యంతరాలను వివరించనున్నట్లు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి చెత్త డంపింగ్ యార్డు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆకాంక్షించారు.

# పర్యావరణ పరిరక్షణతోనే నగరాల సుస్థిరాభివృద్ధి

జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి

బేగంపేట ఐటిపిఐ భవనంలో ఘనంగా

ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

హాజరైన ప్రణాళిక నిపుణులు, అధికారులు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరాల ప్రణాళికా రచనలో, పాలనలో పర్యావరణ సుస్థిరతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా' (ఐటిపిఐ) తెలంగాణ రీజినల్ చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని ఐటిపిఐ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ఏడాది 'ప్రకృతి స్ఫూర్తితో.. శీతోష్ణస్థితి కోసం.. మన భవిష్యత్తు కోసం' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే తరాలకు సురక్షితమైన నగరాలను అందించడానికి సహజ వనరుల రక్షణ, జలవనరుల పునరుద్ధరణ, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం అత్యంత ఆవశ్యకమన్నారు. భూగర్భ జలాల రీఛార్జ్, శాస్త్రీయ నీటి యాజమాన్య పద్ధతుల ద్వారానే నీటి కొరతను, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కోగలమని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణను పట్టణ ప్రణాళిక, పాలనలో అంతర్భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సహజ వనరుల సంరక్షణ, చెరువుల పరిరక్షణ, పట్టణాల్లో హరితవనాల విస్తరణ, భవిష్యత్ తరాలకు అనుకూలమైన స్థిరమైన నగరాల నిర్మాణం కోసం సమిష్టి కృషి అవసరమన్నారు.

### టౌన్ ప్లానర్ల పాత్ర కీలకం

### ఐటిపిఐ చైర్మన్ దేవేందర్ రెడ్డి

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐటిపిఐ తెలంగాణ ప్రాంతీయ శాఖ చైర్మన్, టిటిసిపి డైరెక్టర్ ఎస్.దేవేందర్ రెడ్డి స్వాగత ప్రసంగం చేశారు. పర్యావరణ హితమైన, వాతావరణ మార్పులను తట్టుకునేలా పట్టణాభివృద్ధిని రూపొందించడంలో టౌన్ ప్లానర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. పట్టణ ప్రణాళికకర్తలు పర్యావరణహిత, వాతావరణ మార్పులకు తట్టుకునే నగరాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రముఖ నిపుణులు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి అంశాలపై ప్రసంగించారు. హెచ్‌ఎండిఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్, ఐఆర్ఎస్ హైదరాబాద్‌ను మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు అమలు చేస్తున్న సాంకేతిక పరిజ్ఞానాలు, వినూత్న కార్యక్రమాల గురించి వివరించారు. నగరానికి లభించిన ప్రతిష్ఠాత్మక 'ట్రీ సిటీస్ ఆఫ్ ది వరల్డ్ అవార్డు ప్రాధాన్యాన్ని వెల్లడించారు. టిజిఐసికి చెందిన ఎం.డి. సోహెల్ ఖాన్ దేశవ్యాప్తంగా యువ ఆవిష్కర్తలు చేపడుతున్న ప్రకృతి ఆధారిత ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్న వినూత్న ఆలోచనలను పరిచయం చేశారు. జెఎన్‌టియుహెచ్ యుసిఈఎస్‌టి పర్యావరణ కేంద్రానికి చెందిన డాక్టర్ చంద్రిమా రాయ్ మురుగునీటి శుద్ధి, నిర్వహణలో సాంకేతిక జోక్యాలపై అవగాహన కల్పిస్తూ నీటి సంరక్షణకు అవసరమైన సుస్థిర విధానాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ చర్యలు, సుస్థిర పట్టణీకరణ, పర్యావరణ పునరుద్ధరణ, వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత సాధన వంటి అంశాలపై వక్తలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికకర్తలు, ప్రభుత్వ అధికారులు, అధ్యాపకులు, నిపుణులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ సవాళ్లు, పరిష్కారాలపై చర్చించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, ఎంఎంసి చీఫ్ సిటీప్లానర్ బి.ప్రదీప్ కుమార్, హెచ్‌ఎండిఏ డైరక్టర్ ప్లానింగ్ విద్యాధర్ పాల్గొనగా, ఐటిపిఐ తెలంగాణ ప్రాంతీయ శాఖ ఉపాధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి మురళీధర్ రెడ్డి, ఖజాంచి పి. సుధ, కార్యవర్గ సభ్యులు కార్యక్రమాన్ని సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.

## షూటర్ ఇషా సింగ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే శ్రీగణేష్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ కంటోన్మెంట్ రైల్వే కాలనీకి చెందిన ఇషా సింగ్ భారత షూటర్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో 43/50 స్కోర్ సాధించి కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పిన సందర్భంగా, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆమెను ఘనంగా సన్మానించారు. 43/50 స్కోర్‌తో స్వర్ణ పతకం సాధించిన ఈ తెలుగు బిడ్డ విజయాన్ని అభినందిస్తూ, శ్రీగణేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికపై త్రివర్ణ పతాకం ఎగురవేసిన ఈ విజయం రాష్ట్ర యువతకు స్ఫూర్తిదాయకం. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీగణేష్ శాలువాతో సత్కరించి, భవిష్యత్తు పోటీలకు శుభాకాంక్షలు తెలిపారు.

# యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో, స్పోర్ట్స్ ప్యాడాక్ సహకారంతో నిర్వహిస్తున్న యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ 2026–27 శనివారం హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్‌పర్సన్ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలా దేవి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఫుట్‌బాల్‌ను గ్రామీణ స్థాయి నుంచి ప్రోత్సహించడం, చిన్నారులకు క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశాలు కల్పించడం లక్ష్యంగా యంగ్ తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ లీగ్ తెలంగాణలో బలమైన ఫుట్‌బాల్ సంస్కృతిని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, యువ క్రీడాకారులకు క్రమబద్ధమైన పోటీల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు ఉన్నతస్థాయికి ఎదిగే మార్గాన్ని కల్పిస్తుందని ఆమె పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు విక్టర్ అమల్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరై, యువ ఫుట్‌బాల్ ప్రతిభను ప్రోత్సహించేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు జకీర్‌హుస్సేన్, ఏడుకొండలు, జమీల్ షమీమ్, చంద్రశేఖర్‌తో పాటు తెలంగాణ క్రీడాప్రాధికారసంస్థ అధికారులు, డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొని యువ ఆటగాళ్లను ప్రోత్సహించారు. కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ శిక్షణార్థులు పాల్గొనడంతో ఎల్‌బిస్టేడియం సందడిగా మారింది.

# పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత

జిల్లా అదనపు జడ్జి స్వాతిరెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అనే విషయాన్ని గుర్తించుకోవాలని 16వ జిల్లా అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎస్.స్వాతిరెడ్డి సూచించారు. శుక్రవారం షాద్‌నగర్ కోర్టు సముదాయంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రజలందరు సంతోషంగా ఉండాలంటే విధిగా మొక్కలు నాటేందుకు కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిపై ఉందని, ప్రతి వ్యక్తి ఐదు మొక్కలను విధిగా నాటి రక్షించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. పర్యావరణాన్ని మనం రక్షిస్తే మనల్ని పర్యావరణం రక్షిస్తుందనే విషయాన్ని ప్రతివ్యక్తి గుర్తించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం అత్యంత అవసరమన్నారు. మొక్కలు నాట డం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో, వర్షపాతం పెరగడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగితే ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులు ఏ ర్పడి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఆటవీ శాఖ అధికారులతో కలిసి న్యాయవాదులు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మిస్ మాల్యాల సాహితి, సెకండ్‌క్లాస్ జడ్జి ప్రవీణ్‌కుమార్, ఆటవీశాఖ అధికారి మహ్మద్ అజీజ్, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు సబియాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాకు బిఆర్ఎస్ చుక్క నీరూ ఇవ్వలేదు

పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు కోసం శంకర్‌పల్లి మండలంలో గతంలో భారీస్థాయిలో టన్నెల్ తవ్వినా అనంతరం బిఆర్ఎస్ ప్రభుత్వం ఆ పనులను రద్దు చేసిందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. జూరాల నుంచి నీటిని తీసుకొచ్చి ఉంటే రంగారెడ్డి ప్రాంతానికి ఇప్పటికే సాగునీరు అందేదని, గత ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాకు చుక్కనీరు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొందుర్గు, పరిగి, లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ చేపట్టి 2.8 టిఎంసిల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో 90 శాతం పనులు పూర్తయ్యాయని బిఆర్ఎస్ నాయకులు చెబుతున్నది అవాస్తవమని, వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో కేవలం 30 శాతం పనులే పూర్తయ్యాయన్నారు. కొందుర్గు పరిగి లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టు సముద్ర మట్టానికి 670 మీటర్ల ఎత్తులో ఉండటం వల్ల హైదరాబాద్‌కు తాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. ఈ రిజర్వాయర్ నుంచి తెలంగాణలోని ఏ ప్రాంతానికైనా నీటిని సరఫరా చేసే అవకాశం ఉందన్నారు. మాజీ సిఎం కెసిఆర్ కనీసం ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూసేకరణకు ఆదేశాలు జారీ చేయడంతో ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొందని రామ్మోహన్ రెడ్డి చెప్పారు.

## గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం (ప్రస్తుతం చైతన్యపురిలో నడుస్తున్న) 2026–27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరం బిఎలో వైవిధ్యమైన కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదవతరగతి, ఇంటర్ మార్కుల (కనీస ఉత్తీర్ణత శాతం 55 శాతం )మెమో, బోనఫైడ్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, దోస్త్ రిజిస్ట్రేషన్ కాపీ, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటోలతో టిజిఎస్‌డబ్ల్యూ ఆర్‌డిసి ఇబ్రహీంపట్నం కళాశాలను సంప్రదించాలన్నారు. ప్రిన్సిపల్ ఫోన్ నంబర్లు, 9121004526, 7993065800 లను సంప్రదించాలని, లేదా చైతన్యపురి మెట్రో స్టేషన్ , చైతన్యపురి బస్‌స్టాండ్ వెనుక సర్వీస్ రోడ్డు, నవత ట్రాన్స్పోర్ట్ పక్కన, మెట్రో పిల్లర్ 1570 ఎదురుగా సంప్రదించాని కళాశాల ప్రిన్సిపాల్ హెచ్.రాధిక కోరారు.

# నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బస్సులు నడిపితే చర్యలు

షాద్‌నగర్ ఎంవిఐ సిహెచ్ స్వప్న



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బస్సులు నడిపిస్తే చర్యలు తప్పవని షాద్‌నగర్ ఎంవిఐ సిహెచ్.స్వప్నహెచ్చరించారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ స్కూల్స్‌కు సంబంధించిన బస్సులను తనిఖీ చేశారు. ప్రైవేట్ స్కూల్ బస్సులో ఉండాల్సిన ఫిట్‌నెస్, బ్రేకులు, టైర్లు, అత్యవసర ద్వారాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరాలు వంటి భద్రత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవిఐ స్వప్న మాట్లాడుతూ పాఠశాలలకు విద్యార్థులకు తరలించే బస్సులు విధంగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రమాదాలకు దారితీసే అస్కారం ఉంటుందని, అందుకే ప్రతి విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. పాఠశాలల నిర్వాహకులు స్కూల్ బస్సుల పట్ల తగిన జాగ్రత్తలు వహించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులను సురక్షితంగా స్కూల్‌కు చేర్చడం ఎంత ముఖ్యమో, అదే విధంగా ఇంటిని చేర్చాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంటుందని పేర్కొన్నారు. సామార్థ్యానికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించరాదని, నిబంధనల మేరకు మాత్రమే ఎక్కించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కాలం చెల్లిన బస్సులను తక్షణమే తొలగించేందుకు పాఠశాలల యాజమాన్యం కృషి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల యాజమానులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎంవిఐ అధికారులు ఉన్నారు.

# పకడ్బందీగా ఓటరు జాబితా సమగ్ర సవరణ

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రారెడ్డితో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఓటర్ల జాబితాను సరిచేయడానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టడం జరిగింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి గణన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఒ లు) వివరాలను పరిశీలించి అర్హులైన ఓటర్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు.హేతుబద్ధీకరించిన ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురించనున్నట్లు తెలిపారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి, సెప్టెంబర్ 28లోపు వాటిని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు.అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆర్డీఓలు సరిత, జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య

**ప్రజాపక్షం/తుర్కయాంజల్:** రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల సర్కిల్ తొర్రురు డివిజన్ పరిధి కోహెడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి దేవేందర్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. హన్మకొండకు చెందిన దేవేందర్ రెడ్డి (16) నాలుగు రోజుల క్రితమే తన నివాసం నుంచి కళాశాల హాస్టల్‌కు వచ్చినట్లు సమాచారం. కళాశాల హాస్టల్‌లో గురువారం సాయంత్రం తనకు కేటాయించిన గది కాకుండా మరో గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని దేవేందర్ ఆత్మహత్య చేసుకున్నాడు. చదువులో చురుకుగా ఉండే తమ కుమారుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పట్ల కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే తమకు సమాచారం ఇవ్వకుండా రాత్రి 10 గంటల సమయంలో ఫోన్ చేసి చెప్పారని, ఇది కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యమే అని తల్లిదండ్రులు ఆరోపించారు. తాము కళాశాలకు చేరుకునేలోపే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. విద్యార్థి మరణానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఘటనపై హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## సుస్థిర ప్రణాళికలతోనే అభివృద్ధి సాధ్యం: ఎస్.దేవేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్ సహకారంతో ఎఫ్‌బిహెచ్ 26వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్‌బిహెచ్ 26వ వార్షిక సంచిక (2025–26)ను డిటిసిపి డైరెక్టర్, ఐటిపిఐ( ఇండియా) చైర్మన్ ఎస్.దేవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర పట్టణాల అభివృద్ధి, పర్యావరణ పునరుద్ధరణ, సుస్థిర ప్రణాళికలతో అనుసంధానమై ఉండాలని సూచించారు. సుస్థిరమైన, పర్యావరణ హిత భవిష్యత్తు నిర్మాణంలో అందరి భాగస్వామ్యం అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి ఎఫ్ఐఇ చైర్మన్, ఐఇఐ అధ్యక్షుడు డా.రమణనాయక్ బానోతు అధ్యక్షత వహించగా.. ఎఫ్‌బిహెచ్ చైర్మన్ వేదకుమార్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్.నర్సింహం, డా.చక్రధర్, వివేక్, చకిలం వేణుగోపాలరావు, పి.నరహరి, సుబాష్‌రెడ్డి, ఎం.పాండురంగారావు, జె.గాయత్రి, కమతం మహేందర్‌రెడ్డి, ఎఫ్‌బిహెచ్ ఉపాధ్యక్షుడు ఎం.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి శోభాసింగ్, కన్వీనర్ వెంకటేశ్వరరావు, ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ కోఆర్డినేటర్ కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : కన్నం సత్యనారాయణ



**ప్రజాపక్షం/చార్మినార్:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ పిలుపునిచ్చారు.ఈ మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సంతోష్‌నగర్ సర్కిల్ పరిధిలోని వినయ్‌నగర్ కాలనీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానిక పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పచ్చదనం, మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో సంతోష్‌నగర్ డిసి భాస్కర్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ దేవజ, సర్కిల్ మేనేజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత ఉపాధి అవకాశాలను వెతుక్కోవాలి: పద్మారావుగౌడ్



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** నాణ్యత, నవ్యత, రుచి, శుచికి ప్రాముఖ్యతను కల్పించి ఆహారపదార్థాలను అందిస్తే భోజన ప్రియులు తప్పకుండా ఆదరిస్తారని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు పద్మారావునగర్‌లో లక్ష్మీ భాస్కర్ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ సహకారం కోసం వేచిచూడకుండా... స్వయం ఉపాధి అవకాశాలను కూడా వెతుక్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హోటల్ నిర్వాహకుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాస వైజయంతి గ్రంథం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** సాహితీ జిగీష సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో డా. పులిగడ్డ లలితవాణి రచించిన వ్యాస వైజయంతి గ్రంథం ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా డా.కెవిరమణాచారి, అతిథులుగా డా.రేవూరి అనంత పద్మనాభంరావు, ఆచార్య ఫణీంద్ర, ఆచార్య గౌరీశంకర్, డా, ఎం.దత్తాత్రేయశర్మ విచ్చేసి ప్రసంగించారు. సాహితీ జిగీష అధ్యక్షుడు బండారుపల్లి రామచంద్రరావు, కార్యదర్శి డా. పివి ఉమాశశి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

## పేద విద్యార్థులకు అండగా నిలవాలి



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** పేద, ఆంధ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ మాజీ నేత మూల రాజ్‌కుమార్‌గౌడ్ జయంతి సందర్భంగా బిఆర్ఎస్ నేతలు శుక్రవారం బేగంపేట్‌లోని లోని దేవనార్ ఆంధ విద్యార్థుల స్కూల్‌లో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై రాజ్ కుమార్ గౌడ్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జ్ తలసాని సాయి కిరణ్ యాదవ్, నిర్వాహకులు బాబా, వేణు గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అభిలాష్ రెడ్డి, కిషోర్, మాజీ కార్పొరేటర్‌లు టి.మహేశ్వరి, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ బిఆర్ ఎస్పార్టీ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, నరేందర్, కిషోర్, ప్రవీణ్‌రెడ్డి, శేఖర్, ఆరీఫ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.


# మున్సిపల్ శాఖలో 'బదిలీల' ఇష్టారాజ్యం!

- ప్రభుత్వం సీరియస్ - బదిలీలకు బ్రేక్
- జిహెచ్‌ఎంసి, ఎంఎంసి, సిఎంసిల్లో ఎక్కడివారు అక్కడే
- 'ప్రజాపక్షం' కథనపై విచారణకు ఆదేశించిన సర్కార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియకు అనుమతి లభించీ లభించకుండానే.. పురపాలక శాఖ పరిధిలోని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ (పిహెచ్‌ఈ) విభాగంలో చోటుచేసుకున్న బదిలీల వ్యవహారం ఇప్పుడు ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా, పారదర్శకతకు తూట్లు పొడుస్తూ ఇష్టారాజ్యంగా బదిలీలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఈ బదిలీల అమలుపై తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ఎక్కడి ఉద్యోగులు అక్కడే కొనసాగాలని, కొత్త జాయినింగ్‌లు, రిలీవింగ్‌లు తక్షణమే నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్లకు సర్కార్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

**నిబంధనలు తుంగలోకి.. 'సస్పెన్షన్' ఉన్నా బదిలీలా?**

సాధారణంగా బదిలీల ప్రక్రియలో సీనియారిటీ, సర్వీస్ కాలం, పరిపాలనా అవసరాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రధాన ప్రమాణాలుగా ఉండాలి. అయితే పిహెచ్‌ఈలో జరిగిన తాజా బదిలీల్లో ఈ ప్రమాణాలన్నింటినీ పూర్తిగా పక్కనపెట్టేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)కి సైతం యథేచ్ఛగా బదిలీ కల్పించడం శాఖలో తీవ్ర కలకలం రేపుతోంది. మరోవైపు ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన ఇంజనీర్లను మాత్రం కదల్చకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పిహెచ్‌ఈ బదిలీల వెనుక జరిగిన అవకతవకలపై 'ప్రజాపక్షం'లో ఈనెల 3వ తేదీన 'మున్సిపల్ శాఖలో బదిలీల ఇష్టారాజ్యం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంతో ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఓ) అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఈ పరిణామాలపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సిఎంఓ సైతం ఈ బదిలీల అక్రమాలపై పూర్తి వివరాలు, నివేదిక కోరినట్లు శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలోనే బదిలీలకు ప్రభుత్వం బ్రేక్ వేసింది.


మున్సిపల్ శాఖలో
బదిలీల ఇష్టారాజ్యం!

- జిఒ 38 మార్గదర్శకాలకు పాతర!
- స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్న శాఖలోనే అక్రమాలు?
- సస్పెన్షన్‌లో ఉన్న అధికారికి కూడా ట్రాన్స్‌ఫర్ జాబితాలో చోటు !
- ఆర్డర్ కాపీల కోసం రూ. 30,000 వసూలు చేస్తున్నట్లు ప్రచారం !

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మున్సిపల్ శాఖ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగంలో బదిలీల పర్వం వివాదాస్పదంగా మారింది. స్వయంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్న ఈ శాఖలో, కొందరు ఉన్నతాధికారులు నిబంధనలను తుంగలో తొక్కి తమకు నచ్చినట్లు చక్రం తిప్పారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీనియారిటీ, లాంగ్ స్టాండింగ్ నిబంధనలను పక్కనబెట్టి, పూర్తిగా వ్యవస్థను తప్పుదారి పట్టిస్తూ సాగిన ఈ బదిలీల వెనుక పెద్ద ఎత్తున ముడుపులు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ బదిలీల అక్రమాలకు పరాకాష్టగా నిలిచే ఒక విచిత్రమైన ఘటన వెలుగు చూసింది. గతంలో తీవ్ర ఆరోపణలపై సస్పెండ్ అయిన ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఇ) పేరును సైతం ఉన్నతాధికారులు బదిలీల జాబితాలో చేర్చడం గమనార్హం. సదరు అధికారి బదిలీ ఉత్తర్వులతో కొత్త స్థానంలో జాయిన్ అవ్వడానికి వెళ్లగా, అక్కడి చీఫ్ ఇంజనీర్ అవాక్కయ్యారు. మీరు సస్పెన్షన్‌లో ఉన్నారు కదా, ఎలా జాయిన్ అవుతారు? అని ప్రశ్నించినట్లు సమాచారం. దానికి ఆ సస్పెండ్ అయిన అధికారి.. తాను సస్పెన్షన్‌లో లేను, లీవ్‌లో ఉన్నాను అని అబద్ధాలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. సదరు అధికారి సస్పెన్షన్ వ్యవహారాన్ని జిహెచ్ఎంసి కమిషనర్ ముందే ఇఎన్‌సికి లిఖితపూర్వకంగా తెలియజేసినప్పటికీ, ప్రభుత్వం వద్ద ఆ నిజాన్ని దాచిపెట్టి మరీ బదిలీ లిస్టులో పేరు చేర్చడం వెనుక ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారి లీలలు ఉన్నాయని ఉద్యోగ వర్గాలు బహిరంగంగానే చర్చించుకుంటున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 38 నిబంధనల ప్రకారం 31.12.2025 నాటికి ఒకే స్థానంలో 4 ఏళ్లకు **తరువాయి 12లో**

ప్రజాపక్షం
epaper.prajapaksham.in
Hyderabad - Page 3 - 03 Jun 2026

ప్రజాపక్షం ఎఫెక్ట్

## వర్షాకాల సవాళ్లకు పరిష్కారం


హైడ్రా- ఎంఎంసి సంయుక్త సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సూచించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో వర్షాకాల సన్నద్ధతపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎంసి పరిధిలో 188 వాటర్‌లాగింగ్ పాయింట్లు గుర్తించామని, వాటిలో 69 ప్రధాన, 39 మధ్యస్థ, 80 స్వల్ప సమస్యల ప్రాంతాలుగా ఉన్నాయని అధికారులు వివరించారు. వీటి పరిష్కారానికి డిఆర్‌ఎఫ్ బృందాలు, మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు, స్థిర సిబ్బందిని సిద్ధం చేసినట్లు తెలిపారు. హైడ్రా, మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు, జలమండలి, విద్యుత్, ఇరిగేషన్, యుబిడి శాఖల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని కమిషనర్ సూచించారు. కమిషనరేట్ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు సంయుక్త కమిటీలు ఏర్పాటు చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మల్కాజిగిరి పరిధిలోని తొమ్మిది చెరువులకు గేట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. నాలాల నెట్‌వర్క్ మ్యాపింగ్ పూర్తి చేయడం ద్వారా వర్షపు నీటి ప్రవాహ నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని హైడ్రా కమిషనర్ అన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన సిఎంసి


ఇల్యూషన్ థీమ్ పార్కులో మొక్కలు నాటిన కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం2026 సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) ఆధ్వర్యంలో నల్లగండ్ల హుడా కాలనీలోని ఇల్యూషన్ థీమ్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మలెంపాటి, అదనపు కమిషనర్ వి.వి.ఎల్. సుభద్రాదేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ప్రకృతి స్ఫూర్తిగా... వాతావరణం కోసం... మన భవిష్యత్తు కోసం' అనే ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ థీమ్ ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణ పరిరక్షణ భావితరాల భవిష్యత్తుకు కీలకమన్నారు. సుమారు 4.32 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఇల్యూషన్ థీమ్ పార్కులో 350కు పైగా స్వదేశీ వృక్ష జాతులను నాటినట్లు అధికారులు తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణ, పట్టణ హరితీకరణ లక్ష్యంగా ఈ పార్కు అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన సుస్థిర సైబరాబాద్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్నారు.

# పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

- ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి
- ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ బిసి సిఎంలే లక్ష్యంగా పోరాడుతాం
- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ గౌడ్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంటే, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే బిసి లకు ఇంకా ఎక్కువ అన్యాయం జరుగుతూనే ఉందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రం రెండుగా విడిపోయిన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బిసి ల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగా మారిందని ఆయన విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన బిసి సంఘాల అత్యవసర సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తమ రాజకీయ విశ్లేషణలో భాగంగా జనసేన పార్టీ విధానాలపై మాట్లాడారనే కక్షతో ప్రొఫెసర్ నాగేశ్వరరావుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇదే సమయంలో తెలంగాణ ఉద్యమకారులు నిరసన తెలిపిన సందర్భంగా వారికి కౌంటర్‌గా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. 'తెలంగాణ మీ అయ్యా జాగీరా' అంటూ మాట్లాడటాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఆ వ్యాఖ్యలను పవన్ కళ్యాణ్ తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బిసి వాదాన్ని బలహీనపరచాలనే ఎలాంటి కుట్రలనైనా సహించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినప్పటికీ, అగ్రకులాలు మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ ఉచ్చులోకి బిసి , ఎస్‌సి, ఎస్‌టిలను లాగుతున్నాయని, బహుజనులు ఈ ఉచ్చులో పడొద్దని కోరారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కాసోజు శ్రీకాంతచారి నుంచి కానిస్టేబుల్ కృష్ణయ్య వరకు, కొండా లక్ష్మ ణ్ బాబూజీ నుంచి మొదలుకొని ప్రొఫెసర్ జయశంకర్ వరకు బిసి లే మూలస్తంభాలుగా నిలిచారని గుర్తుచేశారు. సకలజనుల సమ్మె, విద్యార్థి జెఎసి, ధూమ్ ధామ్లతో ఉద్యమాన్ని ఉధృతం చేసి త్యాగాలు చేసింది బహుజన వర్గాలేనని, కానీ ఈరోజు వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని పిడికెడు శాతం లేని అగ్రకులాలు మాత్రమే అనుభవిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలంగాణ ప్రాంతం నుంచి బిసి ఎమ్మెల్యేల సంఖ్య 24 మంది ఉంటే, తెలంగాణ వచ్చిన తర్వాత ఆ సంఖ్య 19కి తగ్గిపోయిందని వివరించారు. ఆంధ్ర, తెలంగాణ అంటూ అగ్రకులాల రాజకీయ అస్తిత్వం కోసం, కాంట్రాక్టులు పంచుకుంటూ, వియ్యం అందుకుంటూ, పదవులతో లక్షల కోట్లు గడిస్తున్నారని, ఇవేమీ గ్రహించని బహుజనులు సెంటిమెంటు ఉచ్చులో పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా బహుజన వాదాన్ని బలహీనపరిచే కుట్రలను చేధించి బిసి , ఎస్సీ, ఎస్టి, మైనార్టీలంతా ఏకమై అటు ఆంధ్ర, ఇటు తెలంగాణ రాష్ట్రాలలో రాజకీయ అధికారాన్ని కైవసం చేసుకోవడానికి, సీఎం పీఠంపై బిసి లను కూర్చోబెట్టడానికి కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో బిసి జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, అధికార ప్రతినిధి తాటికొండ విక్రమ్ గౌడ్, కో చైర్మన్ ఉప్పరి శేఖర్ సగర, మహిళా జేఏసీ వైస్ చైర్మన్ స్వర్ణ గౌడ్, బిసి జేఏసీ నాయకులు వెంకటేష్ గౌడ్, గూడూరు భాస్కర్ మేరు, సమతా యాదవ్, గౌతమి, ఇంద్రం రజక, వనజ, అనంతుల సాయి, బండిగారి భరత్ గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## జర్నలిస్టులకు తొలి విడత అక్రిడిటేషన్ కార్డులు



**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ:**అర్హులైన వారందరికి అక్రిడేషన్ కార్డులు అందచేస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. జిల్లా కలక్టరేట్‌లో శుక్రవారం జర్నలిస్టులకు తొలి విడత అక్రిడేషన్ కార్డులను ఆమె అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దినపత్రికలు, చానళ్లు వారీగా మంజూరైన తొలి విడత అక్రిడేషన్ కార్డులను డిపిఆర్ఓ కార్యాలయం నుంచి పొందాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సహాయ సంచాలకులు మహ్మద్ హబీబ్, డి.వెంకట్, కమిటీ సభ్యులు శంకర్ శిగ, నవీన్ కుమార్ యార, మహ్మద్ రఫీయోద్దీన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ముగిసిన జిహెచ్‌ఎంసి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాల ముగింపు వేడుక విక్టరీ ప్లే గ్రౌండ్‌లో ఘనంగా జరిగింది. గోల్కొండ జోనల్ కమిషనర్ ఉదయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై యువ క్రీడాకారులను, కోచ్లను అభినందించారు. గత కొన్నేళ్లుగా ఈ శిబిరాల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఎదిగారని ఆయన పేర్కొన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు పర్యావరణ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయ్ కుమార్ మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతను వివరించారు. పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో గోషామహల్ డిసి ఉమాప్రకాష్, క్రీడల డైరెక్టర్ ఎండి.కె. మొయిజుద్దీన్, విద్యార్థులు, కోచ్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## చెట్లను పెంచుదాం పర్యావరణాన్ని కాపాడుదాం


జస్టిస్ పి.సామ్ జోషి

**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ:**చెట్లను పెంచుదాం తద్వారా పర్యావరణాన్ని కాపాడుదామని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ కార్యనిర్వాహక అధ్యక్ష్యులు జస్టిస్ పి.సామ్ జోషి అన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి క్రిమినల్ కోర్టుల ప్రాంగణంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- పరిశుభ్రత, పచ్చదన హైదరాబాద్‌ను నిర్మిద్దాం
- ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మన్ వేదకుమార్




**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :**పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని, అది మనందరి బాధ్యత అని ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మన్ ఇఆర్.వేద కుమార్ మణికొండ అన్నారు. ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (ఎఫ్‌బిహెచ్) 26వ వార్షికోత్సవం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం శుక్రవారం హైదరాబాద్ ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఐఇఐ చైర్మన్ డా.డా.రమణ నాయక్ బానోతు అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మన్, సివిల్ ఇంజినీర్, అర్బన్ అండ్ రీజినల్ ప్లానర్ ఇఆర్.వేద కుమార్ మణికొండ విచ్చేసి, మాట్లాడారు. హైదరాబాద్‌ను పర్యావరణ కాలుష్యం నుంచి కాపాడటం, నగర ప్రత్యేకతను భవిష్యత్తు తరాలకు అందించడం లక్ష్యంగా ఫోరం నిరంతరం కృషిచేస్తున్నదన్నారు. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన జీవనోపయోగమైన హైదరాబాద్ నిర్మాణంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. మూసీ నది అభివృద్ధి, జలాశయాలు, సంస్కృతి, చారిత్రక కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రమణ నాయక్ అధ్యక్షోపన్యాసం చేస్తూ ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా), ఎఫ్‌బిహెచ్ మధ్య ఏర్పడిన సహకారం పర్యావరణ అవగాహన, సుస్థిర అభివృద్ధి దిశగా సాగుతున్నదన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా తెలంగాణ చాప్టర్ చైర్మన్ ఎస్. దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాలను కాపాడుకోవచ్చన్నారు. ఫ్యూచర్ సిటీని పర్యావరణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు టెండర్లు కూడా ఆహ్వానించి, మాస్టర్‌ప్లాన్ ద్వారా అభివృద్ధి చేసేందుకు 2027 వరకు లక్ష్యంగా పెట్టుకొన్నామన్నారు.హైదరాబాద్ మెట్రో విస్తరణ ప్రాజెక్టుతో ప్రైవేట్ వాహనాలు తగ్గుముఖం పడుతాయని, కాలుష్యం తగ్గి పర్యావరణానికి మంచి జరుగుతుందన్నారు. ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్ ఎఆర్. నరసింహం మాట్లాడుతూ వ్యవసాయంపై పిల్లలు ఆసక్తి కనబర్చాలని, ఆధునిక టెక్నాలజీ వైపు అడుగులేసి, సాగుపై శ్రద్ధ పెట్టాలని ఆయన కోరారు. డా. బి.చక్రధర్ మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎఫ్‌బిహెచ్ వార్షిక పుస్తకం–2026ను దేవేందర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పలువురు పర్యావరణ రచయితలకు, కవులకు మెమోంటో అందజేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బిహెచ్ ఉపాధ్యక్షులు ఎం.హెచ్ రావు, ప్రధాన కార్యదర్శి శోభా సింగ్, ఐఇఐ కన్వీనర్ వెంకటేశ్వరరావు, ఐఇఐ కార్యదర్శి ప్రొఫెసర్ మర్రి రమేశ్, ఎఫ్‌బిహెచ్ కో–ఆర్డినేటర్ కె.ప్రభాకర్, చకిలం వేణుగోపాల్‌రావు, పి.నరహరి, పర్యావరణ వేత్త సుభాష్‌రెడ్డి, ఇంజినీరు నిపుణులు, పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/వెంగళరావునగర్/అమీర్‌పేట్:** మైత్రీవనం సమీపంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదం బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాద ప్రాంతాన్ని కవిత శుక్రవారం సందర్శించి బాధితులను ఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కవిత మాట్లాడుతూ, తరచూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై ఇక్కడ వ్యాపారులు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణ నష్టం లేకుండా చూసినా.. సకాలంలో ఫైర్ ఇంజన్లు వచ్చి ఉంటే ఇంత ఆస్తి నష్టం జరిగి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తూ.. మునుముందు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని బాధితులకు భరోసా కల్పించారు. ఇదిలాఉండగా.. కోట్ల రూపాయల ఆస్తి నష్టమునకు కారణంగా నిలుస్తున్న మైత్రివనం అగ్ని ప్రమాద ప్రాంతాన్ని హైడ్రా బాస్ రంగనాథ్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ, ప్రమాదానికి లోనైనా బిల్డింగ్ వెనకాల గల హర్షమెస్ ఏర్పాటు చేసిన చిమిని ద్వారా వచ్చిన వేడి కారణంగా ప్రమాదం జరిగిందని కొందరు, షార్ట్ సర్క్యూట్ కారణం అని కొందరు చెప్తున్నారని.. అగ్నిమాపక శాఖ పోలీసులు విచారణ చేసిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలన్న ఆలోచనతో ప్రభుత్వం త్వరలో సంబంధిత శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసిందని తెలిపారు.

బిహార్‌లో మాజీ సిఎంలు లాలూ, రబ్రీదేవికి

# జెడ్ ప్లస్ భద్రత ఉపసంహరణ



**పాట్నా:** బిహార్ ప్రభుత్వం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రులు, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిలకు కల్పిస్తున్న అత్యున్నత స్థాయి జెడ్ ప్లస్ భద్రతను ఉపసంహరించుకుంది. విఐపి భద్రతపై జరిపిన సమీక్షల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. జనశక్తి జనతా దళ్ (జెజెడి) అధినేత, ఆర్‌జెడి అధినేత లాలూ యాదవ్ పెద్ద కుమారుడు అయిన తేజ్ ప్రతాప్‌కు కల్పిస్తున్న వైకేటగిరీ భద్రతను కూడా ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారు. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిలకు ఇకపై బిహార్ ప్రత్యేక సాయుధ పోలీసులు (బిఎస్‌ఎపి) భద్రత కల్పిస్తారు. ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్‌కు కల్పించిన వైప్లస్ భద్రతను బిహార్ ప్రభుత్వం కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు. లాలూ యాదవ్ పెద్ద కుమార్తె, ఎంపి మీసా భారతికి, తేజస్వి యాదవ్ భార్య రాజశ్రీ యాదవ్‌కు ఉన్న ప్రస్తుత భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయని ఓ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

# మోదీ సర్కార్ అడవులను నరికేస్తోంది

• పర్యావరణ పాలనా వ్యవస్థను బలహీనపరుస్తోంది : ఖర్గే

**న్యూఢిల్లీ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. అడవులను నరికివేయడం, పర్యావరణ పాలనా వ్యవస్థను బలహీనపరుస్తుండడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం విమర్శలు గుప్పించారు. పర్యావరణ పురోగతిపై భ్రమలు సృష్టించడానికి మోదీ ప్రభుత్వం తారుమారు చేసిన నిర్వచనాలు, పక్షపాతపు లెక్కలపై ఆధారపడుతుండగా, భారతదేశ సహజ అడవులు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు, మన అడవులు, నదులు, సముద్రాలు, గాలి, ఆవాసాల మరింత క్షీణతను ఆపాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రధాని మోదీ మండే ఉష్ణోగ్రతలను తట్టుకోవడానికి నీరు ఎక్కువగా తాగడం వంటి సంకేతాత్మక చర్యల ద్వారా పెరుగుతున్న వేడిని ఎదుర్కోవాలని పౌరులను బహిరంగంగా కోరుతుండగా, అదే సమయంలో ఆయన ప్రభుత్వం ఇటీవలి చరిత్రలో భారతదేశ పర్యావరణ సంపదపై అత్యంత తీవ్రమైన, భారీ స్థాయి దాడులలో ఒకదానికి అధ్యక్షత వహిస్తోంది' అని మండిపడ్డారు. గత 11 ఏళ్లలో దాదాపు 1,91,922 హెక్టార్ల అడవులను నరికివేశారని అధికారిక గణాంకాలు, ప్రాజెక్ట్ అనుమతులు సూచిస్తున్నాయని ఆయన అన్నారు. 2014 నుంచి అంచనా ప్రకారం 1.6 కోట్లకు పైగా చెట్లను ధ్వంసం చేశారని, ఇది మోదీ ప్రభుత్వ హరిత వాదనలకు, క్షేత్రస్థాయి వాస్తవానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని బట్టబయలు చేస్తోందని ఖర్గే ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఈ పర్యావరణ విధ్వంసం నిరంతరాయంగా కొనసాగుతోందని, అండమాన్ అండ్ నికోబార్‌లో, గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్ సుమారు 10 లక్షల చెట్లను నాశనం చేసే ప్రమాదం ఉందని, ఇది సున్నితమైన ద్వీప పర్యావరణ వ్యవస్థను ప్రమాదంలో పడేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'మధ్యప్రదేశ్‌లో, మైనింగ్, మౌలిక సదుపాయాల విస్తరణ అటవీ ప్రాంతాలలో సుమారు 7 లక్షల చెట్లను తుడిచిపెట్టేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో, హస్‌డియో అరండ్ బొగ్గు మైనింగ్ ప్రాజెక్ట్ సుమారు 5 లక్షల చెట్లను నరికివేయడానికి సిద్ధంగా ఉంది, ఇది కీలకమైన జీవవైవిధ్య హాట్‌స్పాట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. 'రాజస్థాన్‌లో, అనేక అభివృద్ధి ప్రాజెక్టులు దాదాపు 1.54 లక్షల చెట్లకు ముప్పు కలిగిస్తున్నాయని, ఇది ఇప్పటికే బలహీనంగా ఉన్న ఆరావళి పర్యావరణ వ్యవస్థను మరింత బలహీనపరుస్తోందని' ఆయన పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల వల్ల సుమారు లక్ష చెట్లను తొలగించారని, అసోంలో కేవలం నాలుగేళ్లలోనే జాతీయ రహదారుల విస్తరణ వల్ల దాదాపు లక్ష చెట్లను నరికివేశారని ఆయన ఆరోపించారు. ఒడిశాలో భారత్‌మాల ప్రాజెక్టు వల్ల సుమారు 50,000 చెట్లను నరికివేయగా, మహారాష్ట్రలో తీరప్రాంత రహదారుల నిర్మాణం, మైనింగ్ కార్యకలాపాల వల్ల కీలకమైన మడ అడవులతో పాటు సుమారు 45,000 చెట్లు నాశనమవుతున్నాయి. మోదీ ప్రభుత్వం అటవీ విస్తీర్ణం పెరిగిందని చెబుతున్నప్పటికీ, ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ (ఐఎస్‌ఎఫ్ఆర్) అటవీ విస్తీర్ణంను ఉపగ్రహ ఆధారిత కానోపీ సాంద్రతను ఉపయోగించి నిర్వచిస్తుందని, ఇందులో సహజ అడవులతో పాటు రబ్బరు



తోటలు, ఆయిల్ పామ్ తోటలు, పండ్ల తోటలు, వెదురు తోటలు, ఒక హెక్టారుకు పైబడిన ఇతర చెట్లతో నిండిన భూములను కూడా చేర్చుతుందని ఖర్గే అన్నారు. దశాబ్దాలుగా నిర్మించిన భారతదేశ పర్యావరణ పాలనా వ్యవస్థను ఈ ప్రభుత్వం బలహీనపరిచి, నిర్వీర్యం చేసిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవస్థను, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో వన్యప్రాణి సంరక్షణ చట్టం (1972), జల చట్టం (1974), అటవీ సంరక్షణ చట్టం (1980), వాయు చట్టం (1981) వంటి చారిత్రాత్మక చట్టాల ద్వారా తొలిసారిగా సంస్థాగతం చేశారని ఆయన అన్నారు. 'అంతిమంగా, భారతదేశ పర్యావరణ దార్శనికత మూడు ప్రాథమిక సూత్రాలపై ఆధారపడి ఉండాలి: చట్టబద్ధమైన పాలన పట్ల అచంచలమైన గౌరవం, స్థానిక సమాజాలతో సంఘర్షణకు బదులుగా వారితో అర్థవంతమైన భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణ, మానవ అభివృద్ధి ఒకదానితో ఒకటి గాఢంగా ముడిపడి ఉన్నాయనే గుర్తింపు. ఇటువంటి విధానం ద్వారా మాత్రమే భారతదేశం 21వ శతాబ్దానికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన, మరింత పటిష్టమైన భవిష్యత్తును నిర్మించుకోగలదు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

# మంత్రి పదవికి రామలింగారెడ్డి రాజీనామా

• శాఖల కేటాయింపుపై అసంతృప్తి
• కర్నాటక సిఎం డి.కె. శివకుమార్‌కు కొత్త తలనొప్పి



**బెంగళూరు :** గత మూడు రోజుల క్రితం కర్నాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన డికె శివకుమార్‌కు ఆదిలోనే కష్టాలు ఎదురవుతున్నాయి. శాఖల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు కాంగ్రెస్ నేత రామలింగ రెడ్డి శుక్రవారం ప్రకటించారు. తమకు బెంగళూరు అభివృద్ధి శాఖను ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ చివరకు భారీ, మధ్య తరహా నీటిపారుదల శాఖను కేటాయించారని ఆయన పేర్కొన్నారు. గురువారం రాత్రి ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ శాఖలను కేటాయించిన నేపథ్యంలో ఈ రాజీనామా నిర్ణయం వెలువడింది. 'నా అంతరాత్మకు విరుద్ధంగా పని చేయలేను కాబట్టి నేను నా పదవికి రాజీనామా చేస్తున్నాను' అని లింగారెడ్డి శుక్రవారం బెంగళురులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ అవమానాన్ని నేను ఎంతకాలం భరించగలను? నా ముందున్న ప్రత్యామ్నాయాలు ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. రెండుసార్లు తనను పిలిచి బెంగళూరు అభివృద్ధి శాఖను ఇస్తామని హామీ ఇచ్చారు, కానీ చివరకు అది మరొకరికి దక్కింది, అందుకే తకు బాధ కలిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే రాజీనామా చేస్తున్నానని చెప్పారు. అయితే, తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని, ఎమ్మెల్యేగా ఉంటానని స్పష్టం చేశారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన శివకుమార్ ప్రభుత్వానికి ఈ పరిణామం మొదటి పెద్ద సవాలుగా మారింది. బెంగళూరు నుంచి ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన లింగారెడ్డి, తన ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో మంత్రి పదవి కోసం ఎప్పుడూ లాబీయింగ్ చేయలేదని లేదా పార్టీ నాయకత్వాన్ని నిర్దిష్ట శాఖ కోసం అడగలేదని చెప్పారు. తాను ఎప్పుడూ సిద్ధరామయ్యను బెంగళూరు అభివృద్ధి శాఖ కోసం అడగలేదని, ఆయనే స్వయంగా ఆ శాఖను ఇస్తానని ప్రతిపాదించాన్నారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు, ఒక పార్టీ నేతకు ఎమ్మెల్సీ సీటును సిఫార్సు చేసే విషయంలో ఆయనను కలిశానని, అప్పుడు మంత్రి పదవి లేదా నిర్దిష్ట శాఖ కోసం ఎటువంటి డిమాంచ్ చేయలేదని ఆయన తెలిపారు. 'సిద్ధరామయ్యపై నాకు కోపం లేదు. శివకుమార్ పట్ల కోపం లేదు. ఖర్గే పట్ల కోపం లేదు. హైకమాండ్ పట్ల కూడా నాకు ఎలాంటి కోపం లేదు' అని ఆయన అన్నారు. కాగా, విలేకరుల సమావేశం జరుగుతుండగానే అసంతృప్తితో ఉన్న ఆ మంత్రిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ నాయకత్వం చివరి ప్రయత్నం చేసింది. కానీ రెడ్డి తన నిర్ణయానికి కట్టుబడి ఉన్నారు; తన రాజీనామా లేఖను స్వయంగా సమర్పించడానికి బదులుగా మధ్యవర్తుల ద్వారా ప్రభుత్వానికి పంపుతానని స్పష్టం చేశారు.

# కేరళలో భారీ వర్షాలు



బలమైన ఈదురు గాలులకు
విరిగిపడిన చెట్ల కొమ్మలు
వాహనాలు, పలు ఆస్తులకు నష్టం

**తిరువనంతపురం :** నైరుతి రుతుపవనాల రాకతో కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులు కొనసాగాయి. చెట్ల కొమ్మలు విరిగిపడటంతో వాహనాలు, ఆస్తిపాస్తులకు నష్టం వాటిల్లింది. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు వాతావరణ శాఖ (ఐఎండి) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వారాంతంలో వర్షాలు మరింత ఉధృతం కానున్నాయి. శనివారం నాడు మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్ ఐదు జిల్లాలకు, అలాగే ఆదివారం నాడు మలప్పురం, కోజికోడ్, వయనాడ్ మూడు జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం రాష్ట్రంలోని ఎర్నాకుళం, త్రిసూర్, పాలక్కాడ మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వీటితో పాటు, మిగిలిన ఆరు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' ప్రకటించింది. భారీ వర్షాల కారణంగా కొచ్చి కార్పొరేషన్ పరిధిలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి, దీనివల్ల కార్పొరేషన్ కార్యాలయం బయట నిరసనలు వ్యక్తమయ్యాయి. కోజికోడ్‌లో భారీ వర్షాలు, బలమైన గాలుల వల్ల కొన్ని భవనాల పైకప్పులు దెబ్బతిన్నాయి. చెట్ల కొమ్మలు విరిగిపడటంతో వాహనాలు ధ్వంసమయ్యాయి.

# రెబల్స్‌ను బుజ్జగిస్తున్న మమత బెనర్జీ



**కోల్‌కతా :** తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) 28 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా పార్టీలో చీలిక ఏర్పడింది. ఈ నేపథ్యంలో టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ పార్టీ నుంచి మరింత మంది బయటకు వెళ్లకుండా నిరోధించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికల అనంతర చీలికతో రోజురోజుకూ అసంతృప్తిగా కనిపిస్తున్న వర్గాన్ని ఐక్యంగా ఉంచేందుకు సీనియర్ నాయకులు కృషి చేస్తుండగా, ఆమె స్వయంగా తిరుగుబాటు శాసనసభ్యులను కలుస్తున్నారు. 58 మంది శాసనసభ్యులు టిఎంసి శాసనసభాపక్షంపై నియంత్రణ సాధించి, బహిష్కృత ఎమ్మెల్యేను ప్రతిపక్ష నాయకుడిగా నియమించిన తర్వాత, రీటాబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు శిబిరం సమావేశాలకు హాజరవుతున్నట్లు కనిపించిన హౌరా, ముర్షిదాబాద్, ఉత్తర దినాజ్‌పూర్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలతో గత రెండు రోజులుగా బెనర్జీ మాట్లాడారని పార్టీ వర్గాలు తెలిపాయి. తాను ఒకప్పుడు స్వయంగా ఎంపిక చేసి, రాజకీయంగా తీర్చిదిద్దిన నాయకులను పార్టీలోనే నిలుపుకోవడానికి పోరాడాల్సిన అపరిచిత పరిస్థితిలో టిఎంసి వ్యవస్థాపకురాలు ఉన్న తరుణంలో ఈ సంప్రదింపులు జరిగాయి. పార్టీ అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం, పార్లమెంటులో కూడా సమాంతరంగా నష్ట నివారణ చర్యలు కొనసాగుతున్నాయి. రీటాబ్రత బెనర్జీ వర్గం నిర్మిస్తున్న 'కొత్త తృణమూల్' కోసం పార్టీని వీడవద్దని తమ సహచరులను ఒప్పించేందుకు, లోక్‌సభ, రాజ్యసభల నుండి ఒక్కొక్కరు చొప్పున ఇద్దరు విశ్వసనీయ టిఎంసి ఎంపిలకు బాధ్యత అప్పగించినట్లు సమాచారం. ఈ సంప్రదింపులు, అసెంబ్లీ తిరుగుబాటును త్వరగా అదుపు చేయకపోతే అది పార్లమెంటు, స్థానిక సంస్థలకు కూడా వ్యాపించవచ్చనే ఆందోళన మిగిలిన టిఎంసి నాయకత్వంలో పెరుగుతోందన్న విషయాన్ని ప్రతిబింబిస్తున్నాయి. 1998లో టిఎంసిని ఒకే మహిళా రాజకీయ ఉద్యమంగా నిర్మించి, దాదాపు మూడు దశాబ్దాల పాటు దానిని తీవ్రమైన అంతర్గత తిరుగుబాట్ల నుండి దూరంగా ఉంచిన బెనర్జీ ఎదుర్కొంటున్న అసాధారణ ఎదురుదెబ్బను ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ పెరుగుతున్న పలుకుబడికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంగా ఈ చీలికను తిరుగుబాటు వర్గం చిత్రీకరిస్తున్నప్పటికీ, అదే సమయంలో మమతా బెనర్జీని ఒక ప్రతీకాత్మక, సైద్ధాంతిక లంగరుగా నిలుపుకోవాలని ప్రయత్నిస్తోంది. ఈ వైరుధ్యం అసమ్మతి వర్గంలోనే అంతర్గత కలహాలను బయటపెట్టడం ప్రారంభించింది. శాసనసభ పక్షంపై నియంత్రణ సాధించిన మరుసటి రోజే, బెనర్జీ పాత్రను పునర్నిర్వచించే ప్రయత్నాలపై తిరుగుబాటుదారులు అసౌకర్యాన్ని ప్రదర్శించారు. పార్టీ సర్వోన్నత నాయకురాలిగా కొనసాగించాలని ఎమ్మెల్యేలు బహిరంగంగా పట్టుబట్టారు.

# త్వరలో కొత్త రాజకీయ పార్టీ

• తమిళనాడులో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా : అన్నామలై
• బిజెపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా

**న్యూఢిల్లీ /చెన్నై :** తమిళనాడులో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించనుంది. రాష్ట్రంలో భారీ ప్రజాదరణ పొందిన తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై, శుక్రవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన లక్ష్యాలు చాలా పెద్దవని, అందరినీ కలుపుకుపోయే ఒక కొత్త అజెండాతో ఎక్కువ మంది ప్రజలను ముందుకు నడిపించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపించి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రసంగంలో, 'ప్రధాని మోదీ పట్ల నాకు ఎంతో గౌరవం ఉంది' అని అన్నామలై పేర్కొన్నారు. తాను గౌరవప్రదమైన రీతిలోనే బిజెపి నుంచి తప్పుకున్నానని స్పష్టం చేశారు. అలాగే, ఒక కొత్త తరహా రాజకీయాలకు నాంది పలకడమే తన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. బిజెపి జాతీయ నాయకుడు నితిన్ నబిన్ తన రాజీనామాను ఆమోదించిన తర్వాత, నేటి నుండి ఒక కొత్త మార్గం, ఒక కొత్త ఉద్యమం; ఒక కొత్త రాజకీయ ఉద్యమం మొదలవుతుందని ఆయన ప్రకటించారు. అన్నామలై ఇటీవల ఢిల్లీ పర్యటనలో ఉన్న



ప్పుడే తన రాజీనామాను సమర్పించినట్లు సమాచారం. 'భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు నితిన్ నబిన్, తమిళనాడు మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి సమర్పించిన రాజీనామాను ఆమోదించారు' అని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నామలై నిర్ణయాన్ని ఆయన మద్దతుదారులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుతూ స్వాగతించగా, ఆయన నిష్క్రమణ పార్టీకి ఎలాంటి నష్టం కలిగించదని బిజెపి పేర్కొంది. అయితే తాను ప్రారంభించబోయే కొత్త ఉద్యమం పునాది స్థాయి నుండే కొత్త కోణాలను, కొత్త దృక్పథాన్ని కలిగి ఉండాలని అన్నామలై అన్నారు. కొత్త పార్టీ కోసం నాయకులను, కార్యకర్తలను తీర్చిదిద్దాలని, దానికి సమయం పడుతుందని చెప్పారు. తమిళనాడు బిజెపి అధ్యక్షుడిగా తన పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ, తమిళనాడు అస్తిత్వం, సంస్కృతి, నీటి హక్కులతో సహా ఏ విషయంలోనూ తాను ఎప్పుడూ రాజీ పడలేదని అన్నామలై అన్నారు. తాను అకస్మాత్తుగా పార్టీని వదిలిపెట్టలేదని, సుమారు 18 నెలల పాటు పార్టీ నాయకత్వంతో అభిప్రాయ భేదాలపై ప్రశాంతంగా చర్చలు జరిపానని ఆ రాష్ట్ర మాజీ అగ్రనేత వివరించారు. చివరికి, పార్టీని వదిలివేయాలనుకుంటున్నట్లు డిసెంబర్ 4, 2025 నాడే బిజెపి నాయకత్వానికి తెలియజేశానని, అయితే అసెంబ్లీ ఎన్నికల పనులను పూర్తి చేయాలని పార్టీ పెద్దలు కోరారని, ఒక 'నిజమైన కార్యకర్త'గా తాను ఆ ఆదేశాన్ని పాటించానని ఆయన తెలిపారు. సమ్మిళిత రాజకీయాలకు మద్దతు పలుకుతూ, తమిళనాడు అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరినీ వినియోగించుకోవాలని ఆయన అన్నారు. వ్యక్తి ఆధారిత రాజకీయాల నుండి బయటపడి, సామాన్యుడి రాజకీయాలను నెలకొల్పాలి అని ఆయన నొక్కి చెప్పారు.

# మణిపూర్‌లో దుండగులు దాడి

• కాంగ్‌పోక్పి జిల్లాలో జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి
• ఈ దాడిలో ఏడు ఇళ్లు అగ్నికి ఆహుతి



**ఇంఫాల్ :** గత కొంత కాలంగా మణిపూర్‌లో అల్లర్లు, దాడులు ఆగడం లేదు. తాజాగా కాంగ్‌పోక్పి జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున సాయుధ దుండగులు జరిపిన దాడిలో ఒక మహిళతో సహా ముగ్గురు వ్యక్తులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని సైతుగాంఫజోల్ సబ్‌డివిజన్ పరిధిలోని లోయిబోల్ ఖుల్లెన్ గ్రామంలో తెల్లవారుజామున 4 గంటల సమయంలో జరిగిన ఈ దాడిలో ఏడు ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయని వారు పేర్కొన్నారు. పరస్పర విరోధ వర్గాల మధ్య కొన్ని నిమిషాల పాటు జరిగిన కాల్పుల్లో ఈ ముగ్గురు మరణించారని, దీనివల్ల గ్రామస్తులు ప్రాణ రక్షణ కోసం సమీపంలోని అటవీ ప్రాంతాలకు పారిపోవాల్సి వచ్చిందని ఒక అధికారి తెలిపారు. మరణించిన వారిని లెట్‌ఖోంగమ్ హాకిప్, టిన్‌మేరీ హాకిప్, జాంగ్‌మిన్‌లాల్ హాకిప్‌లుగా గుర్తించారు. ఉప ముఖ్యమంత్రి నెమ్చా కిప్‌జెన్ ఈ దాడిని ఖండించారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'అజ్ఞాత సాయుధ దుండగులు ముగ్గురు అమాయక వ్యక్తులను చంపడం, ఇళ్లను తగలబెట్టడం అత్యంత విషాదకరమైన, ఆమోదయోగ్యం కాని చర్య. బాధిత కుటుంబాలకు, ఈ ఘటన వల్ల ప్రభావితమైన వారందరికీ నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ప్రభుత్వం ఈ ఘటనను చాలా తీవ్రంగా పరిగణిస్తోంది. అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. ప్రజల భద్రత, రక్షణ మాకు అత్యంత ప్రాధాన్యత' అని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సంయమనం పాటించాలని, భయం, విభజనను సృష్టించాలని చూస్తున్న వారి రెచ్చగొట్టే చర్యలకు లోనుకావద్దని కిప్‌జెన్ విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో, రాష్ట్రంలోని కుకీ తెగల అత్యున్నత సంస్థ అయిన 'కుకీ ఇన్పి మణిపూర్' (కెఐఎం) కూడా ఈ దాడిని ఖండించింది. నిందితులను పట్టుకోవడానికి విచారణ జరపాలని డిమాండ చేసింది. ఆయుధాలు లేని పౌరులపై జరిగిన ఈ అనాగరిక హింసాత్మక చర్యను కెఐఎం తీవ్రంగా ఖండిస్తోందని, అమాయక వ్యక్తులను ఉద్దేశపూర్వకంగా చంపడం, అలాగే ఇళ్లు, జీవనోపాధిని ధ్వంసం చేయడం గౌరవానికి, ప్రాథమిక మానవ హక్కులకు తీవ్ర భంగం కలిగించే చర్య అని ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

## భారత్‌లో ఎయిర్ ట్రంక్...

# రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి

ప్రధాని మోదీ వెల్లడి

**న్యూఢిల్లీ :** ప్రముఖ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ స్పెషలిస్ట్ ఎయిర్ ట్రంక్ డిజిటల్ మౌలిక సదుపాయాల సామర్థ్యానికి మద్దతుగా 2030 నాటికి భారతదేశంలో రూ.3లక్షల కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నది. తద్వారా ఈ రంగాన్ని తన ప్రపంచ వృద్ధి వ్యూహంలో ఒక మూల స్తంభంగా నిలుపుకోనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ఎయిర్ ట్రంక్ వ్యవస్థాపకుడు, సిఇఓ రాబిన్ ఖుదాతో సమావేశమయ్యారు. అనంతరం ఆసియా పసిఫిక్, మధ్య ప్రాచ్య టెక్నో కంపెనీ అయిన ఎయిర్ ట్రంక్ పెట్టుబడి ప్రణాళికలను, అలాగే 5 గిగా వాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసే దాని వ్యూహాన్ని ప్రకటించారు. 'భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణం అద్భుతమైన వేగాన్ని పుంజుకుంటోంది. ఎయిర్ ట్రంక్ భారతదేశంలో సుమారు రూ.3లక్షల (30 బిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టి, 5 గిగా వాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను ప్రకటించింది. దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల వ్యవస్థలో ప్రతిపాదించబడిన అతిపెద్ద పెట్టుబడులలో ఇది ఒకటి' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పెట్టిన ఒక పోస్ట్‌లో తెలిపారు. ఇలాంటి పెట్టుబడులు క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాలలో ప్రపంచ కేంద్రంగా భారతదేశం స్థానాన్ని బలోపేతం చేయడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించి, స్థానిక సరఫరా గొలుసులకు మద్దతును ఇచ్చి ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తాయని మోదీ



పేర్కొన్నారు. 'ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు దేశంలోనే అంతకంతకూ రూపుదిద్దుకుంటున్నది స్పష్టం అవుతోంది' అని ఆయన చెప్పారు. ఎయిర్ ట్రంక్ అనేది ఆసియా పసిఫిక్, మధ్య ప్రాచ్య (ఎపిఎంఇ)ప్రాంతం అంతటా క్లౌడ్ కంటెంట్, పెద్ద ఎంటర్‌ప్రైజ్ కస్టమర్ల కోసం ఒక ప్లాట్‌ఫారమ్‌ను సృష్టించే ఒక హైపర్‌స్కేల్ డేటా సెంటర్ స్పెషలిస్ట్. భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత, సాంకేతిక పెట్టుబడులకు ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానాలలో దీనిని ఒకటిగా దీనిని తీర్చిదిద్దేందుకు సహాయపడిందని ఎయిర్ ట్రంక్ సిఇఓ ఖుదా చెప్పారు. ప్రపంచ ఏఐ శక్తిగా ఎదగడానికి అవసరమైన స్థాయి, ప్రతిభ, ఆశయం భారతదేశానికి ఉన్నాయి. ఆ దార్శనికతకు మద్దతు ఇవ్వడానికి ఎయిర్ ట్రంక్ ఉత్సాహంగా ఉంది అని ఆయన కంపెనీ తరపున విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారులలో ఒకరైన బ్లాక్‌స్టోన్ మద్దతుతో భారతదేశం, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ (సిపిపిఐ) ప్రతిపాదించిన పెట్టుబడి కార్యక్రమం, క్లౌడ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో తదుపరి వృద్ధి తరంగాన్ని సాధ్యం చేయడానికి, ప్రస్తుతం దేశంలో పరిగణనలో ఉన్న అతిపెద్ద మౌలిక సదుపాయాల కార్యక్రమాలలో ఒకటిగా నిలుస్తుంది. 'పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కంపెనీ ప్రతిపాదించిన అభివృద్ధి ప్రణాళిక, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ మౌలిక సదుపాయాల పెట్టుబడులకు ప్రపంచ గమ్యస్థానంగా మార్చాలన్న భారతదేశ ఆశయానికి మద్దతుఇస్తుందని, అదే సమయంలో గణనీయమైన ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి, టెక్నాలజీ ఎకోసిస్టమ్ వృద్ధిని సృష్టిస్తుంది'అని అది పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో లుమినా క్లౌడ్ ఇన్‌ఫ్రాను కొనుగోలు చేయడం ద్వారా కంపెనీ మార్కెట్‌లోకి ప్రవేశించిన అనంతరం, భారతదేశంలో ఎయిర్ ట్రంక్ సిఇఓ ఖుదా చేపట్టిన మొదటి ప్రభుత్వ భాగస్వామ్య కార్యక్రమం నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఈ కొనుగోలుతో ఎయిర్ ట్రంక్ భారతదేశంలోని ప్రస్తుత అభివృద్ధి పైప్ లైన్‌లో ముంబయ్, చెన్నయ్, హైదరాబాద్‌లలో 600 మెగావాట్ల ప్రాజెక్ట్‌లు చేర్చబడ్డాయి.ఈ కంపెనీ పరిశ్రమలో అగ్రగామిగా నిలిచే విశ్వసనీయత, సాంకేతిక ఆవిష్కరణలు, శక్తి, డేటా సామర్థ్య ప్రణాళికతో కూడిన డేటా సెంటర్ క్యాంపస్‌లను అభివృద్ధిచేసి నిర్వహిస్తుంది. 2015లో స్థాపించబడిన ఎయిర్ ట్రంక్, 2017లో ఆస్ట్రేలియా మొట్టమొదటి అతిపెద్ద హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వేగవంతమైన విస్తరణపై దృష్టి సారించి, ప్రస్తుతం ఎపిఎంఇ ప్రాంతం అంతటా హైపర్ స్కేల్ డేటా సెంటర్ల ప్లాట్‌ఫామ్‌ను నిర్వహిస్తోంది.

## సిజెపి నిరసన పిటిషన్‌పై

# అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు నో




**న్యూఢిల్లీ :** పరీక్షలకు సంబంధించిన లోపాలపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, శనివారం (జూన్ 6న) ఇక్కడి జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనకు పిలుపును ఇచ్చిన డిజిటల్ సంస్థ 'బొద్దింక జనతా పార్టీ' కారణంగా తలెత్తిన శాంతిభద్రతల ఆందోళనలను ప్రస్తావిస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి శుక్రవారం ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. 'సేవ్ ఇండియా ఫౌండేషన్' తరపు న్యాయవాది న్యాయమూర్తులు జస్టిస్ సౌరభ్ బెనర్జీ, జస్టిస్ అమిత్ శర్మలతో కూడిన వెకేషన్ బెంచ్ ముందు అత్యవసర విచారణకు అభ్యర్థించారు. అయితే, ఈ కేసును విచారణకు స్వీకరించడానికి బెంచ్ నిరాకరించింది. ఈ నెల ప్రారంభంలో, బొద్దింక జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశ రాజధాని ఢిల్లీలో తాను చేపట్టనున్న నిరసనలలో చేరాలని మద్దతుదారులు, నిరసనకారులకు పిలుపునిచ్చారు. జూన్ 6న విమానాశ్రయం వద్ద తనతో భాగస్వాములు కావాలని అభిజీత్ దీప్కే తన మద్దతుదారులను కోరారు. యువత నడుపుతున్న సోషల్ మీడియా ఉద్యమమైన బొద్దింక జనతా పార్టీ ఏర్పడినప్పటి నుంచి బాగా ప్రాచుర్యం పొందింది. దీనికి చాలా మంది ప్రముఖులు చందాదారులుగా ఉన్నారు. పిటిషనర్ తన విజ్ఞప్తిలో ఇందిరాగాంధీ అంతర్జాతీయ (ఐజిఐ) విమానాశ్రయం, మెట్రో స్టేషన్లు, హైవే ప్రవేశ ద్వారాల వద్ద తక్షణ నివారణ, నియంత్రణ, జన సమూహ నియంత్రణ చర్యలను అమలు చేయాలని కోరారు. అంతర్జాతీయ, సంస్థాగత అస్థిరత ఎజెండాను అమలుచేయడానికి విదేశాలకు అనుసంధానించబడిన సర్వర్‌లను ఉపయోగించుకోవడం ద్వారా బొద్దింక జనతా పార్టీ యువతను 'నియంత్రణలేని దళం'గా మార్చిందని 'పిల్' ఆరోపించింది. జూన్ 6నాటి సమీకరణను ప్రత్యామ్నాయంగా నిర్దేశించిన ప్రదేశానికి తరలించాలని, లేదా 'ప్రేరేపకులు' అని పిలువబడే వారిని గుర్తించేందుకు, ఆ కార్యక్రమాలను సమగ్రంగా వీడియో తీస్తూ కఠినంగా నియంత్రించాలని డిమాండ్ చేసింది. అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు సహా 'ఓవర్‌సీస్ అధికార పరిధుల' నుంచి విమానాశ్రయ భద్రత, అవసరమైన అత్యవసర యంత్రాంగాలకు భంగం కలగకుండా నిరోధించబడింది.

# నోయిడా అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం

**నోయిడా:** నోయిడాలోని ఓ గగనతల నివాస సముదాయం (హైరైజ్ అపార్ట్‌మెంట్)లో శుక్రవారం ఉదయం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. సెక్టార్ 75లోని 'ఐవీ కౌంటీ' సొసైటీకి చెందిన 28 అంతస్తుల భవనంలోని 12వ అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఓ ఫ్లాట్‌లో చిక్కుకుపోయిన ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు, వారి పిల్లలను అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా రక్షించారు. అనంతరం భవనంలోని నివాసితులందరినీ సురక్షితంగా ఖాళీ చేయించారు. ఎయిర్ కండిషనర్ (ఎసి)లో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని గౌతమ్ బుద్ధ నగర్ చీఫ్ ఫైర్ ఆఫీసర్ (సిఎఫ్ఒ) ప్రదీప్ కుమార్ ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తక్షణమే స్పందించారు.

# పోర్చుగల్ కార్మికుల సమ్మె

## సంస్కరణల ఉపసంహరణకు డిమాండ్

**లిస్బన్:** పోర్చుగల్ కార్మికులు సమ్మెబాట పట్టారు. కార్మిక సంస్కరణల బిల్లుకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి భారీ స్థాయిలో నిరసన తెలిపారు. ప్రధాని లూయిస్ ప్రతిపాదించిన ఈ బిల్లు ఉపసంహరణకు డిమాండ్ చేశారు. దేశ రాజధాని లిస్బన్‌లో వేలాది మంది కదం తొక్కారు. కార్మికుల హక్కులను హరించని వ్వబోమని నినాదాలిచ్చారు. ఈ బిల్లు వెనక్కి తీసుకోక పోతే ఆందోళన ఉధృతమవుతుందని లూయిస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్మికులు శాంతియుతంగా చేపట్టిన నిరసన ప్రదర్శన పోలీసుల జోక్యంతో హింసాత్మకంగా మారింది. నిరసనకారుల్ని చెదరగొట్టేందుకు భద్రతా సిబ్బంది లాఠీఛార్జీ చేశారు. కొంద రిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, పని గంటల పెంపు, ఉద్యోగుల తొలగింపు నిబంధనల్ని సులభతరం చేయడమే కాకుండా మాతత్వ, పితత్వ రక్షణ హక్కుల్ని దెబ్బతీసేలా కార్మిక సంస్కరణల బిల్లు ఉండటాన్ని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మిక సంఘాలను బల హీనపరచడం, సమ్మె హక్కును నిర్మూలించడనికే ఈ సంస్కరణలని మండిపడ్డారు. కార్మికులకు రక్షణ కల్పించే 100కు పైగా నిబంధనల్ని తొలగిస్తున్నట్లు ఆరోపించారు. ఇది అమల్లోకి వస్తే కార్మికులకు పని గంటల్ని పెరుగుతాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేశాయి. కార్మికుల శ్రమను దోచుకొని, కార్పొరేట్లు లాభాలు గడిస్తారని విమర్శించారు. కార్మిక వ్యతిరేక బిల్లు చట్టం రూపం దాల్చకుండా అడ్డుకుంటామని, ప్రభుత్వం తమ సమ్మెకు స్పందించకపోతే... ఉద్యమం చేపడతామని నాయకులు హెచ్చరించారు.



# అమెరికా నౌకపై ఇరాన్ దాడి



**తెహ్రాన్/మస్కట్:** తమ దేశ జలాల్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుండగా అమెరికా నౌకపై దాడి చేసినట్లు ఇరాన్ తెలిపింది. దీనిని అమెరికా సెంట్రల్ కమాండ్ ఖండించింది. ఒమన్ సముద్ర జలాల్లోని అమెరికా సైనిక ఆస్తులు సురక్షితంగా ఉన్నాయని, ఏ నౌకపై ఎలాంటి దాడి జరగలేదని వెల్లడించింది. మరోవైపు కువైట్ విమానాశ్రయంపై ఇరాన్ దాడులతో టెర్మినల్‌కు నష్టం వాటిల్లినట్లు వచ్చిన వార్తలను ఇరాన్ ఖండించింది. అమెరికా పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థలో సాంకేతిక లోపం వల్ల ఈ ఘటన జరిగిందని తెలిపింది. ఇందుకు బాధ్యత తమది కాదని ఐఆర్‌జీసీ పేర్కొంది. అయితే అమెరికా సైన్యం ఇరాన్ వాదనను త తోసిపుచ్చింది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా డ్రోన్లతో దాడి చేసిందని ఆరోపించింది. తప్పును కప్పిపుచ్చుకునేందుకు తమపై నిందలు వేస్తోందని విమర్శించింది.

**ఒమన్ ఆయిల్ టర్మినల్‌లో పేలుడు**

ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో తమ దేశంలోని అతిపెద్ద ఆయిల్ టెర్మినల్ మినా అల్ ఫహల్‌లో భారీ విస్ఫోటనం సంభవించినట్లు ఒమన్ ప్రకటించింది. ఆయిల్ టెర్మినల్‌లో పేలుడు కారణంగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయని అధికారులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినట్లు చెప్పారు. టర్మినల్‌లో కార్యకలాపాలు స్తంభించాయన్నారు. ఈ ఘటనతో చమురు సూపర్ ట్యాంకర్లు అక్కడే చిక్కుకుపోగా లోడింగ్ నిలిచిపోయిందని అధికారులు వెల్లడించారు. అయితే కొంత సమయం తర్వాత కార్యకలాపాలు క్రమంగా పునరుద్ధరించినట్లు తెలిపారు.

# యురేనియం నిల్వలు ప్రామాణికం కాదు

## ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై ట్రంప్



**వాషింగ్టన్:** యురేనియం నిల్వలే ప్రామాణికంగా ఇరాన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం తమకు లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌లోని శుద్ధి చేసిన యురేనియం అంశం భూస్థాపితమన్నారు. తాము ఎప్పుడు కావలంటే అప్పుడు ఆ నిల్వలను స్వాధీనం చేసుకోగలమని చెప్పారు. ట్రంప్ ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'యురేనియం నిల్వపై ఆధారపడి శాంతి ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం లేదు. మేము కావాలంటే ఇప్పుడే స్వాధీనం చేసుకోవచ్చు. వాళ్లు మమ్మల్ని ఆపలేరు. ఈ అంశం భూస్థాపితమే' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఇరాన్ అధినేత ముజ్తాబా ఖామేనీని కలుసుకోవాలన్న కోరిక లేనప్పటికీ అందుకు అవకాశం లభిస్తే గౌరవంగా భావిస్తానని అన్నారు. 'ఒప్పందం కుదురుతుందా లేదా అన్నది చూద్దాం. ఒకవేళ కుదిరితే ముజ్తాబాను కలుస్తాను' అని చెప్పారు. అమెరికాఇజ్రాయిల్ దళాలు ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుంటున్నప్పటికీ ముజ్తాబా వృత్తిధర్మానికి కట్టుబడి ప్రవర్తిస్తారని ఆశిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. 'మేము ఆయన తండ్రి, భార్య, తనయుడిని హతమార్చాం కాబట్టి నేనంటే కచ్చితంగా కోపం ఉంటుంది. అయితే కొన్ని వర్గాల్లో ఆయనకు మంచి పేరున్నది. ఇది వాస్తవం' అని అన్నారు.


# క్యూబా అధ్యక్షుడిపై అమెరికా ఆంక్షలు

**వాషింగ్టన్:** క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కానెల్‌పై అమెరికా కొత్తగా ఆంక్షలు విధించింది. మరో నలుగురు వ్యక్తులు, ఐదు సంస్థలపైనా ఆంక్షలు ప్రకటించింది. ఈ మేరకు యూఎస్ ట్రజరీ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ పేర్కొంది. ఆంక్షలు విధించిన సంస్థల్లో క్యూబా విప్లవ సాయుధ దళాల మంత్రిత్వశాఖ ఉండటం గమనార్హం. క్యూబా విప్లవ వీరుడు ఫీడెల్ కాస్ట్రో సోదరుడు రాల్ కాస్ట్రో నుంచి క్యూబా పగ్గాలను 2018లో మిగుల్ డియాజ్ కానెల్ చేపట్టారు. అప్పటి నుంచి ఆయనే అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ద్వీపదేశ కమ్యూనిస్టు నాయకులపై ఒత్తిడిని మరింత పెంచేందుకు వాషింగ్టన్ తాజా చర్యలు చేపట్టింది. క్యూబా మంచి నిర్వహణలోని దేశంగా ఉండాలని అమెరికా కోరుకుంటున్నట్లు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించిన తర్వాత ఈ ఆంక్షల ప్రకటన వెలువడింది. క్యూబా కమ్యూనికేషన్స్ మంత్రి, సైన్యాధికారులు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీఅధికారులు సహా 11 మందిపై అమెరికా గత నెలలో ఆంక్షలు విధించింది. 1999 నాటి యుద్ధ విమానాల కూల్చివేత వ్యవహారంలో రాల్ కాస్ట్రోను హంతకుడిగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నది.

**అమెరికా వికృత చర్యలు: మిగుల్**

తనపై అమెరికా ఆంక్షలు విధించడాన్ని మిగుల్ డియాజ్ కెనాల్ ఖండించారు. అమెరికా దూకుడు ప్రదర్శిస్తూ, వికృతమైన చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కాస్ట్రో కుటుంబ సభ్యులు, తన సన్నిహితులపైనా ఆంక్షల విధించడాన్ని ఆక్షేపించారు. సామ్రాజ్యవాద దురంహకారాన్ని ప్రతిఘటిస్తామని ఆయన ఎక్స్ మాధ్యమంగా ప్రకటించారు. అమెరికా, క్యూబా మధ్య ఘర్షణదిగ్బంధాలకు ఈ ఆంక్షలు మరింత బలం చేకూర్చేలా ఉన్నట్లు మిగుల్ డియాజ్ కెనాల్ వ్యాఖ్యానించారు.









# టిజిపిజి ఇసెట్ ఫలితాల వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2026 (టిజిపిజి ఇసెట్ 2026) ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎంఇ తదితర కోర్సుల్లో అడ్మిషన్లకు ఈ ప్రవేశ పరీక్షను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో జెఎన్‌టియుహెచ్ నిర్వహించింది. మే 29 నుంచి ఈనెల 1వ తేదీ వరకు వివిధ దశల్లో ప్రవేశ పరీక్షలను నిర్వహించారు. మార్కులు, ర్యాంక్ కార్డు కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టిజిపిఇసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్ తెలిపారు.

# 'డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్' పోస్టులకు నోటిఫికేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యాశాఖలో 24 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి టిజిపిఎస్‌సి శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కాగా 18 ఏళ్ల నుంచి 44 ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 19 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. మరిన్ని వివరాలకు నోటిఫికేషన్‌ను చూడాలని సూచించింది.

# ఈనెల 8వరకు 'డిఇఇ సెట్' వెబ్ ఆప్షన్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'డిఇఇ సెట్ 2026' వెబ్ ఆప్షన్ల నిమ్మితం శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 8వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు 'డిఇఇ సెట్ 2026' కన్వీనర్ జి.రమేశ్ తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గడువును 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు పొడిగించారు. ఈ నెల 14 నుంచి 17 వరకు కాలేజ్ అలాట్ మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, 17వ తేదీలోపు సంబంధిత కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

# జెండా ఎగరనివ్వం

**(మొదటి పేజీ తరువాయి)**

రావణకాష్ఠంలా రగులుతోందన్నారు. పక్కరాష్ట్రంతో చర్చలు జరిపి డిసెంబర్‌లోగా పాలమూరు జలాలపై అనుమతులు సాధిస్తామన్నారు. ఎపిపై ఒత్తిడి తెచ్చి లేదా కొట్లాడి ఎన్‌ఒసి తీసుకొస్తామన్నారు. పాలమూరు–రంగారెడ్డికి 90 టిఎంసిల నీళ్లకు అనుమతులు సాధిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిండి ప్రాజెక్టుకు 20 టిఎంసిల నీళ్లకు అనుమతులు సాధించే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఉద్దండాపూర్ వరకు ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని వివరించారు. రెండున్నరేళ్లలో జూరాల వద్ద కొత్త రిజర్వాయర్‌ను నిర్మిస్తామని చెప్పారు. కర్ణాటక, మక్తల్ సరిహద్దుల్లో బ్రిడ్జి కమ్ బ్యారేజ్‌ను కడుతామన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులను ఇస్తామని తెలిపారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తామని వివరించారు. పాలమూరు జిల్లాను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కారు అని ప్రజలతో కలిసి సిఎం నినదించారు.

**కుటుంబ సభ్యులే రాజ్యాలు ఏలుతారట**

'కెసిఆర్, ఆయన కుమారుడు, మనవడు రాజ్యాలు ఏలుతారట. వృత్తి పనులు చేసుకునేవారు ఏళ్ల తరబడి అలాగే ఉండాలట. 20 ఏళ్ల క్రితం మీ జిల్లాలో నాటిన మొక్క తెలంగాణ సిఎంగా వృక్షమై నిలబడ్డాడు. నాటి మాదిరిగానే పాలమూరులో ఇప్పుడూ 10 లక్షల ఎకరాలకే నీళ్లు అందుతున్నాయి. గతంలో పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులను పట్టించుకోలేదు. రూ.22 వేల కోట్లలో రూ.8 వేల కోట్లు పాలమూరు ప్రాజెక్టులకు ఖర్చు చేశాం. 200 ఎకరాల్లో ఎడ్యుకేషన్ క్యాంపస్ ఏర్పాటు చేసుకుంటున్నాం. రెండు పడక గదుల ఇళ్లు కట్టినచోటే మీరు ఓట్లు అడగాలి. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోటే నేను ఓట్లు అడుగుతా. మీకు డిపాజిట్ వస్తే నా పేరు మార్చుకుంటా' అని రేవంత్ రెడ్డి శపథం చేశారు. కరీంనగర్‌లో ఓడిపోతానేమో నని ఒక నేత పాలమూరుకు వచ్చారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కెసిఆర్‌ను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నామని, పాలమూరు నుంచి పార్లమెంటు సభ్యుడిగా కెసిఆర్‌ను గెలిపించుకున్నామని గుర్తు చేశారు. ఐదేళ్లు పార్లమెంటు సభ్యుడిగా ఉన్నా ఐదుసార్లు కూడా పాలమూరుకు రాలేదని ఆరోపించారు. మేక వన్నిన పులి అని తెలియక కెసిఆర్‌ను ప్రజలు రెండుసార్లు గెలిపించారని, బిఆర్‌ఎస్ నేతలు పాదయాత్రలు కాదు, పొర్లుదండాలు పెట్టినా పాపాలు తీరవన్నారు. మీరు చేసిన పాపాలను ఎన్నటికీ ప్రజలు మరువరని రేవంత్ రెడ్డి అన్నారు. సమస్యల పరిష్కారంపై రైతులకు ఎప్పుడైనా భరోసా ఇచ్చారా అని ప్రశ్నించారు.

**పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం :**

సాగు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేసి, పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ తయారీకి చర్యలు చేపట్టినట్లుగా సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం నార్లాపూర్ హెడ్ రెగ్యులేటర్ పరిశీలించారు. హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రాజెక్టుకు సంబంధించిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత తొందరగా ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పాలమూరు రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేదని రేవంత్ రెడ్డి వివరించారు. ఆ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు పెట్టి పంపులు, లిఫ్టు పనులు చేపడితే కెసిఆర్ ఇంట్లో కనక వర్షం కురిసిందన్నారు. కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదన్నారు. జూరాల ప్రాజెక్టు మినహా జిల్లాలో అన్ని ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ కూడా జరగలేదని తెలిపారు. పంపులు, లిఫ్టు పనుల్లో అవినీతిపై నాగం జనార్దన్ రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారని తెలిపారు. పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిధుల కోసం పక్కా కార్యాచరణతో క్షేత్రస్థాయి పర్యటన చేస్తామన్నారు. భూసేకరణకు సంబంధించి రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. జిల్లా ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. తక్కువ భూసేకరణ ఉండి ఎక్కువ నీళ్లు నిల్వచేసుకునే ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేస్తామన్నారు ప్రాజెక్టులను కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. తాము పనులు చేపడుతుంటే వాళ్లు( బిఆర్‌ఎస్) రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారని వివరించారు. పాపాలు చేయడమే కాకుండా కెసిఆర్ చేస్తుంటే చూడటం కూడా మహాపాపమని ఆక్షేపించారు. సాగునీటి ప్రాజెక్టులకు చేసిన అప్పులకు రూ.84 వేల కోట్లు చెల్లించారన్నారు. గత పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు చేసిన అప్పులకు రూ.52 వేల కోట్లు చెల్లించామన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు తాము అధికారంలోకి వచ్చాక రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. వాటిలో రూ.8 వేల కోట్లు పాలమూరు ప్రాజెక్టుకు ఇచ్చామని అన్నారు.

# అసెంబ్లీని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ, హిరోషిమాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా జపాన్ (హిరోషిమా) ప్రతినిధుల బృం దం హైదరాబాద్‌లో పర్యటించింది. తెలంగాణ హిరోషిమా ప్రాంతాల మధ్య పరస్పర సహకారం, వాణిజ్య, వ్యాపార, ఉపాధి అవకాశాల కల్పనపై చర్చించారు. తెలంగాణ హిరోషిమా ప్రభుత్వాల మధ్య అక్టోబర్‌లో జరగనున్న కీలక సమావేశానికి సంబంధించి చర్చించారు. అందులో భాగంగా జపాన్ ప్రభుత్వ ప్రతినిధుల బృందం శుక్రవారం ఉదయం తెలంగాణ అసెంబ్లీని సందర్శించింది. శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, శాసనమండలి విప్‌లు డాక్టర్ బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్, శాసనసభ విప్ రామ్మోహన్ రెడ్డి, ఎంఎల్‌సిలు అంజిరెడ్డి, దాసోజు శ్రవణ్, ఎంఎల్‌ఎ హరీశ్‌బాబు, అసెంబ్లీ అధికారులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చారిత్రక కట్టడమైన అసెంబ్లీని సందర్శించారు. భవన నిర్మాణ తీరును, శాసనమండలి చైర్మన్ వారికి వివరించారు. తర్వాత అసెంబ్లీ హాల్‌లో ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలతో జపాన్ ప్రతినిధులు భేటి అయ్యారు.

# చెట్లు నరుకుతారా?

**(మొదటి పేజీ తరువాయి)**

పగడపు దిబ్బలను పటాల నుండి తుడిచివేసి, గిరిజన వర్గాలను వారి భూముల నుండి తరిమివేసి, మనం పీల్చే గాలి విషంగా మారిన భారతదేశాన్నా? లేక భారతదేశ సహజ వారసత్వం పరిరక్షించబడి, మన గిరిజన వర్గాలు సురక్షితంగా ఉండి, అభివృద్ధి ప్రకృతికి వ్యతిరేకంగా కాకుండా దానితో కలిసి సాగే భారతదేశాన్నా?' అని గాంధీ ఎక్స్ ఛానెల్‌లో ప్రశ్నించారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం గ్రేట్ నికోబార్ దీవిని నాశనం చేస్తోందని ఆయన ఆరోపించారు. 'నేను భారతదేశపు దక్షిణపు చివరి కొనను సందర్శించాను. ఇందిరా పాయింట్ వద్ద నిలబడ్డాను. శతాబ్దాలుగా నిలబడి ఉన్న చెట్ల కింద నడిచాను. భూమిపై అత్యంత ప్రకాశవంతమైన పగడపు దిబ్బలలోకి నేను డైవ్ చేశాను. అక్కడ నివసించే ప్రజలతో కూర్చున్నాను. అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి భూములను లాక్కుంటున్న గిరిజన వర్గాలు. భారత ప్రభుత్వం ఈ ద్వీపాలలో స్థిరపరిచిన వలసదారులు, వీరిలో చాలామంది మాజీ సైనికులు, వీరికి సరైన పరిహారం అందడం లేదు. గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్ రక్షణకు సంబంధించినదని మోదీ ప్రభుత్వం, బిజెపి మీకు చెబుతున్నాయి. అది అబద్ధం' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ఐఎన్‌ఎస్ బాజ్‌ను విస్తరించండి , తాము ప్రభుత్వానికి పూర్తిగా మద్దతు ఇస్తామన్నారు. నౌకాదళం ఐదేళ్లుగా విస్తరణ కోసం అడుగుతున్నా దానిని పట్టించుకోలేదని రాహుల్‌గాంధీ విమర్శించారు. ప్రధాన భూభాగంలో ఉన్న కేరళలో భారతదేశం ఇప్పటికే అలాంటి పోర్ట్‌ను నిర్మిస్తోందని గాంధీ గుర్తు చేశారు. తాను పర్యావరణ సమతుల్య అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, ఈ ద్వీపాలు ప్రపంచం ఇంతవరకు చూడని అత్యంత అసాధారణమైన సుస్థిర గమ్యస్థానంగా మారగలవని గాంధీ నొక్కి చెప్పారు. అలాంటి భారతదేశం కోసమే పోరాడాలన్నారు. వేలాది చెట్లను నరికి, వాటిని అక్రమంగా తరలించి, బిలియన్ల కొద్దీ డాలర్లు సంపాదించడమే బిజెపి సర్కార్ ప్రణాళిక అని, ఆ డబ్బుతో హోటళ్లు, క్యాసినోలు, రియల్ ఎస్టేట్ నిర్మించుకుంటారు, జరుగుతున్నది ఇదే అని రాహు గాంధీ వీడియోలో అన్నారు.

# జలసమాధి

**(మొదటి పేజీ తరువాయి)**

గాలింపు చేపట్టి భానుప్రసాద్‌ను రక్షించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి.

**బ్రాహ్మణ కుంటలో పడి ముగ్గురు పిల్లల మృతి**

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండల కేంద్రంలోని లింబాద్రి గుట్ట ఒడ్డెర కాలనీకి సంబంధించిన ముగ్గురు పిల్లలు ద్యారంగుల అరవింద్ తండ్రి సురేష్ (4), కంది వర్షిని తండ్రి మహేష్ (5), కంది హరీష్ తండ్రి మహేష్ (10)లు శుక్రవారం ఉదయం నుండి ఆడుకుంటూ పక్కనే ఉన్న బ్రాహ్మణ కుంట వద్ద స్నానానికి దిగి ఈత రాకపోవటంతో దానిలో మునిగి చనిపోయారని సిఐ తెలిపారు. అరవింద్ తండ్రి సురేష్ పిల్లలు కనపడటం లేదని సమాచారం ఇవ్వగా వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లను తీసుకుని వెళ్లి వెతకగా ముగ్గురి మృతదేహాలను వెలికి తీశామని తెలిపారు.

# ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**

ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ఉన్న మొక్కజొన్నలు, ధాన్యాన్ని కాంటాలు వేసి తరలించాలని రైతులు కోరుతున్నారు.

**కల్తీని అరికట్టేదెలా....?**

గడిచిన మూడేళ్లుగా కల్తీ విత్తనాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. కల్తీ విత్తనదారులపై కఠినంగానే వ్యవహరిస్తున్నప్పటికీ కల్తీ విత్తనాల విక్రయం మాత్రం ఆగడం లేదు. ప్రతి ఏడాది ఎక్కడో ఒక చోట కల్తీ విత్తనాల భారీన పడి రైతాంగం నష్టపోతూనే ఉంది. గతేడాది మిర్చి, ధాన్యం రైతులతో పాటు కొన్ని ప్రాంతాల్లో పత్తి రైతులు కూడా నష్టపోయారు. గ్రామాల్లో పత్తి విత్తనాల బుకింగ్ జరుగుతుంది. రైతాంగం ఈ విత్తన బుకింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. బిల్లులు లేకుండా ఏ రైతు కూడా విత్తనాలను కొనుగోలు చేయరాదని బిల్లు లేకుంటే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ధర తక్కువగా ఉందని ఆశపడితే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. కల్తీ విత్తనాల పట్ల రైతులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

**బీమా కోసం డిమాండ్ :**

పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. వరుస విపత్తులతో రైతులు నష్టపోతున్నారు. పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే నష్టపోయిన రైతుకు పరిహారం దక్కుతుంది. గ్రామం యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. అతి వృష్టి అనావృష్టి ఇతరత్రా కారణాలతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి పలుమార్లు నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచైనా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతన్నలు కోరుతున్నారు. దీనితో పాటు యాసంగికి సంబంధించి రైతు భరోసాను పూర్తి స్థాయిలో జమ చేయలేదు. వానా కాలానికి పెట్టుబడి అందించే విధంగా జూన్ మాసంలోనే రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

# ఇండియా కూటమి వైపే

**(మొదటి పేజీ తరువాయి)**

ఇతర పార్టీలు దేశ సంక్షేమానికి సంబంధించి ప్రస్తావించే అంశాలపై ఎప్పటిలాగే తన గళాన్ని వినిపిస్తూనే ఉంటుందని డిఎంకె ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి, ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేయడానికి ఒక ఉమ్మడి వ్యూహంపై చర్చిస్తారు. అయితే, ఈ సమావేశానికి హాజరు కావడంపై పార్టీ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సిపిఐ(ఎం) నాయకుడు మీడియాకు తెలియజేశారు. 'జాతీయ స్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు కలిసి పనిచేయడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో, కేరళలో బిజెపి, సిపిఐ(ఎం) మధ్య అవగాహన కుదిరిందన్న కాంగ్రెస్ ఆరోపణలను సిపిఐ(ఎం) తీవ్రంగా పరిగణిస్తోంది. ఇండియా కూటమిలోని పలు భాగస్వామ్య పక్షాల్లో అసంతృప్తి నెలకొని ఉంది. ఇదిలాఉండగా, ఇండియా కూటమి ముక్కలు చెక్కలైందని, అసలు ఆ కూటమే లేదని బిజెపి జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు. ఇండియా కూటమి మరణించిందని, కేవలం కాగితం మీదనే మిగిలిపోయిందని ఆరోపించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తరువాత 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు', నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలను 2029 ఎన్నికలకు ముందే చేపట్టాలని బిజెపి ఉవ్విళ్ళూరుతున్న తరుణంలో ఇండియా కూటమి జూన్ 8 సమావేశం కీలకం కానుంది. ఆప్ సైతం ఇండియా కూటమి సమావేశానికి హాజరు కానప్పటికీ, జాతీయ స్థాయిలో ప్రతిపక్ష పోరాటాలలో భాగమవుతూ వస్తోంది.

**ఇండియా కూటమిలో చీలక లేదు : రౌత్**

ఇండియా కూటమిలో ఎలాంటి చీలికా లేదని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. డిఎంకె దూరం పాటిస్తున్న తరుణంలో, కూటమికి టివికె రూపంలో ఒక ప్రత్యామ్నాయ మిత్రుడు లభించారని ఆయన పేర్కొన్నారు. 'ఇండియా కూటమిలో చీలిక ఉందని చెప్పడం తప్పు. తమిళనాడు ఎన్నికల తర్వాతే డిఎంకె దూరం పాటించడం మొదలుపెట్టింది. దానికి బదులుగా మాకు టివికె లభించింది. కూటమిలో చీలిక ఉందని అనొద్దు. ఇండియా కూటమికి ఒక ప్రత్యామ్నాయ మిత్రుడు దొరికారని చెప్పండి' అని శివసేన (యుబిటి) రాజ్యసభ సభ్యుడు అన్నారు. ఇండియా కూటమి సమావేశానికి పార్టీ తరపున ఎవరు హాజరవుతారనే విషయాన్ని ఉద్ధవ్ థాక్రే నిర్ణయిస్తారని రౌత్ తెలిపారు. ఇదిలా ఉండగా, కూటమి సమావేశానికి తమ పార్టీ హాజరవుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా శుక్రవారం తెలిపారు. 'ఈ సమావేశం జరగబోతోంది. ఒమర్ (అబ్దుల్లా) లేదా నేను మాలో ఒకరు తప్పక వెళ్తాము. సహజంగానే మేము అందులో భాగం కాబట్టి, మేము హాజరవుతాము' అని శ్రీనగర్‌లోని హజ్రత్‌బాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ అబ్దుల్లా అన్నారు. ఆర్టికల్ 370ని 'పాతిపెట్టేశార'ని ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఒపి) సునీల్ శర్మ చేసిన వ్యాఖ్యపై స్పందిస్తూ, ప్రత్యేక హోదా అంశాన్ని తమ పార్టీ శాశ్వతంగా సజీవంగా ఉంచుతుందని ఆయన చెప్పారు. రాష్ట్ర హోదా, ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరసన చేపట్టనున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ బుధవారం ప్రకటించింది.

**కరుణానిధికి ఖర్గే, రాహుల్ నివాళి**

మూడు రోజుల క్రితం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి జయంతి సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాళులర్పించారు. కరుణానిధి సామాజిక న్యాయం, సమానత్వం కోసం పాటుపడిన పోరాట యోధుడు అని కొనియాడారు. ఇటీవల ఇండియా కూటమి నుంచి డిఎంకె దూరం జరిగినన నేపథ్యంలో కాంగ్రెస్ నేతల చర్య ఇరు పార్టీల మధ్య సహృద్భావానికి చొరవగా భావిస్తున్నారు.

# మంటల్లో బతుకులు

**(మొదటి పేజీ తరువాయి)**

తానే తీసుకుని పలువురి ఇంట్లో పనిచేస్తూ బ్రతుకుని వెళ్లతీస్తున్న ఆ కుటుంబంలో అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి సిలెండర్ పేలడంతో ముగ్గురు సజీవదహనం అయిన హృదయ విషాదకరమైన సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం అర్ధరాత్రి జరిగింది. మిర్యాలగూడ పట్టణం కలల్వాడాకు చెందిన నక్క ధనలక్ష్మి తన తల్లి అయిన వనం చంద్రమ్మ (55) ఇంటిలో తన ఇద్దరి పిల్లలు అయిన నక్క ప్రణిత(14), లక్ష్మణ్ (17) గత కొంతకాలంగా ఉంటున్నారు. చంద్రకళ కూలీ పనులకు వెళ్తుండగా ధనలక్ష్మి పిల్లలను చదివించడం కోసం ఒక ఏజెన్సీ ద్వారా పూనెలో ఓ ఇంట్లో పనిచేయడానికి 3 రోజుల క్రితం పూనెకు వెళ్ళింది. ఈ క్రమంలో అమ్మమ్మ చంద్రమ్మతో కలిసి మనవడు లక్ష్మణ్, మనవరాలు అయిన ప్రణిత ముగ్గురూ ఇంట్లో నిద్రిస్తుండగా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుపక్కల వారు భారీగా మంటలు, పొగ వస్తుండటంతో బయటకు వచ్చి చూడగా చంద్ర మ్మ ఇంట్లో మంటలు చెలరేగుతుండగా ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ సిలెండర్ పేలి భారీగా మంటలు వ్యాపించాయి.





దాంతో మంటల్లో చిక్కుకున్న వారిని బయటికి తీసుకురావడం కష్టం కావడంతో మంటల్లోనే ముగ్గురు అగ్నికి సజీవ దహనం అయ్యారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. కాగా ప్రణీత ప్రస్తుతం 10వ తరగతి చదువుతుండగా, లక్ష్మణ్ చదువుని మధ్యలోనే ఆపి అమ్మమ్మ తల్లికి సహాయం చేసేందుకు పనికి వెళ్తుండే వాడు. డిఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో వన్టౌన్ సీఐ నాగభూషణ్‌రావు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. అనంతరం ముగ్గురి మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా పూనెలో ఉన్న తల్లి మిర్యాలగూడకు తిరుగు ప్రయాయాణం అయ్యింది. కాగా చంద్రమ్మ భర్త నెల మాసికం ఈ నెల 7న ఉండగానే ఆ ఇంట్లో దారుణం చోటు చేసుకోవడం పట్ల పలువురు కంటతడి పెట్టారు.

# వరల్డ్ కప్ గెలిపించిన కెప్టెన్‌కు షాక్..!



ఐపిఎల్ 2026 సీజన్ ముగిసిన అనంతరం భారత క్రికెట్ అభిమానులు అంతర్జాతీయ సిరీస్‌ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సమయంలో టీమిండియా టి–20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు సంబంధించిన ఓ వార్త క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వరుస విజయాలతో భారత జట్టును అగ్రస్థానంలో నిలబెట్టిన సూర్యను టి–20 కెప్టెన్సీ నుంచి తప్పించే దిశగా బిసిసిఐ ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రోహిత్ శర్మ అంతర్జాతీయ టి–20లకు వీడ్కోలు పలికిన తర్వాత సూర్యకుమార్ యాదవ్ టి–20 జట్టు పగ్గాలు చేపట్టాడు. అతని నాయకత్వంలో భారత్ వరుసగా ఎనిమిది ద్వైపాక్షిక సిరీస్‌లను కైవసం చేసుకుంది. అంతేకాదు 2025 ఆసియా కప్‌తో పాటు 2026 టి–20 వరల్డ్ కప్‌ను కూడా గెలుచుకుని ప్రపంచ క్రికెట్‌లో తన నాయకత్వ ప్రతిభను చాటుకున్నాడు. వరుసగా రెండు ఐసిసి ట్రోఫీలను అందించిన కెప్టెన్‌ను కేవలం కొద్ది నెలల వ్యవధిలోనే మార్చాలనే ఆలోచన అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఐసిసి ట్రోఫీ గెలిచిన తర్వాత కూడా కెప్టెన్సీ కోల్పోయిన భారత కెప్టెన్ల జాబితాలో రోహిత్‌శర్మ పేరు ముందుంటుంది. విరాట్ కోహ్లీ తర్వాత 2021లో వన్డే జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన రోహిత్, భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. అతని నాయకత్వంలో భారత్ ఆసియా కప్‌ను గెలవడమే కాకుండా 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరింది. అనంతరం ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీని కూడా కైవసం చేసుకుని జట్టును మరో సారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిపాడు. వన్డే కెప్టెన్‌గా రోహిత్ అద్భుతమైన విజయశాతం నమోదు చేసినప్పటికీ, భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో పెట్టుకుని సెలక్టర్లు నాయకత్వ బాధ్యతలను యువ ఆటగాడు శుభమన్ గిల్‌కు అప్పగించారు. 2027 వరల్డ్‌కప్ లక్ష్యంగా పెట్టుకుని తీసుకున్న నిర్ణయమిదేనని అప్పట్లో సెలక్షన్ కమిటీ స్పష్టం చేసింది. ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్ విషయంలోనూ సెలక్టర్లు ఇదే తరహా ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జట్టు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ నాయకత్వాన్ని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో బిసిసిఐ ముందడుగు వేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఐపిఎల్‌లో అద్భుత కెప్టెన్సీ నైపుణ్యాన్ని ప్రదర్శించిన శ్రేయస్ అయ్యర్ ను టి–20 జట్టు నాయకుడిగా ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని వార్తలు వినిపిస్తున్నాయి. పంజాబ్ కింగ్స్‌కు విజయాలను అందించి తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకున్న శ్రేయస్ అయ్యర్ ఇప్పుడు టిమిండియా టి–20 కెప్టెన్సీ రేసులో ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై బిసిసిఐ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రోహిత్ శర్మ తర్వాత ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్ విషయంలోనూ అదే ఫార్ములా అమలు చేస్తే, టీమిండియా భవిష్యత్తుపై దాని ప్రభావం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

## గుకేశ్‌ను ఓడించిన ప్రజ్ఞానంద

నార్వే చెస్ టోర్నీలో భారతీయ ప్లేయర్ ఆర్.ప్రజ్ఞానంద దూసుకెళ్తున్నాడు. ఆ టోర్నీలో ప్రస్తుతం అతను రెండో స్థానంలో నిలిచాడు. అయితే వరల్ ఛాంపియన్, మరో భారత ఆటగాడు డి.గుకేశ్‌పై అద్భుతమైన విజయాన్ని ప్రజ్ఞానంద నమోదు చేశాడు. కీలకమైన మ్యాచ్‌లో కేవలం 34 ఎత్తుల్లోనే గుకేశ్‌ను మట్టికరిపించాడు.



రెండు రోజుల క్రితమే గుకేశ్ తన 20వ పుట్టిన రోజు జరుపుకున్నాడు. అయితే ఈ విక్టరీ ప్రజ్ఞానందకు ప్రతీకార విజయం అవుతుంది. ఈ టోర్నీలోనే నాలుగవ రౌండ్‌ల్లో గుకేశ్ చేతిలో ప్రజ్ఞానంద ఓడిపోయారు. గుకేశ్‌పై గెలుపుతో టైటిల్ రేసుకు ప్రజ్ఞానంద చేరువయ్యారు. వరుసగా మూడు విక్టరీలతో మళ్లీ ఊపందుకున్నాడు. మూడు రోజుల క్రితం వెనుకబడ్డ నేను ఇప్పుడు టైటిల్ రేసులో ఉన్నట్లు ప్రజ్ఞానంద తెలిపారు. గత ఏడాది నార్వే చెస్ టోర్నీలో గుకేశ్, కార్ల్సన్ మధ్య తీవ్ర పోటీ ఉండే. అయితే ఈ ఏడాది కార్ల్సన్ పెద్దగా పర్ఫార్మ్ చేయలేకపోయాడు. గుకేశ్‌కు 8 పాయింట్లు ఉన్నాయి. పాయింట్ల పట్టికలో వెస్లే అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 15.5 పాయింట్లతో దూసుకెళ్తున్నాడు. ప్రజ్ఞానంద 15 పాయింట్లతో టైట్ ఫైట్ ఇస్తున్నాడు. ఇక మూడవ స్థానంలో 14.5 పాయింట్లతో అలిరెజా ఫిరౌజా ఉన్నారు.

## ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధిస్తా

### భారత స్టార్ షూటర్ ఇషా సింగ్



ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో పసిడి పతకం నెగ్గడమే తన అంతిమ లక్ష్యమని, 2028 లాస్ ఏంజెల్స్ గేమ్స్ స్వర్ణమే టార్గెట్గా దూసుకెళ్తున్నానని భారత స్టార్ షూటర్, హైదరాబాదీ ఇషా సింగ్ అంటోంది. గతవారం జర్మనీలోన మ్యూనిచ్లో జరిగిన వరల్ కప్లో ప్రపంచ రికార్డు స్వర్ణంతో పాటు రజత పతకాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ, గత పారిస్ ఒలింపిక్స్లో ఎదురైన నిరాశే తనలో కసిని పెంచిందని తెలిపింది. మేటి షూటర్లు బరిలో నిలిచిన వరల్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్లో రికార్డు వస్తుందని అస్సలు ఊహించలేదని చెప్పింది. మా ఆటలో మానసిక దృఢత్వం చాలా ముఖ్యం, టెక్నికల్ విషయాలు తక్కువే. ఒకే స్కిల్ను పదే పదే ప్రాక్టీస్ చేసి అందులో మాస్టర్ కావడమే నా సీక్రెట్. నెగెటివ్ ఆలోచనలు రాకుండా సెల్ఫ్ అస్యూరెన్స్ ఇచ్చుకుంటూ, క్యాంపుల్లో హైప్రెజర్ మ్యాచ్లు ప్రాక్టీస్ చేయడం వల్లే మానసిక బలం పెరిగింది. నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో మా అమ్మానాన్నలే నా అతిపెద్ద సపోర్ట్ సిస్టమ్. ఆ తర్వాత నా ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అండగా నిలిచారు. ఇప్పుడు నా తర్వాతి టార్గెట్ చైనా వరల్ కప్. ఆ తర్వాత ఆసియా గేమ్స్, ఆపై వరల్ ఛాంపియన్షిప్ ఉన్నాయి. వరల్ ఛాంపియన్షిప్లో కోటా సాధించి, నేరుగా ఒలింపిక్స్కు అర్హత సాధించడమే నా ముందున్న ప్రణాళిక. 2028 ఒలింపిక్స్లో నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి దేశానికి గోల్ మెడల్ తీసుకురావాలన్నదే నా అంతిమ లక్ష్యం.

# సైన్స్



## మూలసూత్రం ఒకటే


మనుషులు వేల సంవత్సరాలుగా సమయాన్ని అర్థం చేసుకోవడానికి మరియు కొలవడానికి గడియారాలను ఉపయోగిస్తున్నారు. మొదట్లో సూర్యుడి కదలిక, నీటి గడియారాలు, తరువాత యాంత్రిక గడియారాలు ఇలా సమయాన్ని కొలిచే పద్ధతులు క్రమంగా అభివృద్ధి చెందాయి. ఆధునిక యుగంలో మణికట్టు గడియారాలు, డిజిటల్ గడియారాలు, అత్యంత ఖచ్చితమైన అణు గడియారాలు ఉపయోగంలోకి వచ్చాయి. ముఖ్యంగా 'అటామిక్ క్లాక్' అనే పరికరం ఇప్పటివరకు మనిషి రూపొందించిన అత్యంత ఖచ్చితమైన సమయ కొలమానంగా పేర్కొంటారు. అయినప్పటికీ ఇటీవల శాస్త్రవేత్తలు గడియారం అనే ప్రత్యేక పరికరం లేకుండానే సమయాన్ని గుర్తించగల ఒక కొత్త విధానాన్ని సూచించారు. ఇది భౌతిక శాస్త్రంలో సమయాన్ని అర్థం చేసుకునే విధానాన్ని కొంతమేర మార్చే అవకాశమున్న ఆలోచన. ఏదైనా ఒక వస్తువు లేదా వ్యవస్థ నిరంతరం పునరావృతమయ్యే కదలికలను కలిగి ఉంటుందనేది ఇప్పటివరకు ఉపయోగించిన అన్ని గడియారాల వెనుక గల ఒక సాధారణ సూత్రం. ఆ కదలికను లెక్కించడం ద్వారా సమయాన్ని నిర్ధారించుకుంటారు. యాంత్రిక గడియారాల్లో పెండ్యూలమ్ ఊగే వేగం ఆధారంగా సెకన్లు లెక్కిస్తారు. తరువాత వచ్చిన క్వార్ట్జ గడియారాల్లో క్రిస్టల్‌కు విద్యుత్ ప్రవాహం ఇచ్చినప్పుడు ఏర్పడే నిర్దిష్ట కంపనాలను లెక్కిస్తారు. అణు గడియారాల్లో అణువులలో జరిగే శక్తి మార్పులను ఉపయోగిస్తారు. ఉదాహరణకు సీసియం అణువులోని శక్తి స్థితుల మార్పులు చాలా స్థిరంగా ఉండటంతో అవి సమయ ప్రమాణంగా ఉపయోగపడతాయి. ప్రపంచంలోని ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థలు కూడా ఈ అణు గడియారాలపైనే ఆధారపడి పనిచేస్తాయి. కాగా, సమయం నిజంగా ఏమిటి అనే ప్రశ్న నేటి కాలంలో తలెత్తవచ్చు. మనకు సమయం ఒకేలా ప్రవహిస్తున్నట్టు అనిపిస్తుంది. కానీ ఆధునిక భౌతిక శాస్త్రం చూపిస్తున్నది ఏమిటంటే గురుత్వాకర్షణ, వేగం వంటి పరిస్థితులపై సమయం మారవచ్చు. ఈ భావనను సాపేక్ష సిద్ధాంతం వివరించింది. ఇప్పుడు క్వాంటం స్థాయిలో కూడా సమయం ఎలా ప్రవర్తిస్తుందో తెలుసుకునే కొత్త మార్గం తెరుచుకుంది. భవిష్యత్తులో 'సమయం', 'కాలం' అనే భావనలకు అర్థాలు ఏలా మారుతాయన్నది ఆసక్తి రేపుతున్నది.

## కొత్త అయస్కాంత పదార్థం



అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఇటీవల ఒక కొత్త రకమైన అయస్కాంత పదార్థాలను గుర్తించారు. ఈ పదార్థాల్లో 'స్కెర్మియన్‌లాంటి' పదార్థం కనిపించినట్టు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. స్కెర్మియన్లు అనేవి పదార్థంలోని సూక్ష్మ అయస్కాంత క్షేత్రాలు ప్రత్యేకంగా వంకర తిరిగిన ఆకృతిలో ఏర్పడే నిర్మాణాలు. ఇవి సాధారణ అయస్కాంత కణాల కంటే భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే వాటి స్పిన్ దిశలు ఒక చక్రంలా తిరుగుతూ స్థిరమైన నమూనాను ఏర్పరుస్తాయి. ఈ రకమైన నిర్మాణాలు పదార్థ భౌతిక శాస్త్రంలో చాలా ముఖ్యమైనవి. ముఖ్యంగా భవిష్యత్ కంప్యూటింగ్ సాంకేతికతలలో ఉపయోగపడే అవకాశమున్నందున వీటి ప్రాధాన్యం పెరిగింది. కొత్తగా గుర్తించిన ఈ పదార్థాల్లో అయస్కాంత స్పిన్‌ల ఏర్పాట్లు సాధారణ స్కెర్మియన్లకు దగ్గరగా ఉన్నప్పటికీ కొంత భిన్నంగా ఉంటాయి. అందుకే వాటిని స్కెర్మియన్‌లాంటివి అని పిలుస్తున్నారు. ఈ నిర్మాణాలు సూక్ష్మ స్థాయిలో చాలాస్థిరంగా ఉండగలవు. ముఖ్యంగా చాలా చిన్న పరిమాణంలో కూడా అవి తమ ఆకృతిని కోల్పోకుండా ఉండటం ఒక ప్రత్యేక లక్షణం. ఇదే కారణంగా ఈ రకమైన పదార్థాలు భవిష్యత్ డేటా నిల్వ సాంకేతికతలో ఉపయోగపడవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సాధారణంగా కంప్యూటర్ మెమరీలో సమాచారాన్ని నిల్వ చేయడానికి ఎలక్ట్రాన్ల చార్జ్ లేదా అయస్కాంత స్థితులను ఉపయోగిస్తారు. కానీ స్కెర్మియన్ నిర్మాణాలను ఉపయోగిస్తే చాలా చిన్న స్థలంలో ఎక్కువ సమాచారాన్ని నిల్వచేయడం సాధ్యమవుతుంది. ఈ పరిశోధన మరో ముఖ్యమైన విషయాన్ని సూచిస్తుంది. పదార్థాల లోపల ఉన్న సూక్ష్మ అయస్కాంత క్రమబద్ధతను అర్థం చేసుకోవడం ద్వారా కొత్త రకాల ఎలక్ట్రానిక్ పరికరాలను అభివృద్ధి చేయవచ్చు. ముఖ్యంగా స్పింట్రానిక్స్ అనే సాంకేతిక రంగంలో ఈ ఆవిష్కరణకు ప్రాధాన్యం ఉంది. స్పింట్రానిక్స్‌లో ఎలక్ట్రాన్ యొక్క చార్జ్ మాత్రమే కాకుండా దాని స్పిన్ లక్షణాన్ని కూడా సమాచారాన్ని నియంత్రించడానికి ఉపయోగిస్తారు. ఈ విధానం వల్ల శక్తి వినియోగం తక్కువగా ఉండే, వేగంగా పనిచేసే పరికరాలు రూపొందించే అవకాశం ఉంటుంది.

## కొత్తజ్ఞాపకాలే పాతగా..




'డేజా వూ' అనే భావన మనలో చాలామందికి ఎప్పుడో ఒకసారి అనుభవంగా ఉంటుంది. ఒక సంఘటన మొదటిసారి జరుగుతున్నప్పటికీ అది మనకు ముందే జరిగినట్టుగా అనిపించడం దీనిలో ప్రధాన లక్షణం. ఉదాహరణకు మనం ఒక కొత్త ప్రదేశానికి వెళ్లినా, కొత్త వ్యక్తిని కలిసినా, ఇది ముందే చూసినట్టుంది లేదా ఇలాంటి క్షణం ఇప్పటికే జరిగింది అనే భావన ఒక్కసారిగా వస్తుంది. వాస్తవానికి అది మొదటిసారి జరుగుతున్న సంఘటన అయినప్పటికీ మన మెదడు దానిని పరిచయమైన అనుభవంలా భావిస్తుంది. ఈ విచిత్రమైన అనుభూతినే 'డేజా వూ' అని పిలుస్తారు. నాడీవిజ్ఞానశాస్త్ర పరిశోధనల ప్రకారం ఈ అనుభూతి ప్రధానంగా మన మెదడులోని జ్ఞాపక వ్యవస్థలో జరిగే చిన్న గందరగోళం వల్ల వస్తుంది. మనం చూసే దృశ్యాలు, వినే శబ్దాలు, అనుభవించే సంఘటనలు అన్నీ ముందుగా మెదడులో ప్రాసెస్ అవుతాయి. ఆ తరువాత అవి జ్ఞాపకాలుగా నిల్వ అవుతాయి. ఈ ప్రక్రియలో మెదడులోని ఒక ముఖ్యమైన భాగం 'టెంపోరల్ లోబ్'. ఇది జ్ఞాపకాలను గుర్తించడం, నిల్వ చేయడం, గత అనుభవాలను గుర్తు చేసుకోవడం వంటి పనుల్లో కీలక పాత్ర పోషిస్తుంది. కొన్నిసార్లు మెదడు కొత్త సమాచారాన్ని ప్రాసెస్ చేసే సమయంలో చిన్న పొరపాటు జరుగుతుంది. అప్పుడు కొత్తగా వచ్చిన అనుభవాన్ని మెదడు పొరపాటుగా పాత జ్ఞాపకంలా గుర్తిస్తుంది. ఈ తాత్కాలిక లోపం వల్ల మనకు ఆ సంఘటన ముందే జరిగినట్టు అనిపిస్తుంది. శాస్త్రవేత్తలు మెదడు చిత్రీకరణ సాంకేతికతలు, కాగ్నిటివ్ పరీక్షలు, నాడీ కార్యకలాపాల పరిశీలన ద్వారా ఈ విషయాన్ని అధ్యయనం చేస్తున్నారు. ఈ పరిశోధనల ఆధారంగా 'డేజా వూ' అనేది సాధారణంగా మెదడులో జరిగే తాత్కాలిక జ్ఞాపక ప్రాసెసింగ్ లోపమే అని భావిస్తున్నారు. ఇంకొకవైపు సిద్ధాంత భౌతికశాస్త్రంలో మల్టీవర్స్ అనే ఆసక్తికర ఆలోచన కూడా ఉంది. ఈ సిద్ధాంతం ప్రకారం మన విశ్వం ఒక్కటే కాకుండా అనేక సమాంతర విశ్వాలు ఉండవచ్చని కొందరు శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు.

# ప్రజా పోరాటాలతోనే పార్టీ బలోపేతం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


### సిపిఐ(ఎం)కు పలువురు రాజీనామా.. సిపిఐలో భారీ చేరికలు



**ప్రజాపక్షం/గార్ల :** గార్ల మండలానికి చెందిన పలువురు సిపిఎం నాయకులు శుక్రవారం సిపిఐ రాష్ట కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సిపిఐలో చేరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి, సిపిఐ రాష్ట సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు పలువురు సిపిఐలో చేరారు. పార్టీలో చేరిన వారికి సిపిఐ రాష్ట కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లడుతూ ప్రజా పోరాటాలతోనే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. సిపిఐ చేసే పోరాటాలకు ఆకర్షితులై రాష్ట వ్యాప్తంగా పలువురు నేతలు పార్టీలో చేరుతున్నారన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి పార్టీలో నూతనంగా చేరిన వారు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. మానుకోట జిల్లా ఉద్యమాలకు పుట్టినిల్లన్నారు. రాష్టంలో సిపిఐ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందన్నారు. పార్టీలో చేరిన వారందరికి సిపిఐ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కూనంనేని తెలిపారు. పార్టీలో చేరిన వారు గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఎం జిల్లా కమిటి మెంబర్ భూక్య హరినాయక్, సిపిఎం మండల మాజీ కార్యదర్శి మేదరమెట్ల గిరిప్రసాద్, రాంపురం మాజీ ఉపసర్పంచ్ అన్నం శ్రీనివాస్ రావు, శేరిపురం సిపిఎం శాఖా కార్యదర్శి భూక్య పూల్‌సింగ్, ఐద్వా మండల నాయకురాలు ధారావత్ లక్ష్మి, ఐద్వా మండల నాయకురాలు భూక్య పద్మ, ముత్తితండా సిపిఎం నాయకుడు భూక్య మంగీలాల్, సీతంపేట సిపిఎం నాయకుడు బానోత్ వెంకన్న, భూక్యశ్రీను, మర్రిగూడెం సిపిఎం శాఖ నేత వాంకుడోత్ సోమ్లా నాయక్ తదితరులు ఉన్నారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, రాష్టకౌన్సిల్ సభ్యుడు రేశపల్లి నవీన్, గార్ల మండల సిపిఐ కార్యదర్శి జంపాల వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాగం లోకేష్, మండల సహాయ కార్యదర్శి రాగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐలో పలువురు చేరిక

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ ప్రజా పోరాటాలు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రగతికి ఆకర్షితులై పేద, బడుగు బలహీన వర్గాలు భారీసంఖ్యలో సిపిఐ చేరుతున్నారని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండలం అంబేద్కర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు శుక్రవారం సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎర్రకండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ నియోజవర్గంలో పేదప్రజల ఆశాజ్యోతిగా సిపిఐ నిలిచిందని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక పార్టీ ఎర్రజెండానే అని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన నూతన సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. అంబేద్కర్ నగర్ గ్రామాభివృద్ధికి,అక్కడ పేరుకుపోయిన సమస్యల శాశ్వత పరిష్కారానికి ట్టుబడి ఉన్నామన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నిరంగాల్లో నియోజకర్గాన్ని అగ్రగామిగా నిలుపుతున్నారని వివరించారు. పార్టీలో చేరిన వారిలో పోతురాజు శ్రీను, మధు, ఎం.పుల్లయ్య, ఇనుగంటి రాజు, మహేష్, సారయ్య, భాస్కర్, పరిశుద్ధ ఉన్నారు. కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, నాయకులు నీడల సుధాకర్, మన్నెం వెంకన్న,వ జగదాంబ, మేఘనాధ్, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# పెట్రో ధరలు తక్షణమే తగ్గించాలి


### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/భువనగిరి :** పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శుక్రవారం సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏశాల అశోక్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని ఆరోపించారు. సామాన్య, మధ్య తరగతి పేదలపై భారం మోపే విధంగా ప్రధాని మోదీ చర్యలు ఉన్నాయన్నారు. వివిధ రాష్ట్రాలలో ఉన్న ప్రతిపక్ష పార్టీలను విడదీసి పాలన కొనసాగించే విధానాలు మోదీ చేస్తున్నాడని విమర్శించారు. మోదీ అవకాశవాద కార్పొరేట్ అనుకూల పాలన సాగిస్తున్నారని నెల్లికంటి తెలిపారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోవడం ద్వారా యువతలో అసంతృప్తి విపరీతంగా పెరిగి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తే కోట్లాదిమంది యువత రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో రైతులు పండించినటువంటి వరి ధాన్యాన్ని ఇప్పటికైనా కొనుగోలు పూర్తి చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికయిన రైతు రుణ మాఫీ, మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధం కావాలని సిపిఐ శ్రేణులకు సత్యం సూచించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, నిత్యావసర వస్తువుల ధరలు, డీజిల్, పెట్రోల్ ధరల పెంపుపై నిరసన వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఈనెల 10న నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బోలగానీ సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోదా శ్రీరాములు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ది శ్రీనివాస్. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు. ప్రజా సంఘాల నాయకులు కళ్లెం కృష్ణ, బచ్చనగోని గాలయ్య, ఉప్పల ముత్యాలు, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, చిగుళ్ల లింగం, పేరబోయిన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ పూర్తిచేయాలి

### రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య డిమాండ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాలం రాకముందే రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోళ్లు పూర్తి చేసి, మిల్లులకు తరలించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డిజి.నరేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం నాయకులు డిజి నరేంద్రప్రసాద్, ముఖ్య నాయకులు బృందం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రాలను అధికారులు సక్రమంగా నిర్వహించడం లేదని, దీంతో రవాణా సమస్యలు, గన్నీ బ్యాగుల కొరత, హమాలీలు లేకపోవడం, గోదాములను వినియోగంచుకోవడం లేదని మండిపడ్డారు. శామీర్‌పేట సొసైటీలో ఐదు రోజులుగా కేంద్రానికి తీసుకవచ్చిన దాన్యం అధికారులు తీసుకోలేదని దీంతో రైతులు, రైతు సంఘాల నాయకులు ఆగ్రహంతో రోడ్కెక్కి రాస్తారోకో, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేశారన్నారు. శామీర్‌పేట ఎఫ్ఎస్‌సిఎస్ అధికారులు అలియాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి లారీలను ఎక్కువగా ఏర్పాటు చేసి ధాన్యం తరలించాలన్నారు. రైతులు అమ్మిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులను వెంటనే బ్యాంక్ ఖాతాలో జమచేయాలని, రవాణా సౌకర్యం కొరకు అవసరమైన వాహనాలను అందుబాటులో పెట్టాలని, జిల్లాలో మిల్లులకు ధాన్యాన్ని చేరవేయాలని డిమాండ్ చేశారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుగుణబాయి స్పందించి ధాన్యం తరలించుటకుచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం కార్యదర్శి నిమ్మల నర్సింహా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్.దశరథ, పి.నర్సింహా, పి.సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

## సిఎం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం కోహెడలో శనివారం సిఎం ఏనుముల రేవంత్ రెడ్డి కోహెడలో శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఎంపి శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, స్థానిక ఎంఎల్ఏ మల్ రెడ్డి రంగారెడ్డి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ భవిష్యత్తుకు కొత్త దిశానిర్దేశం చేసే కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో మైలురాయిగా నిలవనుందని చెప్పారు.గతంలో నిలిచిపోయిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పునరుద్ధరించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) అనుసంధానం, రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని కోహెడ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు.239 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న ఈ మార్కెట్‌లో పండ్లు, కూరగాయలు, పూలు, మాంసం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు అమ్మకాలు, ఎగుమతిదిగుమతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆధునిక గిడ్డంగులు,కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ పార్కులు, ప్రాసెసింగ్ యూనిట్లు, రవాణా కేంద్రాలు వంటి ప్రపంచ స్థాయి మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మూడు దశల్లో మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, తొలి దశ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతు భరోసా, రైతు బీమా, పంటల కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు విస్తృత స్థాయిలో మద్దతు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కోహెడ ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన రంగాల అభివృద్ధికి నూతన ఊపునివ్వనుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం ఈ మార్కెట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు, సభ్యులు హాజరుకానుండగా, వారి రవాణా, పార్కింగ్, తాగునీరు, భద్రత, విశ్రాంతి తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రదర్శనలు,సమాచార కేంద్రాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ సంస్థ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి,రాష్ట్ర వ్యవసాయ,సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్,మార్కెటింగ్ శాఖ కమిషనర్ గోపి,మార్కెట్ కమిటీ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి,సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కాలరాసిన ఘనత బిఆర్ఎస్‌దే

## ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి



**ప్రజా పక్షం/ హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కార్మిక సంఘాలు లేకుండా చేసి కార్మికుల హక్కులను కాలరాసిన ఘనత బి.ఆర్.ఎస్ ప్రభుత్వానిదేనని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులు 52 రోజులు సమ్మె చేస్తే పట్టించుకోని బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఇప్పుడు కార్మికుల సంక్షేమంపై హరీష్ రావు నీతులు పలకడం సిగ్గుచేటన్నారు. హైదరాబాద్, బాగ్ లింగంపల్లి, వివిస్టి యూనియన్ కార్యాలయం లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం లో మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణ ద్రోహి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని తమ ట్రేడ్ యూనియన్ అభ్యర్థి రాంబాబు యాదవ్ ను గెలిపించాలని కోరడం విడ్డురంగా ఉందని, బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో ఏఒక్క సమస్య పరిష్కరించకుండా జలమండలి కార్మికులకు మోసం చేసి, ఇప్పుడు ఇది చేసాం, అది చేసాం అని పచ్చి అబద్దాలు పలకడం దుర్మార్గమన్నారు. జలమండలిలో పదోన్నతులు కల్పించకపోగా, శాశ్వత ఉద్యోగులను చేస్తామని మోసం చేసిందే బి.ఆర్.ఎస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కార్మిక సంఘాలను రద్దు చేయండం, ప్రశ్నించిన కార్మికులపై కక్షకట్టడం, నిరసన తెలిపే హక్కు లేకుండా చేయడమే బి.ఆర్.ఎస్ సాధించిన విజయమని, మండిపడ్డారు. దుర్మార్గ బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో జలమండలిలో ఎన్ని సమస్యలు పరిష్కారమియ్యని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు జి. సంజీవ రెడ్డి నేతృత్వంలో ఎన్ని సమస్యలు పరిష్కారమైయ్యాయని జలమండలి ఉద్యోగ, కార్మికులకు తెలుసునని, గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలని నిర్ణయం వారే తీసుకుంటారని, దగాకోరు, బినామీ కాంట్రాక్టర్ రాంబాబు యాదవ్ ను బి.ఆర్.ఎస్ పార్టీ తమ ట్రేడ్ యూనియన్ తరపున పోటీ చేయించడమే అంటేనే హరీష్ రావు ఓటమిని ఒప్పుకున్నట్లేనని అన్నారు. గత 12 సంవత్సరాలుగా పెండింగ్ లోఉన్న జలమండలి కార్మికుల సమస్యలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే టీజేఈయూ, జలమండలి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి దాదాపు అన్ని సమస్యలను పరిష్కరించమని, 80 కోట్ల రూపాయల లీవ్ ఎన్కాశమెంట్ ను విడుదల చేయించామని, దింతో వందలాదిమంది జలమండలి ఉద్యోగ, కార్మికులు లబ్ది పొందారని, పదవి విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఇప్పించడం జరిగిందని తెలిపారు. జలమండలిలో కారుణ్య నియామకాలు, ఆరోగ్య భీమా కార్డులు ఇప్పించే బాధ్యత తమ యూనియన్ దేనని, త్వరలో ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బి.ఆర్.ఎస్ వంచించే పార్టీ అని, రాంబాబు యాదవ్ పచ్చి మోసగాడని జలమండలి ఉద్యోగ, కార్మికులు గ్రహించారని, ఈ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ను భారీ మెజారిటీ తో గెలిపిస్తారని మొగుళ్ళ రాజిరెడ్డి చెప్పారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, అధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, జలమండలి ఎస్.సి, ఎస్టీ యూనియన్ అధ్యక్షులు శంకర్ ప్రకాష్, వివిస్టి యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్.డి. పాల్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ పిసిబి ఉద్యోగాల్లో

# బిసిలకు అన్యాయం

## సమస్యపై వారం రోజులలో నివేదిక : బిసి కమిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో సహాయ శాస్త్రవేత్త (ఎనలిస్ట్ గ్రేడ్ II) ఉద్యోగాల భర్తీకి ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన ప్రకటనలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, బిసిలకు అన్యాయం జరుగుతుందని కొంతమంది అభ్యర్థులు బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్‌తో పాటు సభ్యులను కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై స్పందించిన బిసి కమిషన్ తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శిని సమస్యపై వారం రోజులలో సవివరమైన నివేదిక అందజేయాలని కోరుతూ లేఖ రాయడం జరిగిందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

## డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఫోర్త్ సిటీలో టిజిఐఐసికి చెందిన 500 ఎకరాల స్థలాన్ని కేటాయించే అంశంలో 'వనరుల సమీకరణ కోసం ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం' నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు కొందరు జర్నలిస్టులు ప్రజాభవన్‌లో క్యాబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ భట్టి విక్రమార్కను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా జెఎన్‌జె హౌజింగ్ సొసైటీ సిఇఒ, డైరెక్టర్లు భట్టి విక్రమార్కకు విజ్ఞాపన పత్రాన్ని అం దజేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. జెఎన్‌జెతో పాటు ఇతర హౌజింగ్ సొసైటీల నుంచి విజ్ఞప్తులు రాగానే, వాటిని జోడించి ఉప సంఘం ఎజెండాలో పొందుపర్చి నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. కాగా, తమకు పేట్ బషీరాబాద్, నిజంపేటలోని పాత స్థలాలే ఇవ్వాలన్న జెఎన్‌జెలోని ఒకవర్గం డిమాండ్‌ను భట్టి తోసిపుచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల భిన్నంగా అలా కేటాయించడం కుదరబోదని ఆయన స్పష్టం చేశారు.

### టిజి-20 లీగ్‌పై ముదురుతున్న వివాదం..

# అనుమతులు ఉంటే బయటపెట్టండి

## హెచ్‌ఎసికు టిసిఎ సవాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ క్రికెట్‌లో మరోసారి వివాదం రాజుకుంది. టిజి20 లీగ్ నిర్వహణకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) అనుమతులు ఉన్నాయని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) చేస్తున్న ప్రచారాన్ని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) తీవ్రంగా ఖండించింది. ఆటగాళ్ల వేలం, ఫ్రాంచైజీ ఎంపిక ప్రక్రియలు కొనసాగుతున్న నేపథ్యంలో అనుమతులు, అధికారిక రికార్డులు వెల్లడించకపోతే ఆటగాళ్లు, పెట్టుబడిదారులు, స్పాన్సర్లు, జట్టు యజమానులు భవిష్యత్తులో చట్టపరమైన మరియు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని టిసిఎ ప్రధాన కార్యదర్శి ధారం గురువారెడ్డి హెచ్చరించారు. లీగ్ నిర్వహణకు సంబంధించిన అధికారిక అనుమతులు, రికార్డులను బహిర్గతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హెచ్‌సి వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పి. నవీన్ రావు, హెచ్‌సిఎ కార్యదర్శి ఎ. జీవన్ రెడ్డిలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.గతంలో తెలంగాణ ప్రీమియర్ లీగ్‌ను బిసిసిఐ అనధికార టోర్నమెంట్‌గా పేర్కొన్న విషయాన్ని గురువారెడ్డి గుర్తు చేశారు. అదే ప్రతిపాదనను పేరు మార్చి టిసి20గా నిర్వహిస్తున్నట్లయితే, దానికి బిసిసిఐ నుంచి ప్రత్యేక అనుమతి ఎప్పుడు, ఎలా లభించిందో హెచ్‌సిఎ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోర్టులు ఆధారాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటాయన్నారు. టిజి20 లీగ్‌కు చట్టబద్ధ అనుమతులు ఉన్నాయంటే వాటిని ప్రజల ముందుంచాలి. పేరు మార్చడం ద్వారా అనుమతులు లభించినట్లుగా భావించలేం అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర క్రికెట్ సంఘాలు నిర్వహించే వాణిజ్య లీగ్‌లు బిసిసిఐ నిబంధనలు, రాజ్యాంగం, జనరల్ బాడీ ఆమోదం, పారదర్శక ప్రక్రియలకు లోబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. హెచ్‌సి, బిసిసిఐ సంబంధిత సంస్థలు ఐదు పని దినాల్లో అన్ని అనుమతులు, రికార్డులను బహిరంగపరచాలని, లేనిపక్షంలో కోర్టులు, నియంత్రణ సంస్థలను ఆశ్రయించి తెలంగాణ క్రికెటర్ల ప్రయోజనాలు, రాష్ట్ర క్రికెట్ పరిపాలనా హక్కుల పరిరక్షణ కోసం తదుపరి చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# పేదలకు విలువైన ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇండ్లు

## లక్ష గృహాల నిర్మాణానికి కార్యాచరణ వేగవంతం : మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేదల జీవనోపాధికి భంగం కలగకుండా వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పాదాయ, మధ్య తరగతి వర్గాల కోసం లక్ష ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల్లో గృహాలు నిర్మించి, ఆ స్థలాల్లో యాజమాన్య హక్కులను పేద కుటుంబాల మహిళలకు కల్పించనున్నట్లు చెప్పారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇండ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. దీనికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి పేదల ఉపాధి, విద్య, వైద్య అవసరాలను విస్మరించిందని మంత్రి విమర్శించారు. ఉపాధి అవకాశాలకు దూరంగా ఉండటంతో అనేక కుటుంబాలు ఆ గృహాల్లో నివసించలేకపోయాయన్నారు. పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా గృహ నిర్మాణాన్ని చేపడుతున్నామని, మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేయనున్నామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో సౌకర్యవంతమైన గృహ నమూనాలను రూపొందించాలని అధికారులకు సూచించారు.



'ఆంధ్ర మహాసభ' ముంబయిలో నిర్వహించిన ''తెలుగుసాంస్కృతిక సంబరాలు -2026'' కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. ముంబై నగరంలో నివసిస్తున్న సుమారు 1.2 మిలియన్ల (12 లక్షల) మంది తెలుగు ప్రజల అస్తిత్వాన్ని, గుర్తింపును కాపాడేందుకు కృషి చేస్తున్న 'ఆంధ్ర మహాసభ' ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

# భూముల మార్కెట్ విలువల పెంపు ప్రజలపై భారం : రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయత లేకుండా భూముల మార్కెట్ విలువలను పెంచడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల దూరమవుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, భూయజమానులకు న్యాయమైన లబ్ధి చేకూరడాన్ని బిజెపి స్వాగతిస్తుందని, అయితే ప్రస్తుత పెంపు వెనుక ఉద్దేశం ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడమేనని ఆరోపించారు. భూముల విలువలను 50 నుంచి 100 శాతం వరకు, కొన్ని ప్రాంతాల్లో 300 శాతం పైగా పెంచడం వల్ల భూమి కొనుగోలు, గృహ నిర్మాణం మరింత భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎకరానికి కనీస ధర రూ.2.75 లక్షలు, మున్సిపాలిటీల్లో రూ.5 లక్షలు, హెచ్ఎండిఏ పరిధిలో రూ.10 లక్షలుగా నిర్ణయించడం ప్రజలపై అదనపు భారం మోపుతోందన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు, ఆర్‌టిసి బస్సు చార్జీలు, ఆస్తి పన్నులు, మంచినీటి చార్జీలు పెరిగాయని, ఇప్పుడు భూముల మార్కెట్ విలువల పెంపుతో మరో భారాన్ని ప్రజలపై మోపుతున్నారని విమర్శించారు. పెంచిన మార్కెట్ విలువలను పునఃసమీక్షించి ప్రజలపై భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

# 'రాజేష్ ఎక్స్‌పోర్ట్స్'కు కేంద్రమే సర్టిఫికెట్ ఇచ్చింది : దాసోజుశ్రవణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికేషన్ ఆధారంగానే 'రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీతో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ పరస్పర అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని బిఆర్ఎస్ ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్ అన్నారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్ర ఖజానాకు పైసా నష్టం జరగలేదని, ఆ కంపెనీకి ఒక ఇంచ్ భూమిని కూడా కేటాయించలేదని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకుడు పల్లే రవికుమార్‌తో కలిసి దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ పరస్పర ఒప్పందం అంటే కేవలం సంప్రదింపుల ఆరంభం మాత్రమే తప్ప, నిధులను కట్టబెట్టడం కాదన్నారు. ఆ కంపెనీతో జరిగిన ఒప్పంద ప్రాజెక్ట్ సంతకాల దశలోనే ముగిసిపోయిందన్నారు. ఈ కంపెనీకి భూములను కట్టబెట్టారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసి సంస్థతో రూ600ల కోట్ల నిధులను పెట్టుబడి పెట్టిందన్నారు. ఒక వేళ ఈ కంపెనీ' ఫేక్ కంపెనీ' అయితే, దీనికి భారీ ప్యాకేజీలను కేటాయించిన కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదిని, బిజెపిని ప్రశ్నించాలని సూచించారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా అదానీ, అంబానీలతో సిఎం రేవంత్ రెడ్డి అడ్డగోలుగా ఒప్పందాలు చేసుకున్నారని, దావస్‌లో జరిగిన ఒప్పందాల్లో ఇప్పటి వరకు ఎన్ని కంపెనీలు ముందుకొచ్చాయి? క్షేత్రస్థాయిలో ఎన్ని ప్రాజెక్ట్‌లు ఉన్నాయో శ్వేతపత్రం విడుదల చేయాలని దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు.

# అంగన్‌వాడిల్లో పోషకాహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంగన్‌వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పోషకాహార సేవలను మరింత నాణ్యంగా, సురక్షితంగా ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడి కేంద్రాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, పంపిణి వ్యవస్థ తదితర అంశాలపై మంత్రి సీతక్క జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించారు. భవిష్యత్ తరాల ఆరోగ్యానికి అంగన్‌వాడి కేంద్రాలు పునాదిగా నిలుస్తాయని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే ప్రతి ఆహార పదార్థం నాణ్యంగా, సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి సీతక్క అన్నారు. ఈ నేపథ్యంలో వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే సందర్భంగా జూన్ 7న రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆహార పదార్థాల సేకరణ, నిల్వ, వంట ప్రక్రియ, పరిశుభ్రత ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, సురక్షిత పోషకాహారం పంపిణి వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లాల వారీగా ఫుడ్ సేఫ్టీ అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. వారు అంగన్‌వాడి సిబ్బందికి ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నారు. భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ మార్గదర్శకాల ప్రకారం శిక్షణ నిర్వహించనున్నారు.

# పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలి : ఎంపి అరవింద్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని నిజామాబాద్ బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు అంశంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే పరిమితమైందన్నారు. వరి కోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో వైఫల్యం చెంది కేంద్రంపై నెపం మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సిఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన బకాయిలు చెల్లించాల్సి ఉందని, రైతుల ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని వ్యాఖ్యానించారు. ప్రస్తుత నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని అరవింద్ డిమాండ్ చేశారు.

# ఎన్ఐఏ కేసులో అరెస్టైన ఇన్నయ్యకు మధ్యంతర బెయిలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్ఐఏ కేసులో అరెస్టయిన గాదె ఇన్నయ్యకు వైద్య చికిత్స నిమిత్తం రెండు నెలల మధ్యంతర బెయిలు మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య చికిత్స నిమిత్తం మధ్యంతర బెయిలు మంజూరు చేయాలంటూ గాదె ఇన్నయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డిలతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టి జైలులో ఫిజియోథెరఫీ సౌకర్యం లేకపోవడంతో షరతులతో రెండు నెలల బెయిలు మంజూరు చేసింది. ఈనెల 5 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు మధ్యంతర బెయిలు మంజూ చేస్తూ కూకట్‌పల్లిలోని కుమార్తె ఇంటిలో ఉండాలంది. కుమార్తె, అల్లుడు, మరో ముగ్గురు సోదరీమణులకు మాత్రమే ఇన్నయ్యతో ఉండటానికి అనుమతించింది. దర్యాప్తులో ఎవరూ జోక్యం చేసుకోరాదని స్పష్టం చేసింది. ఇన్నయ్య కదలికలపై నిఘా ఉంచడానికి స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ఇద్దరు పోలీసులను ఇంటి దగ్గర ఉంచాలని దర్యాప్తు అధికారికి ఆదేశించింది. షరతులు ఉల్లంఘిస్తే బెయిలు ఉపసంహారణ కోరవచ్చని పేర్కొంది. ఆగస్టు 5వ తేదీన జైలు సూపరింటెండెంట్ ముందు లొంగిపోవాలని ఆదేశించింది.

# చిత్రహింసలకు ఆధారాల్లేవు

## పిటిషన్ అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒక కేసులో నిందితురాలిగా ఉన్న తనను పోలీసులు చిత్రహింసలకు గురి చేశారని, సిట్‌తో దర్యాప్తు చేయించి, రూ.50 లక్షల పరిహారం ఇప్పించాలన్న మహిళ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. మేజిస్ట్రేట్ డాకెట్ ఉత్తర్వుల ప్రకారం పోలీసులు చిత్రహింసలకు గురి చేసినట్లు పిటిషనర్ చెప్పలేదని, అలాంటప్పుడు చిత్ర హింసలకు ఆధారాల్లేవని తేల్చి చెప్పింది. దర్యాప్తు నిమిత్తం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలన్న మహిళ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో పోలీసులు నిర్బంధంలో చిత్రహింసలకు గురి చేశారని, దీనిపై సీబీఐ, సిట్‌లతో దర్యాప్తు చేయించాలని, సీసీటీవీ ఫుటేజీ భద్రపరచేలా ఆదేశాలు జారీ చేయాలంటూ కోదూరి మీనాకుమారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఫిర్యాదుదారు ప్రోత్సాహంతో పోలీసులు చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. రూ.50 లక్షల పరిహారం ఇప్పించాలని, సిట్‌తో దర్యాప్తు జరిపించాలని కోరారు. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచినపుడు పోలీసులు హింసకు గురి చేయలేదని చెప్పారని, ఇదే విషయాన్ని మేజిస్ట్రేట్ డాకెట్ ఉత్తర్వుల్లో నమోదు చేశారన్నారు. దీనికి విరుద్ధంగా ఇక్కడ వచ్చి చిత్రహింసలు పెట్టారని ఆరోపించడం సరికాదన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి పిటిషనర్ ఆరోపణలకు ఆధారాల్లేవని, మేజిస్ట్రేట్ డాకెట్ ఆర్డర్ ప్రకారం పోలీసులు చిత్రహింసలకు గురిచేసినట్లు పిటిషనర్ చెప్పలేదన్నారు. అందువల్ల పిటిషనర్ కోరిన సిట్ ఏర్పాటు, ఫుటేజీని భద్రపరచాలన్న ఆదేశాలివ్వలేమంటూ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



# పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు త్వరగా నిర్వహించాలి : డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలని డిజిపి సివి ఆనంద్ అధికారులను ఆదేశించారు. అసోసియేషన్ ప్రతినిధులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక కావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని, అందువల్ల ఎన్నికలు త్వరగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర అధ్యక్షుడు వై. గోపిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం డిజిపిని కలిసి వినతిపత్రం అందజేసింది. పలు పరిపాలనా, సాంకేతిక కారణాలతో ఎన్నికలు వాయిదా పడిన విషయాన్ని డిజిపి దృష్టికి తీసుకెళ్లారు.విషయాన్ని పరిశీలించిన డిజిపి ఎన్నికల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



## పచ్చదనం పెంచడం ఒక్కటే గ్లోబల్ వార్మింగ్‌కు విరుగుడు : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** భూతాపం, విపత్తుల నుంచి భూమిని, మానవ సమాజాన్ని కాపాడుకోవడానికి పచ్చదనాన్ని పెంచడం ఒక్కటే సరైన మార్గమని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వన సంరక్షణ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేళ పట్టణ, గ్రామీణ ప్రాంతాల పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో ఎమ్మెల్యే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణ కేంద్రంలోని గ్రంధాలయం సమీపంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటిష నవీన్, ఫారెస్ట్, మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే నీడను, పండ్లను ఇచ్చే మొక్కలను నాటారు.

## పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



**ప్రజాపక్షం/చిట్యాల :** పర్యావరణాన్ని పరిరక్షించడం అనేది సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు స్వీకరించాలని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఆయన మొక్కను నాటిన సందర్భంగా మాట్లాడారు. పర్యావరణ మనుగడ మసక బారితే భూమి మీద ప్రాణి జీవించడం కష్టసాధ్యమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పందరి గీతారమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలతసైదులు, కమీషనర్ గురులింగం, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోకల దేవదాసు, కౌన్సిలర్లు నాగిళ్ళ సుధాకర్, పరమేశం, దేశపాక శ్రీలత రాజేష్, కుక్కల మెహన్‌పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన 'డబుల్' ఇళ్ల పనులు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలి ఉన్న అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆయన పట్టణంలోని గొల్లగూడ డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాన్ని పరిశీలించారు.మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలి గొల్లగూడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అద్దాలు, ఎలక్ట్రికల్ వైరింగ్, విండోలు,వాటర్ ట్యాంకులు,నీటి ట్యాపులు,లైటింగ్,తలుపులు,బాత్రూములు,టాయిలెట్లు,కిచెన్ గదులు తదితర పనులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని సౌకర్యాలు ఒకేచో లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.కలెక్టర్ వెంట జిల్లా గృహ నిర్మాణ పీడీ రాజ్ కుమార్,పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్,కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర,కాంట్రాక్టర్ సైదిరెడ్డి ఉన్నారు.

## బునాది గాని కాలువ మరమ్మతుల కోసం రైతులు సహకరించాలి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని మక్త అనంతారం గ్రామం నుండి మగ్దుంపల్లి వరకు చేపట్టే కాలువ మరమ్మతుల కోసం రైతులు సహకరించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం రహదారి బంగ్లాలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్త అనంతారం, పడమటి సోమారం, వెంకిర్యాల గ్రామాల్లో కాలువ గండిపడి సాగునీరు వృధా అవుతున్నందున వాటి మరమ్మతుల కోసం వచ్చే ఖరీఫ్ పంటకు రైతులు ఒక నెల వెనుకకు విత్తనాలు వేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఈఈ శైలజ, డిఈ లావణ్య, కాంగ్రెస్ నాయకులు గోలి పింగళి రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, ఫోటోల శ్యామ్ గౌడ్‌పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ సత్యంకు 'బడుగు జనుల ఊపిరి' పుస్తకం అందజేత

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ విప్, నకరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పుట్టినరోజు సందర్భంగా ఆవిష్కరించిన బడుగు జనుల ఊపిరి పుస్తకాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం స్వయంగా నెల్లికంటి సత్యంను కలిసి పుస్తకాన్ని బహూకరించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తిప్పర్తి యాదయ్య కూడా పాల్గొన్నారు.బడుగు,బలహీన వర్గాల సమస్యలు, వారి జీవన పోరాటాలను ప్రతిబింబించేలా రూపొందించిన బడుగు జనుల ఊపిరి పుస్తకం సమాజంలో చైతన్యాన్ని పెంపొందించడంలో దోహదపడుతుందని నెల్లికంటి సత్యం అభిప్రాయపడ్డారు.



# రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత

### అక్రమ రిజిస్ట్రేషన్ జరుగుతున్నదంటూ టీఆర్‌పి నాయకుల ఆందోళన

### మోహరించిన పోలీసులు... తీవ్ర వాగ్వివాదం, తోపులాట...

### పరిస్థితి విషమించడంతో వట్టె అరెస్టు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. అక్రమ రిజిస్ట్రేషన్ జరుగుతుందంటూ ఆరోపిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు ఆందోళనకు దిగారు. దీంతో రిజిస్ట్రేషన్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద చేరుకొని పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చేశారు. నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొని తోపులాటకు దారితీసింది. పరిస్థితి విషమించడంతో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్‌ను అరెస్టు చేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని అంజనాపురికాలనీ నందు గల వజ్ర టౌన్ షిప్‌లో బలహీన వర్గాలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు తాము కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన ఇళ్లను అక్రమంగా వేరొకరికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపించారు. వజ్ర టౌన్‌షిప్‌లో ప్లాట్ల యజమాని మరొకసారి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు నల్లు ఉమాజ్యోతిరెడ్డి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వస్తున్నారని, ఈ నేపథ్యంలో ఆ రిజిస్ట్రేషన్‌ను అడ్డుకునేందుకు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించిన వారితో కలిసి కార్యాలయం వద్దకు వచ్చినట్లు చెప్పారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిల ప్రోత్సాహంతోనే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, గతంలో రూరల్ పోలీస్ స్టేషన్‌లో అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసులు నమోదైనా వారిపై ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అగ్రకులాల పార్టీ నాయకులు అక్రమ రిజిస్ట్రేషన్‌ను అధికారులు, పోలీసుల అండతో ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఈతతంగానికి పూనుకోవటం హేయమైన చర్య అన్నారు. మరోసారి తప్పుడు కాగితాలతో మరొకరికి చేసేందుకు వస్తే పట్టణ పోలీసులు తమపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో చట్టబద్ధంగా అనుమతులు తీసుకొని నిర్మాణ పనులు చేపడుతున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలను కొందరు కావాలనే ఇబ్బందులకు గురి చేశారని, నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న ఇనుప సామాగ్రి, రాడ్లు వంచే యంత్రాలను మున్సిపల్ సిబ్బందితో బలవంతంగా తీసుకెళ్లారన్నారు. ఈ విషయంలో సూర్యాపేట రూరల్ పోలీసులు సివిల్‌కు సంబంధించిన వ్యవహారాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని కోరారు. ఇదే విధంగా మున్ముందు వ్యవహరిస్తే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పేదలు, బాధితుల పక్షాన పోలీసులు నిలువాలన్నారు. బలహీనవర్గాలు ఇల్లు నిర్మాణం చేపట్టవద్దా, రాజకీయంగా ఎదగొద్దా మీడియా సమక్షంలో బహిరంగంగా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. తమ కష్టార్జితాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. అధికార పార్టీ నేతలకు పోలీసులు కొమ్ము కాయడం సరికాదని హితవు పలికారు. ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద జరుగుతున్న ఉద్రిక్తతల నడుమ పోలీసులు వట్టె జానయ్య యాదవ్‌ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అరెస్టు అయిన వారిలో టిఆర్‌పి నాయకులు పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మీర్ అక్బర్, కుంభం వెంకన్న, మామిడి ఉదయ్, శ్రీకాంత్ యాదవ్‌లు ఉన్నారు.

**ఉద్రిక్తత నడుమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి...**

తమ భూములను అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారంటూ భూ బాధితులు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తలు వజ్ర టౌన్షిప్ భూబాధితులతో కలిసి స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పే ప్రయత్నం చేసిన వినకపోవడంతో వెంటనే టిఆర్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్‌తోపాటు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం భూ యజమాని నల్లు ఉమాజ్యోతిరెడ్డి చిత్రానందన్ రెడ్డి కార్యాలయానికి వచ్చి తమ భూమి పత్రాలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

## సూర్యాపేట మున్సిపాలిటీకి 'ఉత్తమ పర్యావరణ పనితీరు' పురస్కారం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి చేస్తున్న సూర్యాపేట మున్సిపాలిటికి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) ప్రధానం చేసే ఉత్తమ పర్యావరణ పనితీరు పురస్కారంకు సూర్యాపేట మున్సిపాలిటి ఎంపికైంది. ఈ పురస్కారాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని టిజిపిసిబి కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దేవాదాయ, అటవీశాఖ, ఎన్విరాన్‌మెంట్ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి అందుకున్నారు. పట్టణంలో వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో సూర్యాపేట మున్సిపాలిటి కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ముఖ్యంగా




ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని రీసైక్లింగ్ చేయడం, పర్యావరణహిత కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలు చేయడం మున్సిపాలిటికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటికి లభించిన ఈ పురస్కారం పట్టణ ప్రజలు, పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషికి నిదర్శమన్నారు. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి సూర్యాపేటను రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో సూర్యాపేట అమలు చేస్తున్న వినూత్న విధానాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ అవార్డుతో సూర్యాపేట మున్సిపాలిటి రాష్ట్రంలో పర్యావరణహిత పట్టణాల జాబితాలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.

## ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన జాతీయ జెండా వివాదం!

### సర్పంచ్‌కు బదులుగా భర్త జెండా ఆవిష్కరణ

### జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని ఓ గ్రామపంచాయతీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన వివాదం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళా సర్పంచ్‌కు బదులుగా ఆమె భర్త జాతీయ జెండాను ఆవిష్కరించిన ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.ఈనెల 2న తెలంగాణ రాష్ట్ర 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సర్పంచ్ స్థానంలో ఆమె భర్త జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం తానే జెండా ఆవిష్కరిస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో ఈ విషయం గ్రామస్థుల దృష్టికి వచ్చింది.స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల ఉద్దేశాన్ని ఇలాంటి చర్యలు దెబ్బతీస్తున్నాయని గ్రామస్తులు,యువకులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మహిళా సర్పంచ్ అధికారికంగా నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని ఆమె భర్త నిర్వహించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.ఈ ఘటనపై గురువారం గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జాతీయ జెండా ఆవిష్కరణ వంటి అధికారిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధికి బదులుగా మరొకరు వ్యవహరించడంపై విచారణ జరిపి,బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని స్థానికంగా ఆసక్తి నెలకొంది.మహిళా ప్రజాప్రతినిధుల హక్కులు,అధికారాల పరిరక్షణ కోసం కఠిన చర్యలు అవసరమని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.





## నకిలీ పత్రాలతో ఎస్‌బిఐలో భారీ లూటీ

**ప్రజాపక్షం/చింతపల్లి :** రైతుల పేరిట నకిలీ పత్రాలు సృష్టించి భారీ లూటీకి పాల్పడిన సంఘటన మండల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంకులో గతం లో పని చేసిన ఓ బ్యాంక్ మేనేజర్ రైతుల పేరిట నకిలీ భూమి పట్టా పాస్‌బుక్కులు, పహానీలు, ఆరోఆర్లతో పాటు క్రాప్ లోనుకు కావలసిన ఇతర పత్రాలను సృష్టించి, 40 మంది రైతుల ఖాతాల పేరిట సుమారు కోటి 20 లక్షల రూపాయలు రైతుల అనుమతి లేకుండానే క్రాప్ లోన్లను తన ఖాతాలోకి మల్లించుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం షోకాజ్ నోటీసులు అందుకున్న రైతులు క్రాప్‌లోన్లు ఎత్తకుండానే మాకు నోటీసులు ఎలా వస్తాయని అవాక్కయి, లబోదిబోమంటూ శుక్రవారం బ్యాంకు వద్దకు వెళ్ళి మేనేజర్‌ను కలిసి విషయం చెప్పగా, గతంలో అప్పటి మేనేజర్ రైతుల పేరిట నకిలీ పత్రాలు సృష్టించి క్రాప్ లోన్లు ఎత్తినట్టు తేలింది. దీంతో రైతులు బ్యాంకు ముందు నిరసన చేపట్టారు. ఈ ఘటన పై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మేనేజర్ ను విచారణ కోరగా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పై అధికారులకు తెలియజేస్తామని ఆయన తెలిపారు. రైతుల ప్రమేయం లేకుండా నకిలీ పత్రాలతో క్రాప్‌లోన్లు ఎత్తి, అప్పలపాలు చేసిన హస్తవాసి ఎవరిదో తేల్చాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు బయట పడే అవకాశం ఉందని, రైతులతో సంబంధం లేకుండా క్రాప్ లోన్లు ఎత్తిన వారిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## కాలువలపై బ్రిడ్జిల నిర్మాణం.... బెంబేలెత్తిపోతున్న ప్రజలు



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** కాలువల అభివృద్ధి పేరుతో బ్రిడ్జిల నిర్మాణం చేపట్టి సరైన భద్రత ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు భయంతో బెంబేలెత్తిపోతున్నారు. నాగార్జున సాగర్ గుండా ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ మేళ్లచెరువు మీద నుండి చింత్రియాల పోయే వరకు నిర్మిస్తున్నటువంటి బ్రిడ్జి నిర్మాణం కొంత వరకు పూర్తి చేసి దానికి సరైన భద్రత ఏర్పాట్లు (సరైన రక్షణ గోడ కాని, హెచ్చరిక బోర్డులు) ఏర్పాటు చేయకుండా భద్రతను గాలికి వదిలేయడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పూడ్చకుండా బ్రిడ్జికి సరైన రక్షణ గోడ నిర్మించకపోవడంతో రాత్రి వేళల్లో అటు వైపుగా వెళ్తున్న పాదాచారులు, వాహనదారులకు ఏదైనా ప్రమాదం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ ప్రాంతంలో ఉండాల్సిన హెచ్చరికబోర్డులు కాని సూచిక బోర్డులు కాని కనిపించడంలేదని వాపోతున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఐదు, ఆరు నెలలు అవుతున్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని కాంట్రాక్టర్‌తో మాట్లాడి భద్రత చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## వాసాలమర్రిలో రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని నిరసిస్తూ గ్రామ రైతులు ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రంలో సుమారు 100కు పైగా వడ్ల రాసులు ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా వడ్లు తడిసిపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం, సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

# 'ఆలేరు'..ఎమ్మెల్యే అయిలయ్యకు 'సరిలేరు'

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** అక్షర క్రమంలోనే కాదు.. అభివృద్ధిలోనూ ఆలేరు నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అవిశ్రాంత కృషి చేస్తున్నారు. హంగు ఆర్భాటాలకు తావివ్వకుండా నిత్యం ప్రజల మధ్యే గడుపుతూ (గైర్హాజరు లేకుండా) పార్టీలకు అతీతంగా ' అయిలన్న ' గా ఆయన అన్నివర్గాల మద్దతును గెలుచుకుంటున్నారు. కేవలం 30 నెలల్లోనే సుమారు రూ.3000 కోట్ల నిధులు ఆలేరు నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధికి కేటాయింపజేసి తనదైన మార్క్ చూపుతున్నారు. ఆలేరు నియోజకవర్గం సమగ్రాభివృద్ధే తన లక్ష్యం అంటున్న అయిలయ్య..జూన్ 6న మరో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా 'ప్రజాపక్షం' ప్రత్యేక కథనం.

**వైద్య, విద్యా ప్రదాత...అయిలయ్య**

విద్య, వైద్య రంగాల పై విప్ అయిలయ్య ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. రూ.184 కోట్ల నిధులతో యాదగిరిగుట్ట పట్టణంలో వైద్య కళాశాలను మంజూరు చేయించారు. అధునాతన పద్ధతుల్లో 20 ఎకరాల్లో ఈ నిర్మాణం జరగనుంది. భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పేద, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు తుర్కపల్లి మండలంలో రూ.210 కోట్ల నిధులతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి అయిలయ్య శ్రీకారం చుట్టారు.

**గంధమల్ల ప్రాజెక్టుకు మోక్షం...**

దశాబ్దాలుగా నిరాదరణకు గురైన గంధమల్ల ప్రాజెక్టుకు మోక్షం లభించింది.1.41 టిఎంసిల సామర్థ్యంతో నిర్మాణం జరగనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.700 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇప్పటికే అనుమతులు, నిధులు మంజూరు కాగా, పనులు కొనసాగుతున్నాయి. గంధమల్ల పూర్తయితే దాదాపు 63 వేల ఎకరాలను



సాగు నీరు అందనుంది. అతి స్వల్ప కాలంలో సుమారు 150 చెరువులను గోదావరి జలాలతో నింపారు. పైపు లైన్లు, డీప్ నిర్మాణాల కోసం తమ ' బీర్ల ఫౌండేషన్ ' ద్వారా రూ.80 లక్షలు ఖర్చు చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న బునాదిగాని కాల్వకు నిధులు మంజూరు చేయించారు. ఇటీవల సైకిల్ పై ప్రయాణిస్తూ ఆయన రైతుల సమస్యలు తెలుసుకుంటున్న విషయం తెలిసిందే.

**30 నెలలు..రూ. 3000 కోట్ల సంక్షేమ, అభివృద్ధి పనులు..**

ఆలేరు ప్రజల సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యంగా విప్ అయిలయ్య ముందుకు సాగుతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు (మిషన్ భగీరథ) రూ.210 కోట్ల నిధులు మంజూరు చేయించారు. మెరుగైన ప్రజా రవాణే లక్ష్యంగా పంచాయతీ రాజ్ ఆర్ అండ్ బి రహదారుల (హెచ్ఎఎం పథకం ద్వారా) నిర్మాణానికి రూ.300 కోట్లు కేటాయింపజేశారు. రైతులు ధాన్యం నిలువ చేసుకునేందుకు రూ.20 కోట్లతో వేర్ హౌస్ గోదాం పనులను దాతారుపల్లి గ్రామంలో ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ. 43 కోట్లతో గ్రామాల్లో సిసి రహదారులు, నూతన గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్ర భవనాలకు శ్రీకారం చుట్టారు. నూతనంగా ఆరు సబ్ స్టేషన్ లను మంజూరు చేయించారు. కొత్త మండలం మోటకొండూరు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో విప్ అయిలయ్య ఆ మండలంపై 'ప్రత్యేకంగా' ఫోకస్ చేశారు.

**'ఇండ్ల' అయిలయ్య గా జగద్విఖ్యాతి**

తొలి విడతలో ఆలేరు నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. శరవేగంగా నిర్మాణాలు పూర్తయి, దాదాపు తుది దశకు చేరుకున్నాయి. గృహ ప్రవేశాల సందర్భంగా విప్ అయిలయ్య స్వయం గా హాజరవుతున్నారు. వస్త్రాలు (బట్టలు), నగదుతో పాటు మేకను బహూకరిస్తూ 'జన హృదయనేత'గా పేరొందారు.

**ఆటో కార్మికులు, గుట్ట భక్తుల కష్టాలను గట్టెక్కించిన ఎమ్మెల్యే..**

యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పేరుతో గత బిఆర్ఎస్ పాలకులు యాదగిరికొండ పైకి ఆటో కార్మికులను నిలిపి వేశారు. ఫలితంగా వందలాది మంది స్థానిక ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తనను గెలిపిస్తే ఆటో కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన అయిలయ్య.. అన్నట్లుగానే మాట నిలుపుకున్నారు. యాదగిరిగుట్ట కొండ పైకి ఆటోలను అనుమతింపజేసి వందలాది కుటుంబాల ఉపాధికి అండగా నిలిచారు. యాదాద్రి ' కి 'యాదగిరిగుట్ట 'గా నామకరణం చేయించారు.

**రెవెన్యూ డివిజన్ హామీ అమలులో 'పట్టువదలని విక్రమార్కుడు'...**

ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హామీని నెరవేర్చేందుకు విప్ అయిలయ్య కృషి జరుపుతున్నారు. ఈ అంశాన్ని తిర్మలాపూర్ బహిరంగ సభ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఆర్థిక నష్టాలతో మూసివేత తప్పని దశకు చేరుకున్న మదర్ డెయిరీ (నార్మూల్)ని గట్టెక్కించేందుకు అయిలయ్య ప్రత్యేక చొరవ చూపారు. పేదలకు ఇతోధికంగా సాయమందించే ' బీర్ల ఫౌండేషన్ ' సేవలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం విప్ అయిలయ్య సతీమణి బీర్ల అనిత ' ఫౌండేషన్ ' చైర్ పర్సన్ గా ఉన్నారు.

**ఓటమి ఎరగని జననేతగా..**

మూడున్నర దశాబ్దాలుగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతున్నారు బీర్ల అయిలయ్య అతి సాధారణ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. పాల సంఘం చైర్మన్ మొదలు సర్పంచ్, ఎంపిటిసి, ఎమ్మెల్యే వరకు.. ఇలా పోటీ చేసిన ప్రతిసారీ గెలుపు ఆయన ముగింట వాలింది. అయిలయ్య పనితనం మెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ విప్ గా నియమించి కేబినెట్ స్థాయి హోదాను కల్పించారు. అనంతరం బీఏసీ (అసెంబ్లీ వ్యవహారాల సలహా కమిటీ) మెంబర్ గా నియమితులయ్యారు. రాజకీయంగా జన్మనిచ్చిన ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో ఆలేరును రాష్ట్రంలో ఒక ఆదర్శనియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అహరహం శ్రమిస్తానని ఎమ్మెల్యే అయిలయ్య హామీ ఇస్తున్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
06-06-2026
www.prajapaksham.in

“మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్ లో వస్తున్న చిరంజీవి 158వ చిత్రం షూటింగ్ రెగ్యులర్ గా జరుగుతోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్ లో 'వాల్తేరు వీరయ్య' సినిమా వచ్చింది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యాన్ప నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.”

రీల్

# దూత-2 షూటింగ్ షురూ




ఓటిటి లో సూపర్ హిట్ అయిన దూత సీరీస్ రెండవ భాగం దూత2 షూటింగ్ షురూ అయింది. పూజ కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సీరీస్ కు దేవుడి పటాల ముందు నిలబడిన హీరో హీరోయిన్లపై అక్కినేని నాగార్జున క్లాప్ కొట్టారు. విక్రమ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్ ను నాగ చైతన్య , శరత్ మరార్ కలసి నిర్మిస్తున్నారు. ప్రియా భాస్కరన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు సంబదిన్న పూజ కార్యక్రమలు అన్నపూర్ణ స్టూడియోలో శుక్రవారం జరిగాయి. థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సిరీస్ ను కూడా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉందని నిర్మాతలు ఆశ భావం వ్యక్తం చేశారు.



## కీలక సన్నివేశాల చిత్రీకరణలో

# చిరు158వ చిత్రం

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్ లో వస్తున్న చిరంజీవి 158వ చిత్రం షూటింగ్ రెగ్యులర్ గా జరుగుతోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్ లో 'వాల్తేరు వీరయ్య' సినిమా వచ్చింది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యాన్ప నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పలు భాషల్లో భారీ విజయాలు అందుకున్న కేవీఎన్ ప్రొడక్షన్స్కు ఇది తొలి తెలుగు చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా తమిళనాడులోని పొల్లాచ్చిలో కీలక షెడ్యూల్ను ప్రారంభించారు. ఈ షెడ్యూల్లో చిరంజీవితో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటూ కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.దర్శకుడు బాబీ కొల్లి మరింత భారీ స్థాయిలో కథను సిద్ధం చేశారు. దశాబ్దాలుగా తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న చిరంజీవి ఈ చిత్రంలో తన కెరీర్లోనే అత్యంత పవర్ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ చిత్రానికి అద్భుతమైన విజువల్స్ అందించనున్నారు. ప్రొడక్షన్ డిజైన్ అవినాశ్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్ను ఆంటోని ఎల్. రూబెన్ చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందిస్తుండగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి అడిషనల్ స్క్రీన్‌ప్లే రచయితలుగా పనిచేస్తున్నారు. భానునందు ద్వయం సంభాషణలను అందిస్తున్నారు.ఈ చిత్రంలో చిరంజీవి సరసన కథానాయిక త్వరలోనే ప్రకటించనున్నారు. అనశ్వర రాజన్ ఇందులో ఓకీలక పాత్రను పోషిస్తోంది.

# 'సిగ్మా' ఫస్ట్ సింగిల్ రిలీజ్



సందీప్ కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ నిర్మిస్తున్న చిత్రం 'సిగ్మా'. జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం సినీ వర్గాల్లో భారీ ఆసక్తిని రేకెత్తించింది. టీజర్కు అద్భుతమైన స్పందన రావడంతో మరింత హైప్ను సొంతం చేసుకుంది. ఈ సినిమా కోసం మ్యూజిక్ సెన్సేషన్ తమన్ మంచి సంగీతాన్ని కంపోజ్ చేశారు. తాజాగా హీరో దుల్కర్ సల్మాన్ 'సిగ్మా' ఫస్ట్ సింగిల్ 'సిగ్మా స్టైల్' ను లాంచ్ చేశారు. తమన్ స్వయంగా కంపోజ్ చేసి ఆలపించిన ఈ ఎనర్జిటిక్ ట్రాక్ మాస్ బీట్లతో అదిరిపోయింది. థమన్ సిగ్నేచర్ స్టైల్ మ్యూజిక్, హైవోల్టేజ్ రిథమ్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సందీప్ కిషన్ తన స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోగా, ఫారియా అబ్దుల్లా కూడా అదిరిపోయే డ్యాన్స్ స్టెప్స్‌తో పాటకు మరింత కలర్ తీసుకొచ్చింది. జేసన్ సంజయ్ రాసిన క్యాచీ లిరిక్స్, థమన్ మాస్ ట్యూన్, సందీప్‌ఫారియా డైనమిక్ పెర్ఫార్మెన్స్ కలిసి 'సిగ్మా స్టైల్'ను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టాయి. ఈ సాంగ్తో సినిమాపై క్యూరియాసిటీ, ఎక్స్‌పెక్టేషన్స్ మరింతగా పెరిగాయి.ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అంబు దాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు. హరిహరసుతన్ వీఎఫ్ఎక్స్ సూపర్వైజర్గా వ్యవహరిస్తున్నారు. చిత్ర ఆడియో హక్కులను సరేగమా సొంతం చేసుకోగా, డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది.సిగ్మా జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# థియేటర్స్ కోసం న్యాయం జరిగే వరకూ పోరాటం


**'ఓ అందాల రాక్షసి' హీరో నిర్మాత షెరాజ్ మెహదీ**



తెలుగు సినిమా పరిశ్రమలో మాఫియా చిన్న సినిమాలను చంపేస్తోందని 'ఓ అందాల రాక్షసి' హీరో, నిర్మాత షెరాజ్ మెహదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రిలీజ్ కే కాదు, రీరిలీజ్కు కూడా థియేటర్లు ఇవ్వలేదని ఇవ్వడం లేదని అన్నారు. థియేటర్స్ ఇవ్వకపోతే ఆత్మహత్య శరణ్యం అన్నారు. తెలుగు ఫిలిం చాంబర్లో నిర్వహించిన ప్రెస్మీట్లో మాట్లాడుతూ మంచి సినిమాలను కిల్ చేస్తున్నారు. చిన్న సినిమాలను చంపేస్తున్నారు. నైజాం ఏరియాలో ఒక్క థియేటర్ కూడా ఇవ్వలేదు. ఇది వ్యూహాత్మకంగా జరుగుతోంది అని షెరాజ్ మెహదీ తెలిపారు. ఈ విషయంపై న్యాయపోరాటం కొనసాగుతోందని చెప్పారు. చిన్న సినిమాల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని ప్రపంచంలో ఎక్కడా లేని పరిస్థితి మన ఇండస్ట్రీలో ఉంది. బాలీవుడ్లో కూడా ఇలా ఉండదు అని వ్యాఖ్యానించారు. సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న సినిమాలకు భారంగా మారుతున్నాయని, ఏడీసీసీ వంటి చార్జీలు కూడా నిర్మాతలను కుంగదీస్తున్నాయని తెలిపారు.చిన్న సినిమాలకు థియేటర్లు, సరైన అవకాశాలు కల్పించకపోతే కొత్త ప్రతిభ ఎదగడం కష్టమవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న సినిమాలను కాపాడాలని పరిశ్రమలో అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని ఇండస్ట్రీ పెద్దలను కోరారు.

పెద్ది సినిమా విడుదలైన రోజు నుంచి ప్రతి రోజు కలెక్షన్స్ పెరుగుతున్నాయని , ఉప్పెన సినిమా కంటే పది రేట్లు ఎక్కువగా తనకు ఫోన్లు వస్తున్నాయని దర్శకుడు బుచ్చి బాబు సాన అన్నారు. సినిమా కథ రాస్తున్నప్పుడే నేను ఊహించిన సక్సెస్ వచ్చిందని అన్నారు.ఈ సినిమా సక్సెస్ కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరు రామ్ చరణ్ యాక్టింగ్ గురించి మాట్లాడుతున్నారని చేప్పారు. ఈ సినిమా చూసి ఇంటికి వెళ్ళాక కూడా సినిమా గురించి చర్చించుకుంటున్నారని ఆయన చెప్పారు. మైత్రి మూవీస్ పంపిణీ దారు శశి మాట్లాడుతూ థియేటర్లు మూసి వేసే పరిస్థితిలో వచ్చిన పెద్ది సినిమా అన్ని థియేటర్లకు లాభాలు తెచ్చి పెడుతోందని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పెద్ద కలెక్షన్స్ వస్తాయని అన్నారు. అన్ని థియేటర్స్‌లో ఫుల్ గా నడుస్తున్నాయని చెప్పారు. విడుదలైన అన్ని కేంద్రాల్లో ఈ సినిమా సక్సెస్ ఫుల్ గా నడుస్తోందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటి వరకు రామ్ చరణ్ కెరీర్ లో ఇవే బిగ్గెస్ట్ కలెక్షన్స్ అని ఆయన అన్నారు. నిర్మాత సతీష్ మాట్లాడుతూ సినిమాను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని చెప్పారు. ఈ సినిమా కలెక్షన్స్ అన్ని చోట్ల బాగున్నాయని, రాబోయే రోజుల్లో కలెక్షన్స్ మరింత పెరుగుతాయని అన్నారు. మరో నిర్మాత మైత్రి రవి మాట్లాడుతూ మేము ఊహించిన దానికన్నా పెద్ద విజయం సాధించిందని చెప్పారు. రాబోయే రోజుల్లో కలెక్షన్స్ భారీగా ఉంటాయన్నారు. సినిమా చూసిన ప్రతి ఒక్కరు రామ్ చరణ్ గురించి మాట్లాడుకుంటున్నారని అన్నారు.

# నేను ఉహించిన సక్సెస్ వచ్చింది పెద్ది దర్శకుడు బుచ్చిబాబు



# న్యాక్‌కు జాతీయ స్థాయి అవార్డు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిర్మాణ రంగంలో అత్యుత్తమ నైపుణ్యాభివృద్ధి సేవలు అందించినందుకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్)కు ఐఎస్‌డిఎ ఇన్ఫ్రాకాన్ నేషనల్ అవార్డ్స్ (ఐఐఎన్ఎ 2026)లో ప్లాటినం అవార్డు లభించింది. అలాగే న్యాక్ డైరెక్టర్ జనరల్, సిఇ (ఆర్ అండ్ బి) క్యాసి ఎం. శ్రీనివాస రెడ్డి ప్రభుత్వ సేవల్లో ఆర్ అండ్ బి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గోల్డ్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డులను శుక్రవారం న్యూఢిల్లీలో ప్రదానం చేశారు. 2025 26 సంవత్సరంలో న్యాక్ రాష్ట్ర వ్యాప్తంగా 21,016 మంది నిరుద్యోగ యువతకు వివిధ నిర్మాణ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతో ఉద్యోగావకాశాలు కల్పించింది. ఈ సందర్భంగా న్యాక్ డిజి శ్రీనివాస రెడ్డి, డైరెక్టర్లు, సిబ్బందిని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభినందించారు.

# అధికారం లేకున్నా పేదల పక్షమే

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు పేద ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎర్ర జెండాను కడుపులో పెట్టుకోని కాపాడుకోవాలని జాలిలేని కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకులు ప్రజల పన్నులతో ధనవంతులుగా ఎదుగుతున్నారన్నారు. సిపిఐ కేవలం రాజకీయ ఉపన్యాసాలకే పరిమితం కాకుండా సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలను బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఏకం చేసిందన్నారు . ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) కార్మికుల హక్కుల కోసం బ్రిటిష్ ప్రభుత్వ దోపిడికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా వందలాది మిల్లు కార్మికుల సమ్మెలను ముందుండి నడిపించిందన్నారు. భారతదేశంలోని అనేక ప్రాంతాలలో బ్రిటిష్ పాలకులకు, వారికి మద్దతుగా నిలిచిన రాజులు, జమీందారులకు వ్యతిరేకంగా సిపిఐ చారిత్రాత్మక సాయుధ ,ప్రజా పోరాటాలు నిర్విహించిందనాన్నరు. నిజాం నవాబు క్రూర పాలనకు, దేశ్ముఖ్‌ల దోపిడికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన రైతాంగ సాయుధ పోరాటం భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద రైతు విప్లవం అన్నారు. కమ్యూనిస్టులకు అనేక పోరాటాలు చేసి జైలు జీవితం గడిపిన చరిత్ర ఉందని, పోలీసు లాఠీ, తుటాలకు ఏనాడు బెదరలేదని తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల త్యాగాలు మరువలేనివన్నారు . భగత్‌సింగ్ వంటి విప్లవకారులు కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితులు కావడం, దేశంలోని అట్టడుగు వర్గాలైన కార్మిక కర్షకులను రాజకీయంగా చైతన్యవంతం చేయడంలో, బ్రిటిష్ సామ్రాజ్యవాద పునాదులను కదలించడంలో సిపిఐ అగ్రభాగాన నిలిచింది అన్నారు. శిక్షణ శిబిరంలో భారత స్వాతంత్ర్య ఉద్యమం సిపిఐ పాత్ర అనే అంశంపై జితేందర్ రెడ్డి బోధించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల కోసం అసెంబ్లీలో మాట్లాడి కమిటీ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించినందుకు నల్లబెల్లి తెలంగాణ ఉద్యమకారులు ఆకుల సాంబశివరావు, పరికి కోర్నెల్, బట్టు సాంబయ్య, తంగెళ్ల భాస్కర్‌ల ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావును ఘనంగా సనాన్మనం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కార్మిక చట్టాలు అమలు చేసి కనీస వేతనాలు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సాంబశివరావుకు జన్ను సుదర్శన్, మామిడి సంపత్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సిపిఐ వరంగల్ జిల్లా రాజకీయ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా నల్లబెల్లి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు . ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్‌కె బాషుమియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, దండు లక్ష్మణ్, అక్కపెల్లి రమేష్, కందిక చెన్నాకేశవులు, బద్రి తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజులు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందన్నారు. జూన్ 5 మధ్యాహ్నం 1 గంట నుంచి జూన్ 6 ఉదయం 8.30 గంటల వరకు రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జూన్ 6 నుంచి 7 వరకు నల్లగొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనాన్నరు. మిగతా జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు. జూన్ 7 నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నాయని, ఈ సమయంలో కూడా గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. జూన్ 9 నుంచి 10 వరకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి , వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.

**ఉష్ణోగ్రతలు తగ్గుముఖం**

జూన్ 5న భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే ఉందన్నారు. అయితే జూన్ 6 నుంచి చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్యకు తగ్గనున్నాయన్నారు. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల కంటే తక్కువకు చేరే అవకాశం ఉందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో రైతులు, ప్ర జలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలవకుండా జాగ్రత్తలు పాటించాలని వాతావరణ అధికారులు సూచించారు. రాష్ట్రంలోని వర్షపాతం పెరగడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారే అవకాశం ఉందన్నారు.










# నేడు సిట్ ముందుకు ఎంపి చామల

(మొదటి పేజీ తరువాయి)

భువనగిరి నియోజకవర్గం నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు ముఖ్య నేతల ఫోన్లు కూడా నిఘాలో ఉన్నట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చామల కిరణ్ కుమార్ రెడ్డిని శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు హాజరుకావాలని సిట్ అధికారులు సమాచారం అందించారు. ఆయన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలకంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురు మాజీ పోలీసు అధికారులు, ఇతర వ్యక్తులను సిట్ విచారించిన నేపథ్యంలో, ప్రజాప్రతినిధుల వాంగ్మూలాల నమోదు ప్రక్రియకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇచ్చే వివరాలు కేసు దర్యాప్తును మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశముందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com